ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 42 పేజీలు: 10+4 వెల: 6.50


పార్లమెంటులో గ్యాస్ మంటలు
5లో
శశికళ పార్టీపేరు ఎఐపిటిఎంఎంకె



శుక్రవారం మూసీ ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

# మూసీకి గోదావరి నీళ్లు తెస్తా

## 20 టిఎంసిల మేర తరలిస్తాం

## చరిత్రను తిరగరాసే గొప్ప అవకాశం ఇది..

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొంటా

## మూసీప్రాజెక్టుపై పిపిటిలో సిఎం రేవంత్

సిఎంకు హరీష్‌రావు 8 సూటి ప్రశ్నలు 7లో

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి13:** మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. శుక్రవారం సాయంత్రం తాజ్‌కృష్ణ హోటల్‌లో మూసీ ఇన్వైట్స్ పేరుతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన మూసీప్రాజెక్ట్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ >>2



# సిఇసిపై అభిశంసన!

## లోక్‌సభ స్పీకర్, చైర్మన్‌కు నోటీసులిచ్చిన విపక్షాలు

## తీర్మానంపై 193 మంది సంతకాలు

## జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే దాకా ఉద్యమిస్తాం: టిఎంసి

**న్యూఢిల్లీ, మార్చి 13:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానం పెట్టాలని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి ఇటు లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, అటు రాజ్యసభ చైర్మన్ హరివన్ష్ నారాయణ సింగ్‌కు నోటీసులు అందజేశారు. ఈనోటీసుల్లో 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు మొత్తం 193 మంది సభ్యులు సంతకాలు చేశారు. సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఒక నిర్దిష్ట వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, మరో ఆరు ఆరోపణలను ఆ నోటీసుల్లో ప్రస్తావించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఆరోపణలు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రధానంగా ఉంది. >>2

# సమరం ముమ్మరం



టెహ్రాన్‌లో విధ్వంసం జరిగిన చోట సహాయకార్యక్రమాలలో పాల్గొంటున్న సిబ్బంది

## దుబాయ్ ఫైనాన్షియల్ సెంటర్‌పై ఇరాన్‌దాడి

## అబ్రహాం లింకన్ నౌకపైనా దాడిచేశాం: ఇరాన్

## ఇక ఇరాన్ నరకం చూస్తుంది: ట్రంప్

## కొత్త సుప్రీం కమాండర్ కోమాలో ఉన్నారంటున్న అమెరికా

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 13:** మధ్యప్రాచ్యం యుద్ధవాతావరణం మరింత ఉధృతం అవుతోంది. రోజురోజుకూ ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రతరం అవుతున్నాయి. యుద్ధంప్రారంభించిన తర్వాత 14రోజు శుక్రవారం ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణులతో గల్ఫ్‌దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ క్షిపణుల దాడులతో ఇరుగుపొరుగుదేశాలు సైరన్లు, ఇంటర్‌సెప్టార్ వ్యవస్థలను చైతన్యంచేసాయి. అమెరికా మిలిటరీ బేస్ ఉన్న ఎమిరేట్స్, బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, జోర్డాన్, ఇజ్రాయెల్‌లలో క్షిపణిదాడులతో ఇరాన్ హోరెత్తిస్తోంది. దుబాయ్ ఫైనాన్షియల్ సెంటర్‌పై ఇరాన్ క్షిపణి దాడులుచేసింది. తమ అణుస్థావరాలపై దాడులకువస్తే తాముసైతం శత్రుదేశాల అణు స్థావరాలపై దాడులుచేస్తామన్నారు. ఇదిలా ఉంటే అమెరికా అతిపెద్ద యుద్ధనౌక అబ్రహాం లింకన్‌పై దాడిచేసామని ఇరాన్‌ప్రకటిస్తే అమెరికా సెంట్‌కామ్ ఇరాన్ ప్రకటనను ఖండించింది. ఇప్పటికీ యుద్ధసేవల్లోనే ఉందని ఎలాంటి విఘాతం కలగలేదని తమనౌకకు సమీపంగా వచ్చిన చిన్న బోట్లను తుదముట్టించామని అమెరికా చెపుతుంటే తమ దాడులకు యుద్ధనౌక ఒమన్ జలాల్లోకి పరారయిందని ఇరాన్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే అమెరికా కెసి 135 రీఫ్యూయల్ విమానం ఇరాక్ గగనతలంలోనే కూలిపోయింది. మొత్తం ఆరుగురు క్రూ సభ్యుల్లో నలుగురు చనిపోయి ఉండవచ్చని అమెరికా చెపుతోంది. ఇరాన్‌లోని టెహ్రాన్ నగరంలో జరుగుతున్న ర్యాలీపై భారీ పేలుడు సంభవించింది. అలాగే ఖజ్విన్‌లోకూడా భారీపేలుడు సంభవించింది. ఈ నగరాలపై దాడులు చేస్తామని హెచ్చరించిన వెంటనే ఇజ్రాయెల్ ఇరాన్ నగరాలపై దాడులు తీవ్రతరంచేసింది. ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాల్లోనే దాడులు జరిగాయి. టెహ్రాన్‌లోని ప్రొటెస్ట్ స్క్వేర్ సమీపంలోకూడా భారీ పేలుళ్లుజరిగి ఒక మహిళ మరణించింది. ఈ ర్యాలీకి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కూడా హాజరయ్యారు. ఇదిలా ఉంటే ఇరాన్‌పై ఇక తీవ్రస్థాయిలో దాడులు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వచ్చేవారం మొత్తం ఇరాన్‌పై భూతలపోరు భారీ స్థాయిలోఉ ంటుందని, ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఉగ్రవాద దేశంగా ఉన్న >>2

# గ్యాస్ కోసం ఆందోళన వద్దు..



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల, ఉత్తమ్ తదితరులు

## సిలిండర్ల పంపిణీ కోసం కంట్రోల్ రూం

## తగినంతమేర నిల్వలు

## బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** గ్యాస్ సరఫరాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతీ గృహ వినియోగదారుడికి అవస రమైనంత మేర ఎల్‌పిజి సిలిండర్లు సరఫరా చేస్తామని రాష్ట్ర పౌరసరఫ రాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గృహ అవసరాల గ్యాస్‌ను పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్‌పిజి అక్రమ విక్రయాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, ప్రభుత్వ వసతి గృహాలకు ఎలాంటి అంతరాయంలేకుండా సరిపడా గ్యాస్ సరఫరా చేయా >>2

# తెలుగు రాష్ట్రాలకు మరో మూడు కొత్త రైళ్లు

**హైదరాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రం మరో గుడ్‌న్యూస్ తెలిపింది. మరో మూడు కొత్త రైల్ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లుతెలిపింది. 2014 నుంచి ఇప్పటివరకు గత 12 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ రైల్వే 91కొత్త రైలు సర్వీసులను ప్రారంభించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెలడించారు. ఈ రైళ్లన్నీ కూడా జంట నగరాల పరిధిలోని రైల్వేస్టేషన్ల నుంచే (హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి టర్మినల్) ప్రారంభమవుతున్నాయి. భారతీయ రైల్వే తీసుకున్న నిర్ణయంలో భాగంగా రైలునం.07191/07192కాచిగూడ-మధురై-కాచిగూడ రైలును రైలు నం. 17165/17616 కాచిగూడ ట్యుటికోరిన్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ఇకపై ఈ రైలు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాచిగూడలో మొదలై మరుసటి రోజు మంగళవారం రాత్రి 10:45 గం.లకు కేరళ రాష్ట్రంలోని ట్యూటికోరిన్‌కు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో ట్యూటికోరిన్ నుంచి బుధవారం ఉదయం 7:45 గంటలకు మొదలై మరుసటిరోజు మధ్యాహ్నం 1:25 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్,గద్వాల, కర్నూల్ సిటి, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్, పీలేరు, పాకాల, చిత్తూరు స్టేషన్లమీదుగా ప్రయాణంసాగి స్తుంది. రైలునం. 07230/07229 >>2

లొంగిపోలేదు.. అరెస్టయ్యాం -దేవ్‌జీ 3లో

# మాజీ డిజిపి హెచ్‌జె దొర కన్నుమూత



## నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి, నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

## ప్రగాఢ సంతాపం ప్రకటించిన తెలుగు సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, ఇతర ప్రముఖులు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి మాజీ డిజిపి హనుమంతు జగన్నాయక్ దొర (హెచ్‌జె దొర) (83) కన్నుమూశారు. ఏడాదిగా మూత్రపిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. పోలీసు శాఖలో తొలితరం అధికారుల్లో అగ్రగణ్యుడుగా ఆయన పేరు గడించారు. 1943లో శ్రీకాకుళంలో జన్మిం చిన దొర ఆంధ్ర యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్‌లో పిజి చేశాక 1965లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఐపిఎస్‌కు ఎంపికై ఉమ్మడి >>2



# ఒక్క సిలిండర్ 5వేలు!

## 'మండుతున్న' వంటగ్యాస్

## అవే కష్టాలు..తీరని ఇక్కట్లు

**న్యూఢిల్లీ, మార్చి 13:** ఇరాన్‌యుద్ధప్రభావంతో చమురు, సహజవాయు సరఫరాలో ఏర్పడిన ప్రతిష్టంభన దేశంలో మరింత కష్టాలను పెంచింది. చిన్న పెద్ద ఒక మోస్తరు పట్టణాల్లోని చిన్న చిన్న స్టాల్స్ అన్నీ మూతపడ్డాయి. మరికొన్ని మధ్యతరహా హోటళ్లలో అయితే కొన్ని ఆహార ఉత్పత్తులను కుదించేసారు. స్టార్‌హోటళ్ల మెను మారిపోయింది. ప్రత్యేకించి వాణిజ్య సిలిండర్లు సరఫఱా ఇప్పటికీ క్రమబద్ధం కాలేదు. సరిపడా నిల్వలున్నాయని, 70రోజులకు సరిపడే చమురు నిల్వలున్నాయని, గ్యాస్ 30శాతం ఉత్పత్తిపెరిగిందని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవేమీ కనిపించడం లేదు. దేశవ్యాప్తంగా మెట్రో నగరాలు, పట్టణాలు మండల కేంద్రాల్లోకూడా సిలిండర్ల చేతపట్టుకుని బారులు తీరి నిలుచున్న వినియోగదారులే కనిపిస్తున్నారు. ముందుగానే లైన్‌గా సిలిండర్లు ఉంచి ఎండలు మండుతుండటంతో పక్కన నీడల్లో కూర్చుని తమవంతు వచ్చే సమయానికి సిలిండర్లు తీసుకుంటున్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కత్తా, హైదరాబాద్‌లలో వంటగ్యాస్ సమస్య ఇప్పటికీ తీవ్ర స్థాయిలోనే కనిపిస్తోంది. యుద్ధం ప్రారంభానికి ముందు రోజుకు 55.7లక్షల >>2






శుక్రవారం హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సిఎం రేంత్ రెడ్డి

## సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ పైనుంచి దూకి

# బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

**చిక్కడపల్లి, మార్చి 13 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లో విషాదం చోటుచేసు కుంది. శుక్రవారం రాత్రి ఓ బీటెక్ విద్యార్థి మెట్రో స్టేషన్ రెండో అంతస్తు నుంచి కిందికి దూకి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యతేజ అనే బీటెక్ విద్యార్థి శుక్రవారం సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్ రెండో అంతస్తులో అకస్మాత్తుగా రైలింగ్ పైనుంచి కిందికి దూకేశాడు. ఇది గమనించిన ప్రయాణికులు, మెట్రో సిబ్బంది షాక్‌కు గురయ్యారు. భారీ ఎత్తు నుంచి కింద పడటంతో యువకుడి తలకు, శరీరానికి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. హుటాహుటిన సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గోపాలపురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కుటుంబ సమస్యలా లేక చదువు ఒత్తిడా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## సిఇసిపై అభిశంసన!

>> తొలుత 2025 నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్' చేపట్టడంపై సిఇసి జ్ఞానేశ్ కుమార్ పనికట్టుకుని ఓ వర్గానికి, పార్టీకి అనుకూలంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అభిశంసన తీర్మానం నోటీసుకు పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకత్వం వహించింది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్-మే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి చెందిన పార్టీల సభ్యులతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపిలు నోటీసుపై సంతకాలు చేశారు. సిఇసిపై ప్రతిపక్షాలిచ్చిన అభిశంసన తీర్మానంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించిన తర్వాత, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సంయుక్తంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ నియమిస్తారు. ఆ కమిటీలో సిజెఐతోపాటు, హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లలో ఒకరు, మరొక న్యాయమూర్తిని సభ్యులుగా ఉంటారు. అభిశంసన తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ పూర్తయిన తర్వాత ఈ త్రిసభ్య కమిటీ ముందు సిఇసి జ్ఞానేశ్ కుమార్ హాజరై తన వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఆ తర్వాత త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయి.

## తెలుగు రాష్ట్రాలకు మరో మూడు కొత్త రైళ్లు

>> హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ రైలును రైలు నం. 17069/17070 హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ఈ రైలు గతంలో లాగే ప్రతి బుధవారం సాయంత్రం 5:20 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు తమిళనాడులోని కన్యాకుమారి చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో కూడా గతంలో లాగే ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 5:15 గంటలకు కన్యాకుమారిలో బయలుదేరి శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి జంక్షన్, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, తెనాలి జంక్షన్, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట జంక్షన్, తిరుపతి, పాకాల జంక్షన్, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుంది. రైలు నం. 07225/07226 చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి రైలును రైలు నం. 17065/17066 చర్లపల్లి షాలిమార్-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ఇకపై ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7:15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు బుధవారం ఉదయం 11:20 గంటలకు పశ్చిమబెంగాల్ షాలిమార్‌కు చేరుకుంటుంది.

## మాజీ డిజిపి హెచ్‌జె దొర కన్నుమూత

>> ఎపి కేడర్‌కు కేటాయించపడ్డారు. దొర ఐపిఎస్‌లో చేరిన సమయంలో ఉమ్మడి ఎపి సహా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో నక్సలైట్ల సమస్య తీవ్రంగా వుండేది. ఆయన హయాంలోనే గ్రేహౌండ్స్‌తో పాటు ఎస్ఐబి విభాగాలు పురుడు పోసుకున్నాయి. ఈ రెండు విభాగాలు వచ్చాక ఉమ్మడి ఎపిలో నక్సలైట్లపై పోలీసులు పైచే యి సాధించగలిగారు. ఐపిఎస్ అధికారిగా ఉమ్మడి ఎపిలో అనేక చోట్ల పనిచేసిన దొర హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, ఆర్టీసీ ఎండిగా, ఇంటెలిజెన్స్ ఐజిగా, సిఐడి అదనపు డిజిగా పనిచేశారు. 1996 నవంబరు 30వ తేదీన చంద్రబాబు నాయుడు సిఎంగా వున్న సమయంలో ఉమ్మడి ఎపి డిజిపిగా ఆయన నియమితులయ్యారు. ఆ పదవిలో ఆయన 2002 ఫిబ్రవరి 18వ తేదీ వరకు కొనసాగి అనంతరం కేంద్ర సర్వీసులోకి డిప్యూటేషన్‌పై వెళ్లి మొదట సిఐఎస్ఎఫ్ డిజిపిగానూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గానూ పనిచేశారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తిగా వుండే దొర భారత ఒలింపిక్ సంఘానికి విశేష సేవలందించారు. భారత హాకీ సంఘం అధ్యక్షుడుగా కూడా కొంత కాలం పనిచేశారు. దివంగత దిగ్గజ ఐపిఎస్ అధికారి, భారత హా కీ సంఘం మాజీ అధ్యక్షుడు పంజాబ్ రాష్ట్రానికి చెందిన కెపిఎస్ గిల్‌కు దొర అత్యంత సన్నిహితుడు. భారత హాకీ అభివృద్ధికి, ఉమ్మడి ఎపి హాకీ సంఘం అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశా రు. భారత హాకీ జట్టులో సుధీర్ఘకాలం ఆడిన హైదరాబాదీ ముఖేష్ కుమార్ సహా పలువురు ఆట గాళ్లు ఆయన హయాంలోనే వెలుగులోకి వచ్చారు. బేగంపేట్ హాకీ స్టేడియం ఆయన హయాంలోనే కొత్త హంగులను సంతరించుకుంది. 2003లో ఆయన పదవీ విరమణ చేశాక 2006లో జిఎంఆ ర్ సంస్థలో సెక్యూరిటీ సలహాదారుగా కొంతకాలం పనిచేశారు. జిఎంఆర్ సంస్థ ప్రతిష్టాత్మకంగా పలు విమానాశ్రయాలను నిర్మించిన సమయంలో అక్కడ భద్రతకు సంబంధించి దొర చేసిన సిఫార్సులు కీలకంగా మారాయి. ఈ సిఫార్సులు ఇప్ప టికీ అమల్లో వుండడం గమనార్హం. ఐపిఎస్ అధికా రిగా ఆయనకు రాష్ట్రపతి పోలీసు పతకంతో పాటు అనేక అవార్డులు అందుకున్నారు. హెచ్‌జె దొరకు ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. దొర భౌతికకాయాన్ని బంజారాహిల్స్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. శనివారం నాడు మహా ప్రస్థానంలో ప్రభుత్వ లాంచనాలతో దొర భౌతికకా యానికి అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా దొర భౌతికకాయాన్ని డిజిపి శివధర్ రెడ్డి సహా పలువురు సీనియర్ పోలీసు అధికారులు, విశ్రాంత ఐపిఎస్ అధికారులు సందర్శించి నివాళులు అర్పించారు.

**దొర మృతిపట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం**

కాగా హెచ్‌జె దొర మృతిపట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి ఎపిలో పోలీసు శాఖలో అనేక సంస్కరణలు తీసుకురావడంలో దొర కీలకంగా వ్యవహరించారని సిఎం కొనియాడారు. అప్పట్లో ఆయన చేబట్టిన సంస్కరణలు పోలీసు శాఖను బలోపేతం చేశాయని సిఎం తెలిపా రు. దొర కుటుంబ సభ్యులకు సిఎం ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు. దొర మృతి పట్ల డిజిపి శివధర్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపా రు. ఉమ్మడి ఎపి హయాంలో పోలీసు శాఖ అభివృద్ధికి దొర ఎనలేని సేవలు అందించారని డిజిపి కొనియాడారు. దొర కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

**దొర మృతిపట్ల సిఎం చంద్రబాబు సంతాపం**

మాజీ డిజిపి దొర మృతిపట్ల ఎపి సిం చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం తెలిపారు. పోలీస్ శాఖకు ఎంతో సేవ చేశారని ఆయ హయాంలో పోలీస్ శాఖ ఎంతో బలోపేతం అయ్యిందని చంద్రబాబు తెలిపారు. దొర కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మూసీకి గోదావరి నీళ్లు తెస్తా

>>కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని గట్టిగా చెప్పారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చిద్దామన్నారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తు న్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకు న్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిసారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన ప్రశ్నించారు. కన్యాకుమారి లాగా బాపూఘాట్ కూడా రెండు నదుల సంగమం అని ఎంతమందికి తెలుసునని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టినట్లు తెలిపారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు చేపట్టామని వివరించారు. గాంధీ విగ్రహానికి సుమారుగా రూ.75 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అంబేద్కర్ విగ్రహానికి రూ.250కోట్లు ఖర్చు చేస్తే తాము వ్యతిరేకించలేదని సీఎం రేవంత్ చెప్పారు. అధికారాన్ని కాపలాదారుగా ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కాదు అనేది మా ప్రభుత్వం నమ్ముతుది, అందుకే ముఖ్యమంత్రిగా ఒక బాధ్యతతో ఈ కార్యక్రమం ద్వారా వాస్తవాలను ప్రజలకు చెప్పాలని భావించామని పేర్కొన్నారు. మానవ నాగరికత నది చుట్టూనే అభివృద్ధి చెం దింది ప్రపంచ దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తుంటే.. మనం వెనకబడితే భవిష్యత్ తరం మనల్ని క్షమించదు అని పేర్కొన్నారు. అన్ని వర్గాల మేధావులతో సమావేశమై ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశంపై సూచనలు తీసుకున్నామని చెప్పారు. 1908 మూసీ వరదలు నగరాన్ని ముంచెత్తాయి ఆ సమయంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో సంప్రదించి వరదల నియంత్రణకు హిమాయత్ సా గర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లను నిజాం నిర్మించారు వందేళ్లుగా వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడటమే కాదు.. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆ రిజర్వాయర్లు ఉపయోగపడుతున్నాయి. గొప్ప వారసత్వ సంపద కలిగిన ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా? నేను ఎవరినీ విమర్శించదలచుకోలేదు, కానీ విజ్ఞప్తి చేయదలచుకున్నా.. పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకోవడం సమస్యకు పరిష్కారం కాదు.. ఎందుకు అడ్డుకుంటున్నారో కారణం చెప్పండి.. ఏదైనా తప్పులు ఉంటే సూచనలు చేయండి అని పేర్కొన్నారు. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదు.. 1994 నుంచి ఇప్పటి వరకు పరిపాలనలో పాలసీ పెరాలసిస్ ఎప్పుడూ రాలేదు ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినా కొంతమందినే గుర్తుంచుకుంటాం దార్శనికతతో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి చేసిన వారే చరిత్రలో గుర్తుంటారు ఆనాడు హైదరాబాద్ నగరాన్ని నిజాం ఎకనామిక్ జోన్ గా తీర్చిదిద్దారు అలాంటి నగరాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ ఆనాడు అస్థికలు కలిపారు. అంతటి చరిత్ర ఉన్న బాపూ ఘాట్‌ను ఎంతమంది పర్యాటకులు సందర్శిస్తున్నారు? అని ప్రశ్నించారు. కాలుష్యంతో మూసీ నది విషతుల్యంగా మారింది మానవ తప్పిదాలతో నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో పుట్టిన మూసీ నది హైదరాబాద్ కు వచ్చే సరికి కాలుష్యమయంగా మారుతోంది మూసీకి, హైదరాబాద్ నగరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా? లేక మూసీనదితో పాటు హైదరాబాద్ నగరాన్ని పునరుజ్జీవింపజేసుకుందామా? ఎవరికో నష్టం కలిగించాలన్నది మా ప్రభుత్వ ఉద్దేశం కాదు.. మూసీ పరివాహక ప్రాంతంలో బుల్డోజర్లు తీసుకెళ్తున్నారని కొందరు అంటున్నారు కేంద్రం తెచ్చిన చట్టాన్ని అమలు చేస్తామంటే కొందరు అడ్డుపడతామంటున్నారు కేవలం ఇది మూసీ పునరుజ్జీవనం మాత్రమే కాదు.. మన సంస్కృతిని, చరిత్రను కాపాడుకోవడం అందులో భాగంగానే అని చెప్పారు. నల్ల చెరువు, బతుకమ్మ కుంట బమ్రూక్ ఉద్దౌలా వంటి చెరువులను పునరుద్ధరించాం ఇవాళ మూసీ పునరుజ్జీవనాన్ని నివసించగలరా వాళ్లు ఉంటానంటే అన్ని సౌకర్యాలతో కంటైనర్ హౌస్ ఇస్తా.. మూడు నెలలు అక్కడ ఉండగలరా? ఎందుకు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.. పేదలకు సరైన మౌలిక వసతులు కల్పించొద్దా? బ్లూ కాలర్ జాబ్స్ క్రియేట్ చేయొద్దా? అని కొందరు మాట్లాడుతున్నారు.

## సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు

# వెంటనే సిద్ధం చేయాలి: రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్ మార్చి13:** ఈనెల 16 వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాదానాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ శనివారం లోగా సమాధానాలు పంపించాలని అన్నారు. నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

## ఒక్క సిలిండర్ 5వేలు!

>> సిలండర్లు బుక్ అయ్యేవని, ఇపుడు యుద్ధంజరుగుతున్న రోజుల్లో రోజుకు 75.7 లక్షల సిలిండర్లు బుక్ అవుతున్నట్లు కేంద్ర ఇంధన శాఖ జాయింట్ కార్యదర్శి సుజాతశర్మ వెల్లడించారు. అలాగే ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా కాల్‌సెంటర్లను కూడా పెంచామని, 400కు పెంచి టెలిఫోన్ లైన్లు 50వరకూ పెంచినట్లు కేంద్రం చెపుతోంది. చమురు, గ్యాస్ సరఫరా కొరతను అధిగమించేందుకు ఇప్పటి వరకూ 27 దేశాలనుంచి దిగుమతిచేసుకుంటున్న భారత్ ఇకపై 40 దేశాలనుంచి దిగుమతిచేసుకుంటున్నట్లు ప్రకటించింది. హార్ముజ్ జలసంధి ద్వారా భారత్‌నౌకలప్రయాణానికి ఇరాన్ ఎలాంటి అభ్యంతరాలు లేవని ప్రకటించిందని గుర్తుచేసిన కేంద్ర ఇంధన శాఖ దేశీయంగా ఉన్న గ్యాస్ అవసరాలను మాత్రం అసలు సమస్యే లేదన్నట్లుగా చెపుతుండటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక దేవాలయాల్లో నిత్యాన్న పథకానికి గ్యాస్ ఇక్కట్లు పెరిగాయి.

**ఆగని బ్లాక్ మార్కెటింగ్**

సిలిండర్లు బుక్‌చేద్దామని నంబరుకు డయల్‌చేస్తే ఆఫోన్‌లు పనిచేయడంలేదు. గ్యాస్ డీలర్ షిప్ ఏజెన్సీలవద్ద స్పందనే ఉండటంలేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. అయితే బ్లాక్‌లో మాత్రం సిలిండర్లు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. 14 కిలోల సిలిండరును రూ.1800 నుంచి 2000వరకూ విక్రయిస్తుంటే వాణిజ్య సిలిండర్లు మాత్రం ఐదువేల రూపాయలు దాటి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్టార్ హోటళ్లదగ్గర్నుంచి రోడ్డుపక్కన విక్రయించే చిరుతిళ్ల వ్యాపారులకు కూడా వాణిజ్య సిలిండర్లు అత్యవసరం కావడంతో విధిలేనిపరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్‌రెవెన్యూ, పౌరసఫరాల అధికారులు సంయుక్తంగా బృందాలుగా ఏర్పడిన తనిఖీలుచేయాలని ఆదేశాలు జారీచేసారు. దీనితో కొంతవరకయినా బ్లాక్‌మార్కెటింగ్ తగ్గుతుందని అంచనా. కొరతను తగ్గించేందుకు బుకింగ్ అవధిని 25 నుంచి 45 రోజులకు పెంచినప్పటికీ కష్టమర్ల అవసరాలకు తగినట్లు సరఫరా పునరుద్ధరణ కాలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉత్పత్తిరంగ సంస్థలు, తేయాకు పరిశ్రమలు 80శాతం సరఫరాను అందుకున్నాయని, పంపిణీ కంపెనీలు కూడా సరఫరాను క్రమబద్ధీకరించుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

## గ్యాస్ కోసం ఆందోళన వద్దు..

>> లని ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాలశాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలు, పోలిస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న ప్రచారంలో నిజం లేదని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వినియోగదారులకు అసౌకర్యం కలిగిస్తే గ్యాస్ ఎజెన్సిలు, డీలర్లను ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక నిత్యావసర వస్తువుల సరఫరాలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని నిర్దేశించారు. గ్యాస్ సరఫరాపై అపోహలు పడొద్దని, ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దని, బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. జిల్లాల్లో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోనే ఈ దుస్థితి నెలకొందన్నారు. ప్రజలకు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని చెప్పారు. అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడనందుకుగాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేకాధికారుల కమిటి ఏర్పాటు చేసి రోజువారి నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకో సారి గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని గ్యాస్ వినియో గదారుల కు మంత్రి ఉత్తమ్ సూచించారు. గృహ వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని, ప్రభుత్వం పరిస్థితులను సమీక్షిస్తుందన్నారు.



శుక్రవారం అమరావతిలో ఏపి హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ ప్రమాణం దృశ్యం. జస్టిస్ లిసాతో ప్రమాణం చేయించిన సిజె ధీరజ్ ఠాకూర్

## సమరం ముమ్మరం

>> ఇరాన్‌ను పూర్తిగా నాశనంచేస్తామని ట్రంప్ వెల్లడించారు. సైన్యం పరంగాను, ఆర్థికంగాను, అన్ని వైపులనుంచి కూడా ముప్పేటదాడులతో ఇరాన్‌ను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. 47 ఏళ్లుగా అమాయక ప్రజలను చంపేస్తున్నారని, ఇపుడు అమెరికా 47వ అధ్యక్షుడుగా వారందరినీ ఖతంచేస్తామని అన్నారు. ఇరాన్ ఇపుడు లొంగిపోయేస్థితికి చేరిందని జి7 దేశాల నాయకులతో వర్చువల్ సమావేశంలోట్రంప్ వెల్లడించారు. అంతేకాకుండా పెరిగిపోతున్న అసమ్మతి నిరసనను సర్దుబాటుచేసుకునేందుకు రష్యాచమురు కొనుగోలుకు అమెరికా అనుమతులు కూడా జారీచేసింది.

ఇరాన్‌సుప్రీం లీడర్ గాయపడ్డారు..అమెరికా అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సె త్‌మాట్లాడుతూ ఇరాన్‌సుప్రీం లీడర్ మొజ్తబా ఖమైనీ తీవ్రంగా గాయపడినట్లు ప్రకటించారు. ఆయన శరీరం గాయాలమయం అయిందని, గుర్తుపట్టలేని విధంగా మారినట్లు భావిస్తున్నామని అన్నారు. ఆయన్ను రహస్య ప్రాంతంలో ఉంచి చికిత్స చేస్తున్నట్లు తమకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్‌తోకలిసి 15 వేల టార్గెట్లపై దాడులుచేసామని, ఇతర అన్ని స్థావరాలు కూడాధ్వంసంచేస్తామన్నారు.

## మహిళలకు రూ.2,500 సాయంపై బడ్జెట్‌లో ప్రకటన?

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** వచ్చే 2026-27 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సంబంధించిన ముఖ్యమైన పథకాన్ని ప్రకటించనుంది. ఆరు గ్యారంటీ హామీల్లో ఇప్పటికే ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకు గ్యాస్ సిలెండర్ తదితర పథకాలను అందుబాటులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ తాజాగా మరో హామీని అమలు చేసేందుకు సిద్ధమైంది. మహిళలకు నెలకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి అర్హులైన మహిళలకు ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించనుంది. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ, ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ పథకాలు కాంగ్రెస్ సర్కార్‌కు మంచి మైలేజీ వచ్చేలా చేసింది. దీంతో రూ. 2,500 ఆర్థిక సహాయం పథకాన్ని అమలు చేసినట్లయితే వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో పురుషుల కంటే అధికంగా ఉన్న మహిళా ఓటర్ల ఆదరాభిమానాలు పొందవచ్చని భావి స్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులు ఈ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో ప్రకటించనున్న యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.

## ఆర్టిసీలో సమ్మె సైరన్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజి ఆర్టిసి)లో మరోసారి సమ్మె సైరన్ మోగింది. ఆర్టిసి కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు కార్మిక జెఎసి నాయకులు శుక్రవారం ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వ విభాగంగా గుర్తించి, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2021 వేతన సవరణ 30శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని కోరారు. ఆర్టిసిని బలోపేతం చేసేందుకు కొత్త బస్సులను ప్రవేశపెటాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ.350కోట్లను కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందిస్తున్నా, తమ బతుకుల్లో మార్పు రావడం లేదని, విలీనం ప్రక్రియను వేగవంతం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 26 నుండి ఆర్టిసి బస్సు చక్రాలు ఆగిపోక తప్పదని జెఎసి హెచ్చరించారు.

## వారం - వర్జ్యం

14-03-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
దశమి ఉ.8.10
ఉత్తరాషాఢ తె.4.48
వర్జ్యం : ఉ.8.59-10.40
దు.ఉ.6.17-7.53
శుభసమయం:ఉ.5.30-6.30,సా.6.30-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఎవరి మాటలను లెక్కచేయకుండా ధర్మబద్ధంగా మీ బాధ్యతలను నిర్వహిస్తారు. చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**వృషభం:** ముఖ్యముగా గంటలు - గంటలుగా ప్రతీ విషయంలో ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి. వస్త్రలాభం.

**మిథునం:** ఎంతో శ్రమించి ప్రత్యేక శ్రద్ధవహించినప్పటికి వృత్తులలో సాధారణ ఫలితాలే లభిస్తాయి.వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** వివాహాది శుభకార్యములకు సంబంధించి చర్చలు వ్యూహాలు పురోభివృద్ధిలో ఉంటాయి. ఆరోగ్యం జాగ్రత్త.

**సింహం:** మీ నుండి ఉపకారము పొందినవారినుండే తిరిగి మీరు సహాయము పొందవలసివస్తుంది.

**కన్య :** శారీరక, మానసికోల్లాసానికి యోగా, ధ్యానం వంటివి ఉపకరిస్తాయి. కుటుంబ పురోగతి బాగుంటుంది. వాహనసౌఖ్యం.

**తుల:** జమా ఖర్చులకు సంబంధించిన వాటిలోని ఒడిదుడుకులు గుర్తించి మౌనంగా కార్యచరణలో మార్పులు చేసారు.

**వృశ్చికం:** రాజకీయంగా గానీ, ఉద్యోగాలలో గానీ, ఉన్నతస్థితి సాధించడానికి అధికంగా శ్రమించి సానుకూలపడతారు.

**ధనుస్సు:** గృహ సంబంధమైన సమస్యలు ఎడతెరిపిలేని మీ ఆలోచనలవలన మానసిక వత్తిడి అధికం అవుతుంది. ఆరోగ్యంజాగ్రత్త.

**మకరం:** కోర్టు వ్యవహారాలు సానుకూలపడతాయి. కృషితో ఎంతటి కార్యక్రమాలనైనా సాధించవచ్చని నిరూపిస్తారు.

**కుంభం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. తద్వారా కొంత లాభపడుతారు. స్పెక్యులేషన్లకు దూరంగా ఉండండి.

**మీనం:** కృషితో ఎంతటి కార్యక్రములనైనా సాధించవచ్చని నిరూపిస్తారు. ఆర్థిక వ్యవహారాలతో గోప్యత చెప్పదగినది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




# హాకీ మ్యాచ్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

## ఉరుగ్వే-ఆస్ట్రియా మధ్య వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఉరుగ్వే- ఆస్ట్రియా జట్ల మధ్య జరిగిన మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ను గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర మంత్రులు సీతక్క , అజారుద్దీన్ ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మంత్రి సీతక్క ఇరు జట్ల క్రీడాకారిణులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, ఈ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో మహిళల హాకీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధునిక క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తెలంగాణలో నిర్వహించడం ద్వారా రాష్ట్రం అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. క్రీడలు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని అన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీలను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలోని తొలి క్రీడ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎటిజి చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్‌సింగ్, క్రీడాశాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌కు ప్రధాని గైర్హాజరు బాధాకరం

## పిసిసి అధికార ప్రతినిధి గౌరిసతీష్

**హైదరాబాద్, మార్చి 13,ప్రభాతవార్త:** అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా విపత్కర పరిస్థితి నెలకొన్న ప్రస్తుత పరిస్థితిలో పార్లమెంట్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరుకాకపోవడం ఆక్షేపణీయమని పిసిసి అధికార ప్రతినిధిగౌరి సతీష్ ఒక ప్రకటనలో ఖండించారు. హిందూ మహాసముద్రంలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌకను ముంచివేస్తే కనీసం స్పందించకపోవడం కారణంగా భారత విదేశీదౌత్య వ్యవహారాలకు తీవ్రమచ్చ ఏర్పడిందని ఆవేదన చెందారు. మన అజవ హాయిషీలో ఉండే మహాసముద్ర జలాల్లో ఇంతటి ఘోరం జరిగితే విశ్వగురువు కావాలనుకునే వారు ఇలా మౌనంగా ఉంటారా అని ప్రశ్నించారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలోని అన్ని రంగాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. యుద్ధం కారణంగా దేశప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించడానికి మోడీకి ఎందుకు భయపడుతున్నారని అడిగారు. హోటల్ రంగం ఇంత ఇబ్బందుల్లో ఉంటే ఇంధన సరఫరా విషయంలో కేంద్రం చోద్యం చూస్తున్నదని ఆరోపించారు. ఇంధన సరఫరాపై కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి హోటల్ ఇండస్ట్రీని, మధ్యతరగతి ప్రజలను కాపాడాలని కోరారు.

# సైన్యంలో 'అహిర్ రెజిమెంట్' ఏర్పాటు చేయాలి

## రాజ్యసభలో ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** భారత సైన్యంలో యాదవ సామాజిక వర్గం చూపిస్తున్న ధైర్యసాహసాలను గుర్తించి అహిర్ పేరుతో ప్రత్యేక రెజిమెంట్ ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం రాజ్యసభలో 'ప్రత్యేక ప్రస్తావన' ద్వారా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తుతూ దేశరక్షణలో అహిర్ల పాత్ర మరువలేనిదని, నాదిర్‌షా, తైమూర్ దండయాత్రల నుంచి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం వరకు వారు ప్రదర్శించిన పోరాటపటిమ అనన్య సామాన్యమని కొనియాడారు. 1962 ఇండో-చైనా యుద్ధంలో రెజాంగ్‌లా పోరులో యాదవ సైనికులు చూపిన తెగువ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్గిల్ యుద్ధంతో పాటు అనేక పోరాటాల్లో వారు ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం భారత సైన్యంలో జాట్, సిక్కు, డోగ్రా, గూర్ఖా వంటి వివిధ సామాజిక వర్గాల పేరుతో రెజిమెంట్లు ఉన్నాయని అదే తరహాలో అహిర్ల కోసం ప్రత్యేక రెజిమెంట్ ఏర్పాటు చేయాలన్నది ఆ వర్గ ప్రజల చిరకాల కోరికని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించేందుకు వెనకాడని అహిర్ల సేవలను గుర్తించి, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని అనిల్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ డిజిపి హెచ్‌జె దొర మృతికి

# సిపి సజ్జనార్ సంతాపం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 13, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిజిపి హెచ్.జె. దొర మృతి పట్ల హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పోలీస్ శాఖకు తీరనిలోటని పేర్కొన్నారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న క్లిష్ట సమయంలో హెచ్‌జె దొర డిజిపిగా బాధ్యతలు స్వీకరించి పోలీస్ శాఖను సమర్థవంతంగా నడిపించారని కొనియాడారు. రాష్ట్రంలోనే అత్యధిక కాలం డిజిపిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. దొర తన తొలి పోలీస్ బాస్ అని, వారి వద్ద ఎంతో నేర్చుకున్నానని సజ్జనార్ గుర్తు చేసుకున్నారు. దొర కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు.

**పలువురి సంతాపం..**

దొర భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో సందర్శనార్థం ఏర్పాటు చేశారు. రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి, మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి, ఐపిఎస్ అధికారులు సుధీర్‌బాబు, విశ్రాంత అధికారులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కమలాహాసన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దొర అంత్యక్రియలను శనివారం జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

### తప్పనిసరి పరిస్థితుల్లో

### అలా జరిగింది..

### మాజీ మావోయిస్టు నేత దేవ్‌జి వెల్లడి

# లొంగిపోలేదు.. అరెస్టయ్యాం

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట ఇటీవలే లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత తిపిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవ్‌జీతో పాటు బడె చొక్కారావు, నల్ల రాజిరెడ్డి, నరసింహారెడ్డి లొం గిపోగా తమది లొంగుబాటు కాదని తామంతా అరెస్టయ్యామని దేవ్‌జీ చెప్పడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ క ంట్రోల్‌లో వీరంతా లొంగిపోగా అదే సమయంలో వీరికి రివార్డులు కూడా అందించారు. లొంగిపోయిన సమయంలో తామంతా సిఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలుస్తున్నట్లు చెప్పడం తెలిసిందే. రాజిరెడ్డి మాత్రం మావోయిజం ఎప్పటికీ అంతం కాదని, ప్రపంచం వున్న oత వరకు, సామాన్యుల సమస్యలు వున్నంతకాలం వుంటుందని వెల్లడించారు. అయితే శుక్రవారం నాడు దేవ్‌జీ తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ మేమంతా లొంగిపోలేదు, అరెస్టు చేశారని తెలిపారు. అయితే ఈ అరెస్టంతా తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిందని ఆయన తెలిపారు.
మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఎక్కడ వున్నాడనేది తమకు తెలియదని ఆయన తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ పూర్తిగా క్షీణించిందని, మారిన పరిస్థితుల్లో పోరాటం సాధ్యం కాదని దేవ్‌జి పేర్కొన్నారు. 2023లో చివరిసారిగా సెంట్రల్ కమిటీ సమావేశం జరిగిందని, ఆ తరువాత పార్టీకి దిశా నిర్దేశం చేసేవారు లేకుండా పోయారని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ ఒక రాజకీయ పార్టీగా దేవ్‌జి తెలిపారు. రాజకీయ పార్టీ నడవాలంటే డబ్బులు కావాలని ఆయన వెల్లడించారు. పార్టీలో వున్న డబ్బులను కేవలం నగదు రూపంలోనే కాకుండా బంగారం కొనుగోలు చేస్తే బాగుంటుందని భావించి భారీగా బంగారాన్ని కొన్నామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు పార్టీ వద్ద కిలోల కొద్ది బంగారం వుం దని, కోట్లాది రూపాయల నగదు వుందని దుష్ప్రచారం జరిగిందని, ఇది సరైంది కాదని ఆయన తెలిపారు. తాను రాజకీయ జీవితాన్ని ప్రారంభిస్తున్నానని చెబితే ఈ విషయంలోనూ అందరు అపార్థం చేసుకున్నారని దేవ్‌జి తెలిపారు. పార్లమెంటరీ వ్యవస్థలోని ఎంఎల్‌ఎ, ఎంపి, ఎంఎల్‌సి కావాలని తనకు లేదని, ప్రజల్లో వుండి వారి కోసం న్యాయపరంగా పోరాటం చేయడమే తన రాజకీయ జీవిత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇక మావోయిస్టుల్లో కొందరు జైల్లో వున్నారని వీరిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# నిజామాబాద్ జిల్లాలో ప్రైవేటు బస్సు బోల్తా.. నలుగురి దుర్మరణం

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో గురువారం అర్థరాత్రి హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని అకోలాకు వెళుతున్న ప్రైవే టు బస్సు ఒక మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణీకులు దుర్మణం చెందారు. నిజామాబాద్‌లోని ఇందల్వాయి మండలం గన్నారం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో బస్సులో 22 మంది ప్రయాణీకులు వున్నారు. వీరంతా హైదరాబాద్ నుం చి వివాహం కోసం అకోలాకు వెళుతున్నారు. మరణించిన వారిలో మంజూషా (29)అనే మహిళతో పాటు ఆమె కుమారుడు రిషి (7), అబ్బాస్ (22 ), ఇంకో వ్యక్తి వున్నాడు. ఇదే ఘటనలో మరో 15 మంది గాయపడగా వీరిలో పది మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వీరిని వెంటనే జిల్లా ఆ సుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**బస్సు ప్రమాదంలో ఎనిమిది రామచిలుకల మృతి**

కాగా ఇదే ఘటనలో ప్రయాణీకులతో పాటు ఒక బుట్టలో కుక్కినట్లు వున్న 60 రామ చిలుకలు వుండగా ప్రమాద తరువాత ఈ బుట్ట దూరంగా ఎగిరిపడింది. ఈ ఘటనలో ఎనిమిది రామ చిలుకలు ఊపిరి ఆడక మరణించాయి. ఈ ఘటన తరువాత పోలీసులు, రవాణా శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని రామ చిలుకల బుట్టను వేరుచేసి సజీవంగా వున్న వాటికి మంచీనీరు తాగించి సమీపంలోని అడవుల్లో వదిలిపెట్టారు. గాయపడి ఎగురలేని రామ చిలుకలను స్థానిక పశువైద్య శాలకు తరలించి చికిత్స అందించారు. ఇవి కోలుకున్న తరువాత స్వేచ్ఛగా వదిలిపెడతామని అధికారులు తెలిపారు. రామచిలుకలను అక్రమంగా తరలిస్తున్న ఘటనపై పోలీసులు వేరుగా విచారణ చేబట్టారు.



నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో బోల్తాపడిన బస్సు

# రాష్ట్రంలో గ్యాస్ కంపెనీలు, సిలిండర్ల తరలింపు వాహనాలకు పోలీసు బందోబస్తు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** మధ్య ఆసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కంపెనీలతోపాటు గ్యాస్ సిలిండర్లు తరలించే వాహనాలకు పరిస్థితులను బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది.
గ్యాస్ సంక్షోభం వల్ల దేశ వ్యాప్తంగా వాణిజ్య సిలిండర్లకు భారీగా కొరత ఏర్పడడం తెలిసిందే. దీనివల్ల అనేక రాష్ట్రాలలో హోటళ్ల మూతపడ గా చాలాచోట్ల కట్టెల పొయ్యిలపై వంటలు సాగుతుండడం విదితమే. మరికొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్ల చోరీలు జరగడంతో ఈ వ్యవహారం పోలీసుల వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్ల తరలింపులో ఎక్కడా ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వుండేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయిం చింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు గృహావసరాలకు గ్యాస్ సరఫరాలో కొంతమేర ఇబ్బందు లువున్నా తీవ్రమైన సంక్షోభం మాత్రం ఎదురవ్వలేదు. అయితే గ్యాస్ కంపెనీలపై ఒత్తిడి మాత్రం ఎక్కువయ్యింది. చాలాచోట్ల వినియోగదారులు ముందుజాగ్రత్త చర్యగా అదనపు సిలిండర్లను కొనుగోలు చేయడం వల్ల గ్యాస్ కంపెనీలపై ఒత్తిడి పెరిగింది. ఇది మరింత పెరగకుండా వుండేందుకు గ్యాస్ కంపెనీల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించిం ది. ఈ మేరకు అన్ని జిల్లాల పోలీసులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో పాటు గ్యాస్ కంపెనీలకు చమురు కంపెనీల నుంచి వచ్చే సిలిండర్ల లారీల వెంట బందోబస్తు కొనసాగించాల ని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. చమురు సంక్షోభం కొలిక్కి వచ్చేవరకు ఈ బందోబస్తు కొనసాగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

## 15, 16 తేదీల్లో పిడుగులు, ఈదురుగాలులు

## 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

## అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** మండే ఎండలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఇప్పటికే తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 9గంటల దాటితే బయటకు రావాలంటే ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి. ఇక మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం సమయంలో ఉక్కపోతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ చల్లటి కబురు తీసుకొచ్చింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈనెల 15, 16 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణలోని 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్ (10 సెంటీమీటర్ల వరకు వర్షపాతం)ను జారీ చేసింది. అదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఈదురు గాలులు వీచే అవకాశం ఉంటుందని.. ఆ సమయాల్లో ప్రజలు చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఉండే ప్రాంతాల్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. మరోవైపు ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు, వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు పొలాల్లో కోత దశలో ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు పడితే రైతులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోపక్క తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో గడచిన 24 గంటల్లో భద్రాచలంలో సాధారణంకన్నా 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహబూబ్ నగర్‌లో 40 డిగ్రీలు, ఖమ్మంలో 30, అదిలాబాద్‌లో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే, వర్షాల వచ్చే నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ఎండల తీవ్రత తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.


NOTICE U/S 17 OF THE SERFAESI ACT, 2002 R/W RDB ACT, 1993
BEFORE THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD

S.A.NO. 300 OF 2025

Between:
Mr.Kiran Jalagam & another ... Applicants
And
Union Bank of India. And others ...Respondents
To,
1. Mr. V.Krishna Rao, S/o.V.Janaki Ramaiah, Age 60 years, Occ: Business, R/o. 11.No 3-64,Hastinapuri Colony, Sainikpuri, Secunderabad-500096
2. Mr. Koneru Raja Sekhar, S/o. Koneru Babu Rao, Age 46 years, Occ: Business, R/o. Plot No 43, Navnirman Colony, Jubilee Hills, Hyderabad -500033
3. Mrs. V.Vijaya Lakshmi, W/o. Koneru Babu Rao, Age 62 years, Occ: Business, R/o. Banjara Hills, Hyderabad-500034
4. Mr. G.Sridhar Goud, S/o.G.Dayanand, Age 35 years. Occ: Business, Rep by M/s. Shreya Homes, R/o. Flat No.103, TNR Vaishnavi Apartments, Domalguda, Hyderabad -500029,
(RESPONDENTS NO.3 TO 6)


An application under Section 17(1) of the Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002 has been filed before this Tribunal (a copy of application is enclosed). Show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply, if any, in your defence in the paper book form in 2 complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through duly authorized agent or legal practitioner and appear before the Tribunal on 15-04-2026 at 11.00 A.M., failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply advance copy of reply to the SA to the counsel for the applicant.
1. Copy of the SA along with stay petition is enclosed herewith. Copy of Annexures is also enclosed. A digital copy of the application along with all annexures is also available on DRT system. You are directed to get the same downloaded along with all the annexures on your appearance before this Tribunal.
2. If you intended to file any documents, you may file the same with a list along with reply statement by using the link.
Given under my hand and seal of this Tribunal on 12th day of March 2026.

(By order of the Tribunal)
Registrar,
DRT-2, Hyderabad.


# దేశీయ మార్కెట్లకు రూ.33 లక్షల కోట్ల మేర నష్టం

## వార్ ఎఫెక్ట్!

## భారీస్థాయిలో క్షీణించిన ఇన్వెస్టర్ల సంపద



**న్యూఢిల్లీ, మార్చి 13:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటి నుంచి వారాంతం వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల సంపద కర్పూరంలా కరిగిపోయింది. గతనెల 28వ తేదీ నుంచి ఇప్పటివరకూ చూస్తే 33 లక్షలకోట్లమేర టర్నోవర్ క్షీణించింది. సెన్సెక్స్ నిఫ్టీలు భారీ స్థాయిలో క్షీణించడమే ఇందుకు కీలకం. ముడిచమురుధరలు పెరిగిపోవడం, బ్యారెల్ 100 డాలర్లకు పైబడి ట్రేడ్ కావడం ఒక ఎత్తు అయితే డాలరుతో రూపాయి మారకం విలువలు మరింతగా క్షీణించడం, భౌగోళిక ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్లుతమతమ సొమ్ములు విత్‌డ్రాచేసుకోవడమే ఈ నష్టాలకు కారణం అన్నది తెలిసిందే. కేవలం భారత్‌లోనే కాకుండా విదేశీ మార్కెట్లలో కూడా నష్టాలపరంపర కొనసాగింది. శుక్రవారం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సొమ్ములు ఏకంగా రూ.10 లక్షలకోట్లు నష్టపోయినట్లు తేలింది. బిఎస్‌ఇలో లిస్ట్ అయిన కంపెనీల విలువలు 439.72 లక్షలకోట్లనుంచి 43139 లక్షలకోట్ల విలువలకు తగ్గిపోవడంతో ఒక్కరోజే ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు సంభవించాయి. వీటికితోడు హార్ముజ్ జలసంధినుంచి చమురు,గ్యాస్ ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోవడం కూడా నష్టాలకు కొంత తోడయింది. మొత్తం 20శాతం చమురుసరఫరా ప్రత్యామ్నాయ మార్గాలవైపు వెళ్లాల్సి వచ్చింది. దీనితో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకుపై బడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్ ఇతర ఆ రెండు దేశాల మిత్రదేశాలకు హార్ముజ్ జలసంధి నుంచి వెళ్లేందుకు అనుమతించబోమని కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరికలు చేయడంతో నౌకా రవాణా పూర్తిగా నిలిచింది. ఇరాన్ ఆమోదించిన దేశాల నౌకలు మాత్రమే ఇపుడు హార్ముజ్‌ద్వారా వస్తున్నాయి. వీటిలో చైనా, భారత్‌ల ఉన్నాయి.
ఈ నెలలోని 13 రోజుల్లో తొమ్మిదిరోజులు స్టాక్ మార్కెట్లు నడిచాయి. సెన్సెక్స్ 6700 పాయింట్లు పతనం అయితే నిఫ్టీ రెండువేల పాయింట్లకు పైబడి నష్టపోయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు సుమారు రూ.52 లక్షలకోట్ల షేర్లు విక్రయించేసారు.

# అగ్రి వర్సిటీ పి.జి, పిహెచ్‌డి విద్యార్థులకు స్టైపెండ్ పెంచాలి

## ఆందోళనలకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** స్టైపెండ్ పెంపు కోసం వ్యవసాయ విశ్వ విద్యాలయ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణంగా మద్దతు ప్రకటించింది. పరిశోధన విద్యార్థులు ఉన్నత విద్యా రంగానికి ముఖ్యమైన బలమని పేర్కొంది. దేశంలో విజ్ఞాన,సాంకేతిక అభివృద్ధి, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపడంలో పరిశోధనలకు కీలక పాత్ర ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, కార్యదర్శి టి. నాగరాజు గుర్తు చేశారు. ఈ విషయమై శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ వర్సిటీలో పరిశోధన చేస్తున్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీవన వ్యయం, వసతి, ఆహారం, పరిశోధన ఖర్చులు వంటి అంశాల నేపథ్యంలో ప్రస్తుత సైఫండ్ సరిపోవడం లేదని, దీంతో అనేక మంది ప్రతిభావంతమైన విద్యార్థులు పరిశోధనను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పి.జి., పీహెచ్‌డీ విద్యార్థుల సైఫండ్ కోసం ,అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఈ బడ్జెట్ లో రూ.500 కోట్లు ఇవ్వాలని విద్యార్థులు చేస్తున్న డిమాండ్ న్యాయసమ్మతమైనదని వారు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిరక్ష ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పరిశోధన విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ హెచ్చరిస్తోందన్నారు


hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-III, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ బిల్డింగ్, # 6-1-2/1, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్-500063
టెండర్ ప్రకటన
NIT No. HMDA/DEV/EE/DIV-III/2025-26, తేది : 10.03.2026
డివిజన్-IIIలో క్రింది పనికి టెండర్ కోరబడుతున్నది. క్ర.సం.1. NIT No తేది: HMDA/DEV/EE/DIV-III/2025-26, తేది: 10.03.2026. లోకేషన్: హైదరాబాద్ లుంబినీ పార్క్ వద్ద లేజర్ షో కాంప్లెక్స్‌కు (పాత స్వింగ్స్) ఝూలాల నుండి డ్రైనేజ్ లైన్ యొక్క మరమ్మతులు మరియు రిలేయింగ్. బిడ్ దాఖలుకు చివరి తేది: 23.03.2026 మ.3.00గం. వరకు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in వీక్షించండి.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-III, HMDA.
DIPR.NO. 16976-PP/CL/ADVT/1/2025-26 తేది: 13.03.2026


# కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాల్సిందే




కరెన్సీపై అంబేద్కర్ ఫొటో కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, ఈటల రాజేందర్, అప్పల నాయుడు, ఆళ్ల రామకృష్ణ తదితరులు

## పార్లమెంట్‌లో నినదిస్తాం

## జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, ఈటల

**హైదరాబాద్ (నాంపల్లి), మార్చి 13, ప్రభాతవార్త :** భారత కరెన్సీ నోట్లపై బి.ఆర్.అంబేద్కర్ ఫొటో తప్పకుండా ముద్రించాలని పలువురు ఎంపిలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంటు వేదికగా నినదిస్తామని, కేంద్రంపై ఒత్తిడి తెస్తామని కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఢిల్లీపై దండోరా మహాధర్నాలో ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, వెంకట సత్యనారాయణ, ఈటల రాజేందర్, కలిశెట్టి అప్పలనాయుడు, మల్లు రవి, ఒబిసి ఇంట లెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, అఖిల భారత ఒబిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు గౌడ్ కిరణ్‌కుమార్, కంఠ వేణు, తైకొండ శ్రీను తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు ప్రసంగిస్తూ అంబేద్కర్ లేకుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదని, కరెన్సీ పై ఆయన ఫొటో ముద్రించకపోవడమంటే చరిత్రను విస్మరించినట్లే ధ్వజమెత్తారు. ఈ అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించి ప్రధాని నరేంద్రమోడీ దృష్టికి తీసుకువెళతామని ఎంపిలు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయిస్తామని మల్లు రవి హామీనిచ్చారు. టిడిపి ఎంపి అప్పలనాయుడు ఈ అంశాన్ని ఎపి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లానని, కేంద్ర ఆర్థికశాఖ, ఆర్బీఐకి లేఖ రాశానని తెలిపారు. అనంతరం మిగతా నాయకులు ప్రసంగించారు.


INDIAN AIR FORCE
AIR FORCE SPORTS CONTROL BOARD
RECRUITMENT OF OUTSTANDING SPORTSMEN
APPLICATIONS ARE INVITED FROM OUTSTANDING UNMARRIED MALE SPORTSMEN TO JOIN INDIAN AIR FORCE AS AGNIVEERVAYU (SPORTS) INTAKE 02/2026
DETAILED ADVERTISEMENT AVAILABLE ON HTTPS://AGNIPATHVAYU.CDAC.IN
ONLINE APPLICATIONS ARE TO BE SUBMITTED FROM 1000 Hr ON 23 MARCH 2026 TO 1700 Hr ON 29 MARCH 2026
AT HTTPS://AGNIPATHVAYU.CDAC.IN/CASBSPM
TENTATIVE DATES FOR SELECTION TRIALS AT NEW DELHI FROM 08 APRIL TO 10 APRIL 2026
CBC 10803/11/0032/2526

వార్త

ప్రతి ఒక్కరూ ఒక విషయాన్ని గురించి తరచుగా ఆలోచిస్తుంటారు. దాన్ని గురించి బహిరంగంగా చెప్పగలవాడే విజయవంతమైన రాజకీయవేత్త.

- థియోడర్ రూజ్వెల్ట్

# మరో అభిశంసన!

కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియ ఆ సంస్థ ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన తీర్మానం వరకు తీసుకెళ్లింది. ఆది తతనుంచి ఈ ప్రక్రియలో లోపాలపై విపక్షాలు విరుచుకుపడుతూనే ఉన్నా సిఇసి వ్యవహారశైలి ప్రజల్లో కానీ విపక్ష నేతల్లో కానీ విశ్వాసం నింపలేకపోతోంది. మూడు రోజుల క్రితం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పశ్చిమ బెంగాల్‌కు వెళ్లినప్పుడు తనను కలిసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలను చిరాకుపడిన సన్నివేశాలు వారిని బాధించాయి. ఇన్నాళ్లూ 'సర్' ప్రక్రియలో లోపాలు ఎత్తిచూపినప్పుడల్లా సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటూ విపోఆలను సముదాయిస్తూ వచ్చింది. కాగా మొదట్లో విపక్షనేత రాహుల్ గాంధీపై సిఇసి సవాళ్లు విసరడంతో వివాదం ముదిరి పాకానపడింది. ఓటర్ల జాబితా సవరణ విషయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టు తలుపు తట్టాక ఆమెపై సిఇసి గుర్రుగా ఉన్నారు. ఆ నేపథ్యంలోనే సిఇసి ఆ రాష్ట్రానికి వెళ్లినప్పుడు కలిసిన తృణమూల్ నేతల బృందంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వారికి కోపకారణమైంది. బీహార్ రాష్ట్రంలో ఓటర్ల సవరణ ప్రక్రియ మొదలయ్యాక కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఎన్నికల కమిషన్‌పై తిరుగుబాటు మొదలైంది. వలస జీవుల ఓట్లు తీసివేయడం అక్రమమంటూ చేపట్టిన ఉద్యమం తారాస్థాయికి చేరింది. సుప్రీంకోర్టు కెక్కిన 'సర్' వివాదంలో ధర్మాసనం తీవ్రంగానే స్పందించింది. ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు సూచనలు, మార్గదర్శకాలు ఇస్తూ ఓ కొలిక్కి తెచ్చింది. సిఇసి కేంద్రంలోని అధికార పార్టీ చెప్పు చేతల్లో నడుస్తోందని అనేక ఆరోపణలున్నా బీహార్‌లో అక్కడి అధికార ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీయే గెలుపొందడంతో ఆతర్వాత కాంగ్రెస్ పార్టీ కాస్తంత మెతకబడింది. కానీ ఈసారి విపక్ష పార్టీలోని ఇతర భాగస్వామ్య పార్టీలు వాళ్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తమ ఓటర్లను తొలగించి సిఇసి ఎక్కడ అపకారం చేస్తుందోనన్న భయంతో రాహుల్ గాంధీ ఉద్యమాన్ని వాళ్లు అందిపుచ్చుకున్నారు. కాగా ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ మరికొన్ని రాష్ట్రాలలో ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేసింది. మరో 11రాష్ట్రాలలో ఇదే కార్యక్రమాన్ని చేపట్టడానికి సన్నద్ధమైంది. త్వరలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. నేడో రేపో ఎన్నికల ప్రకటన జారీ అయ్యే అవకాశముంది. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల ఎన్నికలు మరింత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం కృతనిశ్చయంతో ఉంది. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ ప్రక్రియపై నిఘా ఉంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంతక్రితం బీహార్‌లోనూ ఇదే జరిగింది. ఇదిలాఉండగా పశ్చిమ బెంగాల్ ఓటరు జాబితా ముమ్మర సవరణ (సర్)లో పేరు నమోదుకు నోచుకోలేక పోయినా, తిరస్కృతికి గురైన వారి విజ్ఞప్తులను న్యాయధికార్లే పరిశీలన చేస్తారని, వారి సేవలపై ఎలాంటి అనుమానాలు కూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం హితవు చెప్పింది. 'సర్'పై లేవనెత్తిన విమర్శలు, తద్వారా ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ప్రక్రియలోఏమాత్రం ఆస్కారం ఉన్నా సందేహాలు వ్యక్తం చేయడం పరిపాటిగా జరిగింది. సుప్రీంకోర్టు ఈ అంశంలో ఎన్నోసార్లు జోక్యం చేసుకుని ఉభయ వర్గాలకు ఎన్నో హితబోధలు చేసింది. అయినా ఈ ప్రక్రియపై ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఓటరు జాబితాలనుంచి పేర్ల తొలగింపును ఎదుర్కొంటున్న వారి అభ్యంతరాలను పరిష్కరించే బాధ్యత తను న్యాయాధికారులకు ఇవ్వరాదన్న పిటీషన్లపైతాజాగా సుప్రీం తీవ్రంగా స్పందించింది. ఇలాంటి పిటిషన్లతో న్యాయాధికారుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు జరిగే ప్రయత్నాలపై తీవ్ర చర్యలు తప్పవని ధర్మాసనం హెచ్చరించింది. ఓటర్ల అర్జీల పరిష్కారం కోసం స్వతంత్రఅప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, వాటికి హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తులే సారథ్యం వహిస్తారు. ఇంత స్పష్టంగా సుప్రీంకోర్టు చెబుతున్నా బెంగాల్ నుంచి అనేక సందేహాలు తలెత్తితే ఈసారి వారి అభ్యంతరాలను పట్టించుకునేవారుండకపోవచ్చు. అర్హులైన ఓటర్లనెవరినీ తొలగించబోమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఎంతో స్పష్టంగా వివరించారు. కానీ ఆయన కదలికలను కూడా భరించలేని పరిస్థితుల్లో విపక్షాలుండటం సమంజసం కాదు. రాబోయే పశ్చిమబెంగాల్ ఎన్నికలలో 6వేల మందికి పైగా శతాధిక వృద్ధులు, 5.23 లక్షల మంది యువజనులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని సిఇసి ప్రకటించారు. సిఇసి కోల్‌కతా పర్యటనలో నిరసనలు వ్యక్తమయ్యాయి. కొందరు నల్ల జెండాలతో 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఇలాంటివి ప్రజాస్వామ్యబద్ధమేనని చెప్పుకున్నా సరైన పద్ధతి కాదు. శాసనసభ గడువు ముందే ఎన్నికలు జరగడం రాజ్యాంగ బద్ధమే. కానీ ఎన్నికల వ్యవస్థపై పదేపదే వివాదానికి దిగడం అరాచకమే అవుతుంది. ఏమైతేనేం చివరాఖరికి పశ్చిమబెంగాల్ చిచ్చు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన తీర్మానానికి నోటీసులిచ్చారు. సిఇసిది రాజ్యాంగపదవి కనుక ఆయన వ్యవహారశైలి విపరీతంగా ఉన్నందున ఆయనను తొలగించారని 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ సభ్యులు అభిశంసన తీర్మానం నోటీసును శుక్రవారం ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టారు. సిఇసి తొలగింపు కోరే తొలి నోటీసు ఇది. ఇలాంటి నిరసన వ్రతం లోక్‌సభ చరిత్రలో ఇదే ప్రథమం.



నొప్పించే మాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయ సంగతమైన మార్గం అవుతుంది.

తిరుక్కురళ్



ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతులు నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులుగాని అవుతారు.

వి.జాన్సన్

# రైతు బతుకుతో ఆటలాడొద్దు!

**వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు వ్యవసాయానికి మంగళం పాడితే పరిస్థితి ఏమిటో పాలక పెద్దలు ఆలోచించాలి. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావలసిన ఆహారోత్పత్తులు వారి 'చెమట' పుణ్యమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

ఎవరి గోల వారికి ఆనందం అంటారు. నిరంతరం రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పై ఎత్తులు, ఇంకొక పక్క ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, మరోవైపు రాష్ట్రాల ఆధీనంలో ఉన్న ఎసిబి, సిఐడి, సిట్‌ల దర్యాప్తులతో రాజకీయ పార్టీలు మునిగితేలుతుంటే సామాన్యుడు అనేక సమస్యలతో అతలాకుతలం అవుతున్నాడు. అటు పార్లమెంటులో కానీ, ఇటు ఆయా రాష్ట్ర శాసనసభల్లో జరుగుతున్న సమావేశాల్లో కానీ సామాన్యుల సమస్యలేవీ కనీసం ప్రస్తావన లేకుండాపోతున్నాయి. దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఏ సమస్యలు లేనట్లు రాజకీయంగానే చర్చోపచర్చలు జరుగుతున్నాయి. అవిశ్వాస తీర్మానాలు, నిరసనలు, వాక్ అవుట్లతో పుణ్యకాలం గడిచిపోతున్నది. వాస్తవంగా చూస్తే దేశప్రజలు అనేక గడ్డు సమస్యలను ఎదుర్కొంటున్నారు. కరోనా రక్కసి సృష్టించిన బీభత్సం నుండి ఇంకా ఎన్నో రంగాలు పూర్తిగా కోలుకోలేదు. కరోనా సమయంలో అంత క్లిష్టపరిస్థితిని ఎదుర్కొని నిలబడ్డ వ్యవసాయరంగం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోజురోజుకు కుదేలైపోతున్నది. తమను ఎవరు ఎంతకాలం మోసం చేసినా, తమలో తాము కుమిలిపోవడం తప్ప అన్నదాతలు నోరు విప్పరు. బాధ కలిగినప్పుడు ఏడిస్తే ఉపశమనం కలుగుతుందంటారు. అందుకే ఎవరైనా చనిపోయినప్పుడు వారి ఆత్మీయులు ఏడుస్తుంటే ఆపకుండా ఏడవనిస్తారు. దీంతో వారికి బాధ, భారం తగ్గినట్లు భావం కలిగి ఊరట చెందుతారు. అలాగే కొన్ని సందర్భాల్లో బాధ, నష్టం కలిగించినవారిపై ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. వారిని తిట్టడంతోనో, కొట్టడంతోనో లేక వారికి రెట్టింపు నష్టం చేయడంలోనో కొందరు సంతృప్తి చెందడం పరిపాటి. అలాంటి వారిపై చర్యలు తీసుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు మళ్లీ రోదనే శరణ్యం. ఏడుపుల ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందినా, సమస్య పరిష్కారం మాత్రం కనుచూపుమేరలో కన్పించదు. అలాంటి పరిస్థితుల్లోనే గత్యంతరం లేక ఆత్మహత్యలవైపు మొగ్గుచూపుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో దేశంలో దాదాపు నాలుగున్నర లక్షలమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకొన్నట్లు సమాచారం. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. ప్రకృతి పెట్టే ఇక్కట్లు కొన్ని అయితే తోటి మానవుడు పెడుతున్న బాధలు మరికొన్ని. ప్రకృతి సిద్ధంగా వస్తున్న ఇబ్బందులు ఎదుర్కోవడానికి మానవుడు కొంతమేరకు సిద్ధమవుతుంటాడు. అందులో భాగంగానే తుఫాన్ బీభత్సం, కరవు కాటకాలతో వచ్చే బాధలను మోయగలుగుతున్నాడు. కానీ తమకు సేవ చేస్తానంటూ, తోటిమానవుడు చేస్తున్న దగాలను భరించలేకపోతున్నాడు. అలాగని ఎదురించి నిలదీయలేకపోతున్నాడు. అందుకే వ్యవసాయం వ్యాపకంగా జీవనం సాగించాలనుకుంటే ముందుగా ఏడ్వడం నేర్చుకోవాలంటారు పెద్దలు. ఎంతో అనుభవంతో పెద్దలు ముందుచూపుతో చెప్పిన మాటలివి. రైతుల కష్టాలు విత్తేదగ్గర నుంచి విక్రయించేవరకు కొనసాగుతున్నాయి. నకిలీ, నాసిరకం విత్తనాలతో మోసపోయి పెట్టిన పెట్టుబడి సర్వం కోల్పోయినప్పుడు ఆగ్రహావేశాలు ఆపుకోలేక బాధ్యులైనవారిని నిలదీస్తే వారిని దాడి చేయడానికి వచ్చారని కేసులు పెట్టి పోలీసులకు పట్టిస్తారనే భయంతో ఏమీ చేయలేక నిస్సహాయకస్థితిలో మౌనరోదనకుగురవుతున్నారు. ఇలా ఒక సందర్భంలో కాదు, కరెంటు సమస్య వచ్చినా, మోటారు కాలిపోయి పొలం ఎండిపోతున్నా, నకిలీ పురుగు మందులు, ఎరువులతో దగాపడినా, వీటన్నింటిని మించి పండిన పంటను అమ్ముకోనే సమయంలో తరుగు, తూకం పేరుతో కళ్లముందే తమ కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నా మళ్లీ

## ఒక్క మాట

దుఃఖపడటమే తప్ప ఏమి చేయలేని నిస్సహాయస్థితి. అన్నింటికంటే మించి రైతుల సంక్షేమమే తమ లక్ష్యం, ధ్యేయం అంటూ తాము కట్టే పన్నులతో జీత భత్యాలు నెలనెలా తీసుకొంటున్న కొందరు అధికారులు భక్ష కులుగా తయారై దళారులకు రక్షకులుగా మారి అన్నదాతల కడుపు కొడుతున్నా మౌనరోదనే శరణ్యం అవుతన్నది. గతంలో ఎన్నో ప్రయాసలకు ఓర్చి పండించిన పంట ఇంటికి చేరుకోగానే హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకునే రైతులకు ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. పండించిన పంటలు మార్కెట్‌కు వచ్చి ధర నిర్ణయమై డబ్బులు చేతికి వచ్చేవరకు టెన్షన్‌లోనే బతుకుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా దళారులు రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అన్నీఇన్నీ కావు. ఉన్నత స్థాయిలో ఆదేశాలు, నిబంధనలు అన్ని సక్రమంగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా కొందరు అధికారులు, మరికొందరు ప్రజాప్రతినిధులు, ఇంకొందరు మిల్లర్లు దళారులతో మమేకం కావడంతో అన్నదాతల కష్టాలు పరాకాష్టకు చేరుకొన్నట్లు సమాచారం. దంచేవాడు బుక్కకుండా ఉంటాడా అన్నట్లు ఎవరు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ రైతన్నలను దోచుకునేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతల శాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నదేమోననిపిస్తున్నది. ఈ అవినీతి అధికారుల నుండి రైతన్నలను కాపాడాలి. ఇక కొన్ని ప్రాంతాల్లో ధాన్యం అమ్మిన తరువాత డబ్బులు ఇవ్వడానికి నెలలు కాలం పడుతున్నదనే రైతుల ఆవేదన. ఇలా అన్ని వైపులా బాధలు ఎక్కువ కావడంతో తమలో తాము కుమిలిపోతున్నారు. చివరకు ఆనాటి పెద్దలు చెప్పిన ఏడుపులు కూడా వారికి ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. ప్రస్తుతం టమోట, ఉల్లి రైతుల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా అందే పరిస్థితి లేదు. ఇక మొన్న చిత్తూరు జిల్లాలో పూల రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన వందలాది టన్నుల బంతి, కనకాంబరాలు, తదితర పూలను కొనేవారు లేక రోడ్లపై పోసేసారు. ఈసారి మామిడి పంట పరిస్థితి కూడా ఆశాజనకంగాలేదు. వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా వ్యాపించిన తెగులుతో చాలా మామిడి తోటల్లో పూత రాలిపోయింది. యేడాది పాటు కష్టం చేసి కాపాడిన పంట తెగుళ్లకు బలి కావడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయం కాక మరేదైనా జీవన విధానం ఎన్నుకోగలిగినా లభించినా, చిన్న, పెద్ద అనే తేడాలేకుండా అధికశాతం రైతులు వ్యవసాయాన్ని విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొందరు వ్యవసాయానికి తిలోదకాలు ఇచ్చారు. ఏరైతు తమ సంతానాన్ని వ్యవసాయం చేయించడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం తీవ్రసంక్షోభంలో ఉన్నదనేది కాదనలేని వాస్తవం. సకాలంలో సరైన పెట్టుబడి పెట్టినా, ఫలితం పొందలేక రుణభారంతో కృంగిపోతూ మరోసారి ప్రకృతి పర్యావరణం వల్ల నష్ట పోతూ, అప్పుపుట్టక, ఇల్లు గడవక దేశవ్యాప్తంగా ఎన్ని కోట్ల కుటుంబాలు అవమానాలు భరిస్తూ హృదయవేదనతో జీవచ్ఛవంలా బతుకు వెళ్లదీస్తున్నారో చెప్పలేం. యేడాది పొడుగునా కుటుంబానికి అయ్యే అన్ని ఖర్చులు వ్యవసాయం మీదనే రాబట్టుకోవడం కష్టసాధ్యమవుతున్నది. పిల్లల చదువులు, మందులు, బట్టలు, అన్ని ఖర్చులకు అన్నదాతలు వ్యవసాయం మీదనే ఆధారపడాల్సి ఉంది. ఈఖర్చులన్నీ విపరీతంగా పెరిగిపోయాయి. కానీ వ్యవసాయం మీదవస్తున్న ఆదాయం అంతంత మాత్రమే. దేశంలో అన్నదాతల సగటు ఆదాయం నెలకు పదమూడువేల ఆరు వందల అరవై ఒక్క రూపాయి మాత్రమే. అందుకే కొందరు రైతులు మిర్చి, పత్తి లాంటి అధిక ఆదాయం ఉండే వాణిజ్యపంటలవైపు మొగ్గుచూపి ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నారు. వాణిజ్యపంటల సాగు ఒక జూదంలా తయారైంది. పంటలు సమృద్ధిగా పండి రైతుల ఆర్థిక పరిస్థి తులు బాగుపడాలంటే రుణవసతి, నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని క్రిమిసంహారక మందులు, ఎరువులు, నీటి వసతి, వీటన్నింటిని మించి గిట్టుబాటు ధర ప్రధానమైనది. ఇందులో ఎక్కడ లోపం జరిగినా రైతు దెబ్బతినక తప్పదు. కేంద్ర, రాష్ట్ర పాలకులు వ్యవసాయం విషయంలో మనసు పెట్టి ఆలోచించాల్సిన తరుణమిది. వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చర్యలు తీసుకో వాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు వ్యవసాయానికి మంగళం పాడితే పరిస్థితి ఏమిటో పాలక పెద్దలు ఆలోచించాలి. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావలసిన ఆహారోత్పత్తులు వారి 'చెమట' పుణ్యమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ●

# చరిత్ర ఎప్పుడూ పోరాడేవాళ్ల పక్షమే!

మహమ్మద్ ఆరిఫ్

అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖుమేనీ వీరమరణం పొందారు. అయితే ఘర్షణలు తీవ్రమైన సమయంలోనే ఇరాన్‌ను విడిచిపెట్టి రష్యాకు రావాలని అక్కడి పాలకులు ఆహ్వానించినా.. ఆయన తిరస్కరించినట్టు కొన్ని నివేదికలు చెప్తున్నాయి. బంకర్‌లో తలదాచుకోవాలని చెప్పినా ససేమీరా అన్నట్లు వార్తలు వస్తున్నాయి. రణక్షేత్రాన్ని విడిచి పారిపోయేది లేదని, తల వంచేది లేదని ఆయన తెగేసి చెప్పినట్లు సన్నిహితులు చెప్తున్నారు. అయితే ఈ పరిణామం మరోసారి ఒక చారిత్ర సత్యాన్ని ప్రపంచానికి గుర్తు చేస్తున్నది. జీ హుజూర్ అని బానిసలా బతకడం కంటే నమ్ముకున్న సిద్ధాంతం కోసం, దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన వారినే చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. చరిత్ర ఎప్పుడూ సింహాసనాల మీద కూర్చున్న వాళ్లను గుర్తుంచుకోలేదు. ఆ సింహాసనాలను ఎదిరించి ప్రాణాలు త్యాగం చేసిన వాళ్లనే ఆరాధించింది. ఇందుకు ఇస్లాం హిస్టరీలో కర్బలా మైదానమే ఒక పెద్ద ఉదాహరణ. ఆనాడు వేలాది మంది యజీద్ సైన్యం ముందు హజ్రత్ హుస్సేన్ తన చిన్నపాటి అనుచరణ గణంతో కలిసి పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆ క్షణంలో అది ప్రత్యర్థి విజయంగా కనిపించి ఉండొచ్చు. కానీ శతాబ్దాలు గడిచినా ప్రపంచం నేటికీ కన్నీటితో స్మరించుకుంటున్నది, ధర్మానికి ఆదర్శంగా తీసుకుంటున్నది హజ్రత్ హుస్సేన్ త్యాగాన్నే. అధికార మదంతో అణచివేయాలని చూసే వారి ముందు మోకరిల్లడం కంటే ధర్మం కోసం, న్యాయం కోసం ప్రాణాలివ్వడమే నిజమైన గెలుపు అని ఆ ఘట్టం నిరూపించింది. ఆధునిక ప్రపంచంలోనూ అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ఎదిరించి ప్రాణాలు కోల్పోయిన నాయకులు అనేకం ఉన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి చమురు దిగ్బంధనంతో పాశ్చాత్యదేశాలను గడగడ



లాడించిన సౌదీ పాలకుడు షా ఫైజల్ సైతం తన ధిక్కార స్వరానికే ప్రాణాలను మూల్యంగా చెల్లించుకున్నారు. సామ్రాజ్యవాదుల కుట్రలకు బలైనా, ఆయన పోరాట స్ఫూర్తిఅరబ్ ప్రపంచంలో నేటికీ ఒక చెరగని ఆదర్శంగా నిలిచిపోయింది. ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ అమెరికా దళాలలోఆఖరి వరకు పోరాడి, శత్రువు చేతికి చిక్కి ఉరికంబం ఎక్కారు. లిబియా నేత గడాఫీ సైతం పశ్చిమ దేశాల దాడులను ఎదిరించి, దారుణ హత్యకు గురయ్యారు. వారి రాజకీయ విధానాల్లో తప్పొప్పులు ఎలా ఉన్నా అగ్రరాజ్యాల ముందు మోకారిల్లడానికి బదులు వారు పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. వారి ధిక్కార స్వరాన్ని వారి మద్దతుదారులు ఎప్పటికీ మరిచిపోలేరు. క్యూబా విప్లవవీరుడు చేగువేరా సైతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడి బొలీవియా అడవుల్లో నెత్తుటి నేలపై ఒరిగారు. నేటికీ ప్రపంచవ్యాప్తంగా యువత గుండెలపై ఆయనబొమ్మే స్ఫూర్తిగా నిలవడానికి కారణం ఆ పోరాట పటిమే. మన దేశ చరిత్రలోనూ ఇలాంటి పోరాటయోధులకు కొదవలేదు. గొర్రెల్లా వందేళ్లు బతకడం కన్నా సింహంలా ఒక్క రోజు బతకడం మేలు అని చాటిచెప్పిన మైసూర్ పులి టిప్పుసుల్తాన్ బ్రిటిష్ సైన్యంతో యుద్ధభూమిలో పోరాడుతూ ప్రాణాలు వదిలారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల స్వేచ్ఛ కోసం భగత్ సింగ్ కేవలం ఇరవై మూడేళ్ల వయసులోనే ఉరికంబంఎక్కారు. మన్యం వీరు అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ తుపాకులకు ఎదురొడ్డి ప్రాణాలు వదిలారు. సుభాష్ చంద్రబోస్ లాంటి వీరులు విదేశీగడ్డపై సైన్యాన్ని సమీకరించి, పోరాడి అదృశ్యమయ్యారు. వీరంతా తమ ప్రాణాలను పణంగా పెట్టారుకాబట్టే నేటికీ మనగుండెల్లో చిరంజీవులుగా నిలిచిపోయారు. విజయం సాధించినట్టు కనిపించిన వారంతా చరిత్రపుటల్లో నిలిచిపోరు. కానీ ఒక ఆదర్శం కోసం, తమ దేశ ప్రజల కోసం, స్వాతంత్ర్యంకోసం, బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం ఆఖరి రక్తపు బొట్టు వరకు పోరాడిన వారు మాత్రం మరణం లేని మహనీయులవుతారు. పోరాటంలో ఓటమి ఎదురైనా ప్రాణాలు కోల్పోయినా సరే రాబోయే తరాలకు వారు ఒక చెరగని స్ఫూర్తిగా మిగిలిపోతారు. ప్రాణభయంతో ఆధిపత్య శక్తులకు జీ హుజూర్ అన్న వారు కాలగర్భంలో కలిసిపోతారు. ●

# ప్రజావాక్కు



### వంట గ్యాసు.. సరఫరాలో లాసు

వంటగ్యాసు సిలిండర్ బుక్ చెయ్యడానికి పదేపదే ప్రయత్నిస్తున్నా ఏజెన్సీ నుండి స్పందన లేదు. చాలా మందికి ఇదే సమస్య మొదలైంది. ధర పెరగడం పక్కన పెడితే సరఫరాకూడా పట్టాలుతప్పింది. కారణంసుస్పష్టం. అమెరికా ఇరాన్ యుద్ధంమధ్యలో ప్రపంచ ఇంధన భద్రత చితికిపోతోంది. మన దేశం అందుకు అతీతం కాదు కానీ ఇంతత్వరగా దుష్ప్రభావాలు సోకడం ఆలోచించదగ్గ ది. ఎలాంటి విధానాల ద్వారా బాహ్య ప్రభావాల్ని తక్కువ నష్టానికి నియంత్రించగలమో, పరాధీనత నుండి బయట పడగలమో ఆలోచించి, అమలు చేయకపోతే మున్ముందు కష్టం. ఇకవంటగ్యాసు విషయానికివస్తే దాదాపు60 శాతం వరకూ దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. పశ్చిమాసియా నుండి హోర్ముజ్ జలసంధి మార్గంలో రాకపోకలు మూసుకుపోయాయి.

- డా.డి వి జి శంకరరావు, విజయనగరం

### ప్రజల్లో నమ్మకం కలిగించాలి!

ప్రజల ఆరోగ్యం ఏప్రభుత్వానికైనా అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఆరోగ్యకరమైన సమాజం దేశ అభివృద్ధికి పునాది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులు సామాన్య ప్రజలకు ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఇంకాచాలామందిలో ప్రభుత్వ ఆస్పత్రులపై పూర్తి స్థాయి నమ్మకం ఏర్పడలేదనే అభిప్రాయం కనిపిస్తోంది. ఈపరిస్థితిని మార్చడం అత్యవసరం. గత కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వాలు ఆరోగ్య రంగంపై గణనీయమైన పెట్టుబడులు పెట్టాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### చర్యలు తీసుకోవాలి

నెల్లూరు జిల్లా కలెక్టరు రెవిన్యూ విషయంలో పరిష్కారంలోనంబరు వన్ అనేది అబద్ధం. దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవలసిన ప్రిన్సిపల్ సెక్రటరి 2021 లోఆదేశిస్తే ఇంతవరకు అమలుకాలేదు. దొంగస్వామివత్తిళ్లకు లొంగినఅధికారులు అలైనేషన్ పేరుతో ఏదో ఒక రేటుకుదొంగస్వామికి అమ్మాలని చూస్తున్నారు. వీరిపై చర్యలుతీసుకోవాలి.

-నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### చిన్నారుల ఆర్తనాదాలు

యుద్ధం అంటే కేవలం రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదమో, ఆయుధాల ప్రదర్శనో కాదు. అది మానవత్వంపై పడే ఒక తీరని మచ్చ. బాంబుల మోత, తుపాకుల గర్జనల మధ్య చితికిపోతున్నది సామాన్యుల బతుకులేకాదు, రేపటి పౌరులైన చిన్నారుల భవిష్యత్తు కూడా. ఇటీవలి కాలంలో వైరల్ అయిన ఒక చిన్నారి వీడియో 'ఆకలితో అలమటిస్తున్నాం.. దయచేసి యుద్ధాలు వద్దు' అన్న ఆ వేడుకోలు.. ఆధునిక నాగరికత అని చెప్పుకుంటున్న ప్రపంచ సమాజపు మనస్సాక్షిని నిలదీస్తోంది. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య దాడులు ఇప్పుడు పరిధి దాటాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలు అనేవిచక్షణ లేకుండా కురుస్తున్న బాంబుల వర్షంలో వేల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, గాజానేడు 'చిన్నారుల శ్మశానవాటిక'గా మారింది.

-ఇ. శ్రీనివాస్ రావు, హైదరాబాద్

### గత ప్రభుత్వ పథకాలు అమలు చేయండి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల దినోత్సవం సందర్భంగా డబుల్ బెడ్ రూమ్లను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఇవ్వటానికే లబ్ధిదారులకు కేటాయించాల్సి నది కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్లుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒకరకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలుచేకూర్చే బాగోగులు చూసే పథకాలను ప్రణాళిక వినియోగించడం తీసువచ్చి ప్రజలకు లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### యుద్ధంతో పెరుగుతున్న ఆకలికేకలు

అమెరికా ఆధిపత్య ఆకలికి మరొక దేశం మాత్రమే కాదు ప్రపంచంలో ఉన్న సరఫరా చైన్ సిస్టం అంత ఆగం అవుతున్నది. ఇప్పుడు ఏమికావాలి ఇన్ని రోజులు వివిధదేశాల మధ్య తగాదాలు పెట్టి ఆయుధాలు అమ్ముకొని బ్రోకరిజం చేసిన అమెరికా నేడు చమురుకొరతను సృష్టించి ఆ అవకాశాన్ని వాడుకొని సొమ్ము చేసుకోవాలి అని చూస్తున్నది. దీంతో అమెరికా వ్యాపారం స్థితిని విస్తరింపజేసుకోవడం, ఆధిపత్యం వహించి చైనాకు అడ్డుకట్ట వేయడం ఈరెండుఎజెండాలతో ముందుకి వెళ్తున్నది.

-భారత అవినాష్, జనగామ

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నవ నేపాల్‌కి ఆశాకిరణం బాలేన్ షా



డాక్టర్ తిరుణహరి శేషు

రాజకీయ అస్థిరతకి మారుపేరైన ఈ హిమాలయ దేశంలో జెన్ జీ యువత ఆధ్వర్యంలో 2025 సెప్టెంబర్‌లో నేపాల్‌లో వచ్చిన తిరుగుబాటు ప్రపంచాన్నే నెవ్వెర పోయేలా చేసింది. దేశంలో పెరిగిపోతున్న అవినీతి, నిరుద్యోగం, వారసత్వ రాజకీయాలు వారి విలాసవంతమైన జీవనశైలికి వ్యతిరేకంగా జెన్ జీ యువత చేసిన తిరుగుబాటుకి తలవంచిన కే.పి.శర్మ ఓలీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం గద్దె దిగక తప్పలేదు. పార్లమెంటు భవనాన్ని, ప్రధానమంత్రి కార్యాలయాన్ని తగలబెట్టటం, మంత్రులు పార్లమెంటు సభ్యులు, మాజీ ప్రధాన మంత్రులపై దాడులు జరగటం యువత తిరుగుబాటు హింసాత్మకంగా మారటంతో సైన్యం జోక్యం చేసుకొని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుశీల కర్కి నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంతో నేపాల్‌లో సాధారణ పరిస్థితిలు ఏర్పడినాయి. నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అవుతున్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు మార్చి 5న పార్లమెంటుకు నిర్వహించిన ఎన్నికలలో నేపాల్‌ని గతంలో పాలించిన నేపాలీ కాంగ్రెస్ పార్టీని, నేపాలీ కమ్యూనిస్టు పార్టీలని ఓడించి 2022లో ఏర్పాటు అయిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఎన్నికలలో గెలిచి మొదటిసారి నేపాల్‌లో అధికారం చేపట్టబోతుంది. 275 మంది ప్రతినిధులు ఉండే సభలో 165 మంది సభ్యులను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా మరొక 110 మంది సభ్యులను ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల ద్వారా దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఫలితాలు వెలువడుతున్న 165 స్థానాలలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ 122 స్థానాలలో గెలుపు సాధించి నేపాల్ రాజకీయాలలో సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని విజయ పదంలో నడిపించిన రాపర్ బాలేన్ షా నేపాల్‌కి తదుపరి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. రాజకీయ స్తబ్దత, వారసత్వ పాలన, అవినీతికి వ్యతిరేకంగా పాడిన పాటలతో బాలెన్ షాకి నేపాల్ యువతలో సామాన్య ప్రజలలో మంచి గుర్తింపునే తెచ్చిపెట్టాయి. ఆ గుర్తింపుతోనే స్వతంత్ర అభ్యర్థిగా ఖాట్మండు మేయర్‌గా 2022లో బాలెన్ షా ఎన్నికైనారు. మేయర్‌గా ఖాట్మండుని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దటంలో, అక్రమ కట్టడాలను తొలగించటంలో, చెత్త, మంచినీటి సరఫరా, ట్రాఫిక్ లాంటి సమస్యలను పరిష్కరించటంలో బాలెన్



షా చూపిన చొరవతో అతనిపై నేపాల్ ప్రజలకి మరింత నమ్మకం పెరిగింది. జెన్ జీ యువత నిరసనలతో నేపాల్ అట్టుడుకుతున్న సమయంలో సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధానమంత్రి కే.పి.శర్మ ఓలీ రాజీనామాతో నేపాల్‌కి బాలెన్ షా నాయకత్వం వహించాలనే డిమాండ్ ప్రజల నుండి బలంగా వచ్చినప్పటికీ నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి బాలెన్ షా ఇష్టపడలేదు. ఎన్నికలలో గెలిచి నేపాల్‌కి నాయకత్వం వహిస్తానని ప్రకటించి తాను ప్రాతినిధ్య వహిస్తున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని గెలిపించడమే కాదు నేపాల్‌కి నాలుగు పర్యాయాలుగా ప్రధానమంత్రిగా వ్యవహరించిన నేపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కే.పీ శర్మ ఓలీని ఝాపా 5 నియోజకవర్గంలో ఓడించి బాలెన్ షా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన బాలెన్ షా అనేక సమస్యలతో కునారిలుతున్న నేపాల్‌కి ఒక ఆశాకిరణం లాగా కనిపిస్తున్నాడు. దశాబ్దాలుగా నేపాలీకాంగ్రెస్, నేపాలీ కమ్యూనిస్టు పార్టీలు ఏలుబడిలో ఉన్న దేశంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించటం బాలెన్ షాకి కత్తి మీద సాము లాంటిదే. నేపాల్‌లో పెచ్చు మీరిపోయిన అవినీతి, నిరుద్యోగాన్ని, ధరల పెరుగుదలను, నియంత్రించటం బాలెన్ షాకి ఒక సవాలనే చెప్పాలి. అవినీతి నిర్మూలన, సుపరిపాలన, జీడీపీని 10కోట్ల డాలర్లకు పెంచటం, నిరుద్యోగ నిర్మూలన, యువతకి రాబోయే ఐదు సంవత్సరాలలో 12 లక్షల ఉద్యోగాల కల్పన, వలసల నియంత్రణ, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం లాంటి ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం బాలెన్ షాకి అంత తేలికైన విషయం కాదు. సమస్యలను పరిష్కరించడంలో నగర మేయర్‌గా చూపించిన చొరవ దేశ ప్రధానిగా చూపించగలరా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్ నేపాల్ ప్రభుత్వాలపై ప్రజల తిరుగుబాటు తరువాత అధికారంలోకి వచ్చిన అనురసిరి దిశ నాయకే, తారెక్ రెహమాన్‌లు భారత వ్యతిరేక వైఖరి కలిగిన వారే కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పట్ల వారి వైఖరి మారినట్లుగా కనిపి స్తుంది. నేపాల్ అధికార పగ్గాలు చేపట్టబోతున్న బాలెన్ షా కూడా భారత్ వ్యతిరేకంగా ముద్రపడిన వారే కాబట్టిభారత్ పట్ల నేపాల్ ప్రధానిగా బాలెన్ షా వైఖరి ఎలా ఉండబో తుందనేది ఆసక్తికరమైన విషయం. నేపాల్ ఫస్ట్, గ్రేటర్ నేపాల్ ఏర్పాటు లాంటి అంశాలు భవిష్యత్తులో బాలెన్ షాని ఇబ్బంది పెట్టే అవకాశం లేకపోలేదు. సంస్కృతిపరంగా వాణిజ్యపరంగా భారత్‌కి నేపాల్‌కి మధ్య బలమైన సంబంధాలే ఉన్నాయి కానీ సరిహద్దు వివాదాలు గత కొంతకాలంగా నేపాల్ పాలకులు చైనాకు అనుకూలంగా వ్యవహరించటం వలన భారత్, నేపాల్ మధ్య సంబంధాలు బలహీనపడ్డాయి కాబట్టి ఈ 35 సంవత్సరాల యువకుడు నేపాల్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి భారత్ లాంటి బలమైన సరిహద్దు గల దేశాలతో ఎలా వ్యవహరించబోతున్నాడో వేచి చూడాల్సిందే. ●



### తృణమూల్ నేతలకు
## నో అపాయింట్‌మెంట్
### రాష్ట్రపతిని కలవడానికి చుక్కెదురు

**న్యూఢిల్లీ, మార్చి 13:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరిన తృణమూల్ నేతలకు చుక్కెదురైంది. సమయాభావం వల్లవారిని రాష్ట్రపతి కలవడం సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఆదివాసీలకు అందుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్రపతికి తెలియజేసేందుకు 12 మంది సభ్యులతో కూడిన టిఎంసి బృందం అనుమతి కోరగా ఈ మేరకు సమాధానం వచ్చింది. అయితే వచ్చే వారం అయినా తమకు రాష్ట్రపతి సమయం కేటాయించాలని కోరుతూ ఆ బృందం మరో లేఖను రాష్ట్రపతి భవన్‌కు పంపించినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నాడు దీనిపై ముర్ము స్వయంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాడు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సిఎం నుంచి గానీ మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిన ఆదివాసీ సదస్సుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్ లోని సిలిగురికి వెళ్లిన సందర్భంగా ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు జరిగాయి.

### కోమాలో ఇరాన్‌సుప్రీం కమాండర్ మొజ్తాబాఖమేనీ?

**లండన్, మార్చి 13:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక పేర్కొంది. దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన ఒకటి లేదా రెండు కాళ్లను కోల్పోయినట్లు తెలిపింది. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ వాదనకు మద్దతు ఇచ్చారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తాబా ముఖం కూడా వికృతంగా మారి ఉంటుందని మీడియాతో ఆయన అన్నారు. గతనెల 28న అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తాబా ఖమేనీ కూడా ఈ దాడుల్లో లేదా ఆ తర్వాత జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడినట్లు బ్రిటీష్ టాబ్లాయిడ్ పేర్కొంది. టెహ్రాన్‌లోని సినా యూనివర్సిటీ ఆసుపత్రిలో గట్టి భద్రత మధ్య ఆయన చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. మొజ్తాబా ఖమేనీ చికిత్స పొందిన ఒక ఇరాన్ నేత వివరాలు వెల్లడించినట్లు కూడా ఆ సంస్థ తెలిపింది. మా నాయకుడు చాలా తీవ్రమైన స్థితిలో ఉన్నారు. రెండు కాళ్లు తెగిపోయాయి. కాలేయం, కడుపు కూడా ఛిద్రమైంది. ఆయన స్పృహంగా కోమాలో ఉన్నారని ఆ ఇరాన్ నేత అన్నట్లు టాబ్లాయిడ్ వివరించింది. ఇరాన్ ఆరోగ్య మంత్రి, యుద్ధ గాయాలకు చికిత్స చేసిన అనుభవం ఉన్న సీనియర్ సర్జన్, అనుభవజ్ఞులైన ట్రామా సర్జన్ మొహమ్మద్ రెజా జఫర్ఘండి పర్యవేక్షణలో మొజ్తాబా ఖమేనీకి చికిత్స కొనసాగుతున్నట్లు వార్తా కథనంలో పేర్కొంది. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ నుంచి ప్రత్యక్ష ఆదేశాలు లేకుండానే ఇరాన్ నాయకత్వ నిర్మాణం యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్‌లో గ్యాస్ మంటలు

- ఎల్‌పిజి సంక్షోభంపై చర్చకు విపక్షాలు పట్టు
- ఉభయ సభలలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళన
- పలుమార్లు అంతరాయం, 16కి వాయిదా



**న్యూఢిల్లీ, మార్చి 13:** మధ్యప్రాచ్యంలో యుద్ధం నేపథ్యంలో దేశీయంగా తలెత్తిన గ్యాస్ సంక్షోభంపై పార్లమెంటు అట్టుడికింది. దేశీయంగా చమురు నిల్వలు, గ్యాస్ సరఫరా, ఎల్పీజి సంక్షోభంపై చర్చించాలని లోక్‌సభలో ఉదయం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపడుతుండగా విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్య ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన రూ.2.01 లక్షల కోట్ల అదనపు వ్యయం బిల్లును మూజువాణితో ఆమోదించింది. విపక్ష సభ్యుల ఆందోళన తీవ్రం కావడంతో దీంతో సభను 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. మళ్లీ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. మరోమారు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ వెలుపల ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. తదుపరి మధ్యాహ్నం 2 గం.లకు సభ ప్రారంభమైనప్పటికీ విపక్ష సభ్యుల ఆందోళనలతో చర్చకు అవకాశం లేకపోవడంతో సోమవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే సీన్ చోటుచేసుకుంది. అయితే, ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగింది. ఆ తర్వాత గ్యాస్, చమురు సంక్షోభంపై చర్చకు అవకాశమివ్వాలని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టగా, అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ చర్చకు అనుమతించలేదు. సభను వాయిదా వేశారు. పలుమార్లు సభను వాయిదా వేసిన పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

## పకోడీలు తెచ్చేలోపే భార్య అదృశ్యం!

**అమ్రోహా, మార్చి 13:** ఆకలేస్తోందని చెప్పిన భార్యకు పక్కషాపు నుంచి పకోడీలు తెచ్చేలోపే భార్య అదృశ్యం అయిన సంఘటన అందరినీ కలవరపరిచింది. యూపీలోని అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్‌కు, రాంపూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల రిమ్‌ఝిమ్‌తో గతేడాది డిసెంబర్ 1న వివాహం జరిగింది. హోలీ పండుగ కోసం పుట్టింటికి వెళ్లిన రిమ్‌ఝిమ్‌ను, పండుగ ముగిశాక ఈ నెల 9న ప్రీతమ్ తిరిగి తన ఇంటికి తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో మరో బస్సు కోసం మొరాదాబాద్ జిల్లాలోని బిలారీ బస్టాండ్‌లో వారు వేచి ఉన్నారు. ఆ సమయంలో ఆకలిగా ఉందని, వేడివేడి పకోడీలు తీసుకురమ్మని రిమ్‌ఝిమ్ భర్తను కోరింది. దీంతో ప్రీతమ్ పక్కనే ఉన్న బండి వద్దకు వెళ్లాడు. కొద్ది నిమిషాల్లోనే పకోడీలు తీసుకుని తిరిగి రాగా, భార్య కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు. చుట్టు పక్కల వెతికినా, స్థానికులను అడిగినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన ప్రీతమ్, వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. తన భార్య ఓ యువకుడితో వెళ్లి పోయి ఉండొచ్చని భర్త ప్రీతమ్ పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మొబైల్ ఫోన్ ట్రేస్ చేసే పనిలో ఉన్నారు.

## చేతిచమురు వదలకుండా ప్రపంచ దేశాల చర్యలు

**టెహ్రాన్, మార్చి 13:** ఇరాన్ యుద్ధం తీవ్రం కావడంతో 20 శాతం ప్రపంచ చమురు రవాణాకు మార్గమైన హార్ముజ్ జలసంధి మూసుకుపోయింది. ఈ మార్గంలో నుంచి నౌకలు ప్రయాణించడమంటే మృత్యువును వెతుక్కొంటూ వెళ్లినట్లే. ఏ క్షణాన ఏ ముప్పు వచ్చి నౌకలపై పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు చమురు ధరలను అదుపు చేయడానికి అమెరికా ఇప్పటికే 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేస్తామని ప్రకటించడంతోపాటు అంతర్జాతీయ ఇంధన సంస్థ ఐఇఎతో కలిసి దీనిని 400 మిలియన్ బ్యారెళ్ల వరకు తీసుకెళతామని పేర్కొంది. అయినా, చమురు ధరలు అదుపు కాకపోవడంతో ప్రపంచంలోని వివిధ దేశాలు ఇంధన సంక్షోభం నుంచి బయటపడేందుకు చర్యలు తీసుకొంటున్నాయి. ఇన్నాళ్లు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయొద్దని ప్రపంచ దేశాలను బెదిరించిన అమెరికా ఇప్పుడు వెనక్కి తగ్గింది. కొంత చమురును రష్యా నుంచి కొనుగోలు చేసేలా నిబంధనలను సడలించింది. ఆస్ట్రేలియా తన రిజర్వుల నుంచి 762 మిలియన్ లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చమురు కొరత అదుపులోకి వస్తుందని అంచనా వేస్తోంది. ఇంధన నాణ్యత ప్రమాణాలను కూడా సడలించడంతో అధిక సల్ఫర్ ఉండే అన్‌లెడెడ్ పెట్రోల్ విక్రయాలకు కూడా అవకాశం కల్పించింది. జపాన్ తన రిజర్వుల నుంచి 80 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేసింది. తన వద్ద ఉన్న 245 రోజులకు సరిపడా నిల్వల్లో ఇది 45 రోజుల మొత్తానికి సమానం. దక్షిణ కొరియా చమురు ధరలపై పరిమితిని విధించింది. ఈ రకంగా చేయడం గత 30 యేళ్లలో ఇదే తొలిసారి. సాధారణ పెట్రోల్ ధర 1.17 డాలర్లుగా నిర్ణయించింది. భారత్‌లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ నల్లబజారుకు వెళ్లకుండా నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది. వంట ఇంధనం కోసం రెగ్యులర్ కోటా కింద విడుదల చేసే కిరోసిన్‌కు అదనంగా మరో 48 వేల కిలోలీటర్లను రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

## పాకిస్తాన్‌పై ఆఫ్ఘాన్ తాలిబన్ దాడులు

**కాబూల్, మార్చి 13:** పశ్చిమాసియాలో ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం తీవ్రంగా కొనసాగుతుంటే మరోవక్క పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు పరస్పరం దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. ఇరుదేశాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. ముందు రోజు ఆఫ్ఘన్‌పై పాక్ దాడి చేస్తే శుక్ర వారం పాకిస్తాన్‌పై ఆఫ్ఘన్ దాడి చేసింది. పాకిస్తాన్, ఖైబర్ పంక్తుంఖ్వాలోని ఆర్మీ కేంద్రాలపై శుక్రవారం వైమానిక దాడు లు జరిపినట్లు ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు ఆస్తి, ప్రాణ నష్టం జరిగిం దని, పాకిస్తాన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్తాన్ ముందురోజు రాత్రి ఆఫ్ఘన్‌లోని కొన్ని స్థావరాలపై దాడి చేసింది. ఆఫ్ఘన్ తీవ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్లు పాక్ తెలిపింది. ఈ దాడుల్లో సాధారణ పౌరులు మరణిం చినట్లు ఆఫ్ఘన్ తెలిపింది. దీంతో తాము కోహాట్ ఏరియాలోని పాకిస్తాన్‌కు చెందిన కీలక స్థావరాలపై దాడి చేశామని తెలిపింది. దురంద్ లైన్ వద్ద వార్ కమాండ్ సెంటర్, ఫోర్ట్ కమాండర్లే లక్ష్యంగా ఈ దాడి చేశామని చెప్పింది. దాడుల ద్వారా ఇక్కడి నివాస ప్రాంతా ల్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆఫ్ఘన్ వివరించింది. తీవ్రవాద సమస్య కారణంగా పాక్, ఆఫ్ఘన్ పరస్పర దాడు లకు దిగుతున్నాయి. తమ దేశంలోకి ఆఫ్ఘనిస్తాన్ తీవ్రవాదుల్ని పంపి విధ్వంసం సృష్టిస్తోందని పాక్ ఆరోపిస్తోంది.

### నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే మహిళలకు
## ఉద్యోగ భద్రత తగ్గుతుంది: సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, మార్చి 13:** నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతి కూల ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు వ్యా ఖ్యానించింది. మనం అలాంటి చట్టాలు చేస్తే కం పెనీలు మహిళలను తీసుకోవని అభిప్రాయ పడింది. ఆ సెలవుకు సంబంధించిన నియమాల ను రూపొందించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచార ణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అలాంటి చట్టం తాము పురుషుల కంటే తక్కువ అనే భయం ఉద్యోగాలు చేసే మహిళల్లో సృష్టించే అవ కాశం ఉంది. రుతుక్రమం అంశంపై అవగాహన కల్పించడం వేరు. దానిని సెన్సేషన్ చేయడం వేరు. ఈ సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన మరుక్షణం ఎవరూ వారిని నియ మించుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు అంటూ పిటిషనర్‌ను ఉద్దే శించి ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషద్ తన వాదనలు విని పించారు. 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని విశ్వ విద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవును మంజూరుచేసిన విషయాన్ని గుర్తుచే శారు. ప్రైవేట్ కంపెనీలు కూడా అలాంటి వెసులు బాటును కల్పించాయని కోర్టుకు వెల్లడించారు. దీనిపైప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ అవన్నీ స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలన్నారు. ఆ సెలవును తప్పనిసరి చేస్తే.. మహిళల కెరీర్ ముగుస్తుందని మరోసారి ప్రస్తావించారు.

### అమెరికాలో భారత సంతతికి
## 400 యేళ్ల జైలుశిక్ష!

**వాషింగ్టన్, మార్చి 12:** మనీలాండరింగ్, హెచ్1బీ వీసా, పన్ను ఎగవేత సహా వివిధ రకాల మోసా లకు పాల్పడ్డారన్న కేసులో భారత సంతతికి చెం దిన ఇద్దరు సోదరులను అమెరికాలోని ఓ కోర్టు దోషిగా తేల్చింది. సవానీ గ్రూప్ పేరుతో పలు రకాల వ్యాపారాలు నడుపుతున్న భాస్కర్ సవానీ (60), అరుణ్ సవానీ(58)లకు దాదాపు 400 ఏండ్లకుపైగా జైలు శిక్ష పడే అవకాశ ముందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. వీరితోపాటు దోషిగా తేలిన అలెక్సాండ్రా రాడోమియాక్‌కు కోర్టు 40 ఏళ్ల జైలు శిక్ష విధించే అవ కాశం ఉందన్న వార్తలు విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. అమెరికాలో కొన్నేండ్లుగా వీరు సవానీ గ్రూప్ పేరుతో అక్రమ వ్యాపార కార్యకలాపాలను సాగిస్తూ కోట్లాది డాలర్లు కొల్లగొట్టారని ప్రాసిక్యూటర్లు మీడియాకు తెలి పారు. అమెరికా అటార్నీ కార్యాలయం గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. హెచ్1బీ వీసాలకు సంబంధించి మోసపూరిత దరఖా స్తులు, పిటిషన్లు దాఖలు చేసి పెద్ద సంఖ్యలో విదేశీ కార్మికులను అమెరి కాకు రప్పించి, అటు తర్వాత వారి వేతనాల నుంచి బలవంతంగా వసూలు చేశారని దర్యాప్తులో తేలింది. ఇందులో అత్యధికులు ఇండియన్స్ ఉన్నారని తెలిపింది. ఇక హెల్త్‌కేర్ పథకంలో అక్రమ బిల్లులు ప్రవేశపెట్టి 30 మిలియన్ డాలర్లు కొల్లగొట్టారని పేర్కొన్నది. ప్రభుత్వ పథకాల్లో అక్రమంగా కొల్లగొట్టిన సొమ్మునంతా మనీలాండరింగ్ ద్వారా కార్పొరేట్ బ్యాంక్‌ల్లోకి తరలించారని 2023లో వారిపై ఆరోపణలు నమోదయ్యాయి.

## మంటల్లో పశ్చిమాసియా



### ట్రెహ్రాన్‌లో భారీ పేలుడు..
## ఇరాన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక!

**టెహ్రాన్, మార్చి 13:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్‌లోని మరో నగరం ఖజ్విన్ లో భారీ పేలుడు సంభవించింది. ఈ దాడులు ఎవరు చేశారనే విషయం తెలియరాలేదు. అయితే, ఖజ్విన్, టెహ్రాన్‌లో పేలుళ్లు జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. దాడులు జరుగుతున్న ప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.

**ఏం జరుగుతుందో చూడండి: ట్రంప్**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. 'ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారు. 47 యేళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా' అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ త్వరలో లొంగిపోనుందని ఇటీవల జరిగిన జి-7 నేతల వర్చువల్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది.

## కుప్పకూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

**బాగ్దాద్, మార్చి 13:** అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కెసి-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదలు చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ చానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపో లేదని వెల్లడించింది. ఈ ఘటన ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది.

### ఎల్పిజి ట్యాంకర్లను హార్మూజ్ దాటించేందుకు
## ఇరాన్‌తో భారత్ చర్చలు

**న్యూఢిల్లీ, మార్చి 13:** దేశంలో వంటగ్యాస్ కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తుండగా వంటగ్యాస్ లభ్యతను పెంచేందుకు భారత్‌కు రావాల్సిన ఎల్పీజీ ట్యాంకర్ల కోసం ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్‌కు పయనమైన 8 ఎల్పీజీ ట్యాంకర్లు ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం హార్మూజ్ జలసంధి వద్ద నిలిచి పోయాయి. వీటిని సురక్షితంగా జలసంధిని దాటించేందుకు భారత ప్రభుత్వం ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇందుకు ఇరాన్ అధికారులు సానుకూలంగానే స్పందిస్తున్నారని, త్వరలోనే ఆ ట్యాంకర్లు హార్మూజ్‌ను దాటే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## యుద్ధనౌక అబ్రహాం లింకన్‌పై దాడిచేసాం
### ఇరాన్ ఐఆర్‌జిసి వెల్లడి

**వాషింగ్టన్, మార్చి 13:** ఇరాన్‌పై యుద్ధంలో భాగంగా అమెరికా దళాలు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగిస్తున్నాయి. అగ్ర రాజ్యానికి చెందిన యుద్ధ నౌక అబ్రహాం లింకన్‌పై దాడి చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషన్ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పేర్కొన్నది. ఓ బాలిస్టిక్ క్షిపణితో అబ్రహాం లింకన్ యుద్ధ నౌకను దెబ్బతీసినట్లు ఐఆర్జీసీ వెల్లడించింది. దీంతో గల్ఫ్ సముద్ర జలాల నుంచి ఆ యుద్ధ నౌక విరమించుకున్నట్లు ఇరాన్ ప్రకటించినా అమెరికా ప్రభుత్వం మాత్రం దీన్ని ఖండించింది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీకి తమ యుద్ధ నౌక సేవలు అందిస్తున్నట్లు అమెరికా పేర్కొన్నది. యూఎస్ సెంట్రల్ కమాండ్ తన సోషల్ మీడియా పోస్టులో ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేసింది. అబ్రహాం లింకన్ యుద్ధ నౌకకు చెందిన కొన్ని ఫోటోలను పోస్టు చేసింది. ఇరాన్‌కు చెందిన ఓ నౌక అబ్రహాం లింకన్ యుద్ధ నౌకకు సమీపంగా వచ్చిందని, అప్పుడు అమెరికా దళాలు దాన్ని ఫైర్ చేశాయని మీడియాలోకథనాలు వచ్చాయి. కానీ షిప్‌కు ఏమైందన్న దానిపై క్లారిటీ లేదు. సముద్ర జలాల సరిహద్దులకు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీ ఆఫ్ ఒమన్ లో యూఎస్ఎస్ లింకన్ యుద్ధనౌకను తమ క్షిపణులు, డ్రోన్లు అటాక్ చేశాయని ఇరాన్ సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది.

### నేనెప్పుడు అనుకుంటే అప్పుడే
## ఇరాన్‌తో యుద్ధం ముగింపు
### ఇరాన్‌కు మరోసారి ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

**వాషింగ్టన్, మార్చి 13:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యుద్ధాన్ని మరింతగా రెచ్చగొట్టేలా ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు ఇరాన్‌తో యుద్ధం అతి త్వరలోనే ముగుస్తుందని, తాను ఎప్పుడు ముగించాలనుకుంటే అప్పుడు యుద్ధానికి తెరపడుతుందని చెప్పిన ట్రంప్ నేడు ఆదేశంపై మరోసారి ఫైర్ అయ్యారు. ఇరాన్ యుద్ధం చివరి అంకానికి చేరుకుందని, ఆ దేశం భారీ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఉమెన్ హిస్టరీ మంత్‌కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో ఏది చేయాలో అదే చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే అమెరికా సైనిక శక్తి గొప్పదన్నారు. ప్రపంచంలో మరెవరికి ఇలాంటి సైనిక శక్తి లేదన్నారు. ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను ఎప్పుడు ముగించాలనుకుంటే అప్పుడు యుద్ధానికి తెరపడుతుందని ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

## భారీ పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్ సిటీ

**దుబాయి, మార్చి 13:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ నగరం శుక్రవారం భారీ పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లింది. నగరం మధ్య భాగంలో పెద్ద ఎత్తున పొగ కమ్ముకోవడంతో పాటు పలు భవనాలు కంపించాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో నగరవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నగరంలోని దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిని గాల్లోనే విజయవంతంగా అడ్డుకున్నామని, దాని శకలాలు ఒక భవనం వెలుపలి భాగంపై పడటంతో స్వల్ప నష్టం వాటిల్లిందని దుబాయ్ మీడియా కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. ఒక భవనంపై శకలాలు పడినట్లు తాము కూడా భావిస్తున్నామని, పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని డిఐఎఫ్‌సి ప్రతినిధి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే షేక్ జాయెద్ రోడ్డు వైపు నుంచి సైరన్ల మోత వినిపించింది. దుబాయ్ పోలీసులు వెంటనే ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు.

## శశికళ పార్టీ పేరు ఎఐపిటిఎంఎంకె
### పార్టీ గుర్తు కొబ్బరి చెట్టు
### పుదుచ్చేరి, తమిళనాడులో సత్తా చూపుతామ్మన అధినేత్రి




**చెన్నై, మార్చి 13:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు సొంత పార్టీని ప్రకటించారు. ఆలిండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కళగం (ఎఐపిటిఎంఎంకె) అనే పార్టీని స్థాపించి మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఏఐడిఎంకె వ్యవస్థాపకులు ఎంజీ రామచంద్రన్ ను అభిమానులు పురుచ్చి తలైవార్ అని పిలుచు కుంటారు. ఆయన గౌరవార్థం తన పార్టీ పేరులో ఆ పదాన్ని చేర్చడం ద్వారా శశికళ క్యాడర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తన పార్టీ గుర్తుగా కొబ్బరి చెట్టును ఆమె ప్రకటించారు. జయలలిత అసలైన వారసురాలిగా తనను తాను నిరూపించుకోవాలని శశికళ చూస్తున్నారు. జయలలిత మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, ఆపై జైలు శిక్ష కారణంగా ఆమె రాజకీయ ప్రస్థానానికి అప్పట్లో విరామం పడింది. అయితే ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ఆమె ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ ప్రకటన సందర్భంగా ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు నివాళులర్పించిన శశికళ రాబోయే ఎన్నికల్లో సత్తా చూపుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఈ కొత్త పార్టీ ఆవిర్భావం అధికార, ప్రతిపక్ష పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. గతనెల 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు. ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పనిచేస్తుం దన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచే యనున్నట్లు చెప్పారు. మన నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న దశలోనే తాను కూడా ఉన్నానని, క్యాడర్ ప్రారంభించిన పార్టీలో నే ఆయన చేరారని ఆమె అన్నారు. తమ పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉన్నాయన్నారు. ఆ జెండాలో మాజీ సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయల లిత ఫోటోలు కూడా ఉన్నాయి.

## అధునాతన పిస్టల్స్ తయారీపై కిమ్ ఫోకస్



**ప్యాంగ్యాంగ్, మార్చి 13:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ తన దేశంలో ఆయుధాలు పెంచుకోవడంపై దృష్టిపెట్టాడు. తాజాగా అధునాతన లైట్ పిస్టల్స్ తయారు చేశాడు. ఈ మేరకు పిస్టల్స్ ఫ్యాక్టరీలో కొత్తగా తయారు చేసిన ఆయుధాల్ని కిమ్ పరీక్షించాడు. ఆయనతో పాటు అతడి కూతురు కిమ్ జు ఆయే కూడా ఈ టెస్టింగ్‌లో పాల్గొంది. కిమ్, అతడి కూతురు కిమ్ జుయే ఇద్దరూ పిస్టల్స్ పరీక్షించారు. ఈ పిస్టల్స్‌ను అధ్యక్షుడు కిమ్ పరీక్షించి, అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇతర కొన్ని చిన్న ఆయుధాల్ని కూడా ఆయన పరీక్షించారు. ఇంత కాలం అణ్వాయుధాలపై దృష్టిపెట్టిన కిమ్ ఇప్పుడు స్వల్ప, మధ్యస్థాయి ఆయుధాల తయారీపై దృష్టిసారించాడు. ఆధునిక ఆయుధాల్ని తయారు చేయాలని ఆయన నిర్ణయించాడు. అందువల్ల పిస్టల్స్ వంటివి తయారు చేయిస్తున్నాడు. ఉత్తర కొరియా సైన్యానికి ఈ ఫ్యాక్టరీ తయారు చేసే ఆయుధాలు ఎంతో కీలకం అని కిమ్ అన్నట్లు అక్కడి మీడియా తెలిపింది. ఇక కూతురు కిమ్ జో కూడా తండ్రితోపాటు పిస్టల్స్‌ను పరీక్షించారు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలు తాజాగా విడుదలయ్యాయి. కిమ్ కూతురు పేరు అధికారికంగా వెల్లడి కాకపోయినా, తన పేరు కిమ్ జు అయే అని తెలుస్తోంది. ప్రస్తుతం కిమ్ జు వయసు 13. కిమ్ తర్వాత ఉత్తర కొరియాకు నాయకత్వం వహించబోయేది తనేనని అక్కడి ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. 2022లో ఉత్తర కొరియా జరిపిన లాంగ్ రేంజ్ మిస్సైల్స్ పరీక్ష సందర్భంగా కిమ్ కూతురు తొలిసారి పబ్లిక్‌గా కనిపించింది. ఆ తర్వాత అప్పుడప్పుడూ అధికారిక కార్యక్రమాల సందర్భంగా కనిపించింది. ఇటీవల తరచూ వార్తల్లో కనిపిస్తోంది. గత నెలలో కూడా ఒక స్నైపర్ గన్ కాల్చడాన్ని కిమ్ జు ఆయే ప్రాక్టీస్ చేసింది. కిమ్ వారసురాలిగానే ఆమెను పరిగణిస్తున్నారు.

## కర్ణాటకలో గ్రూపు రాజకీయాల జోరు
### 25 మందిపైగా సీనియర్ ఎమ్మెల్యేలు రహస్య భేటీ

కర్ణాటక కాంగ్రెస్‌లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు జోరందుకున్న తరుణంలో 25 మందికి పైగా సీనియర్ ఎమ్మెల్యేలు బెంగళూరులో రహస్యంగా సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విధాన సౌధలో కేబినెట్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే, మరోవైపు ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈ భేటీ జరగడం గమనార్హం. దీనికి ఒకరోజు ముందు జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి 50 మందికి పైగా ఎమ్మెల్యేలు గైర్హాజరైన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా భేటీలో, గత కొన్ని నెలలుగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని, అంతర్గత విభేదాలు ఇలాగే కొనసాగితే రాబోయే రెండేళ్ల పాలనతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల కర్ణాటక పీసీసీ చీఫ్‌గా ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డీకే శివకుమార్ ఇచ్చిన విందు, ఆయన వర్గం బలప్రదర్శనగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, తన రాజకీయ భవిష్యత్తుపై డీకే శివకుమార్ మాట్లాడుతూ, నాపై నాకు నమ్మకం ఉంది, విధి ఏది రాసిపెడితే అది సరైన సమయంలో జరుగుతుందని అనడం నాయకత్వ మార్పు చర్చకు బలాన్నిచ్చింది. గత కొంతకాలంగా పలుమార్లు ఢిల్లీకి వెళ్లి పార్టీ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గేతో భేటీ అవుతుండటంతో, కర్ణాటకలో నాయకత్వ మార్పు త్వరలోనే ఉండొచ్చనిఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాలు సిద్ధ రామయ్య ప్రభుత్వ స్థిరత్వంపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




**ఆర్గానిక్ ఫార్మింగ్‌లో స్వయం సహాయక సంఘాలకు భాగస్వామ్యం**

**వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు**

**వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనల సమావేశంలో**

**డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ధ్యేయాలని ప్రజా ప్రభుత్వ ధ్యేయ మని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై చర్చించారు. ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్‌లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు ఆయన సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గోడౌన్స్, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతోపాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్తును విక్రయం చేసుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. వ్యవసాయశాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను రైతుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్దసంఖ్యలో పంపిణీ చేస్తుందని, అదేవిధంగా విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని ఈ అంశాన్ని రైతులకు వివరించాలని అధికారులకు మంత్రులు సూచించారు. హార్టికల్చర్‌లో ఎత్తిపోతల పథకాల కింద వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న తీరు, నీటి సరఫరా, యాసంగి వరి సాగు, మార్కెట్లోకి రానున్న ధాన్యం, సేకరణ తదితర అంశాలపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కమిషనర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.



## మహేష్‌కుమార్‌గౌడ్‌తో వేం నరేందర్ భేటీ

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి శుక్రవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఇంటికి వచ్చిన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డికి మహేష్‌కుమార్‌గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. వేం నరేందర్‌రెడ్డి ప్రతిగా పిసిసి అధ్యక్షుడు మహేష్‌ను, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొని రావడానికి వేం నరేందర్‌రెడ్డి చేసిన కృషికి అధిష్ఠానం ఇచ్చిన గుర్తింపు అని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కొనియాడారు.

## న్యాయ వివాదాలకు చెక్

**రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్రంగూడ అటవీప్రాంతం**

**ఉత్తర్వులు జారీ చేసిన అటవీ శాఖ**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఎన్నో యేళ్లుగా న్యాయ వివాదాల్లో చిక్కుకున్న ఆమంగల్ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. మొత్తం 424 ఎకరాలు 31 గుంటల విస్తీర్ణం గల ఈ అటవీ భూభాగాన్ని తెలంగాణ ఫారెస్ట్ చట్టం-1967లోని సెక్షన్ 15 ప్రకారం రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తిస్తూ పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చట్టపరమైన ప్రక్రియ పూర్తయి అటవీ భూములకు అధికారికంగా రిజర్వ్ ఫారెస్ట్ హోదా లభించిందని రాష్ట్ర అటవీదళాల ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అటవీ విస్తీర్ణంలో భాగమైన సాహెబ్‌నగర్ కలాన్ గ్రామంలోని సర్వే నంబర్ 201/1లోని 102 ఎకరాలు చాలా కాలంగా న్యాయ వివాదంలో ఉన్నాయని, సాహెబ్‌నగర్‌కలాన్ కేసుగా ప్రసిద్ధి చెందిన ఈ వ్యవహారం వివిధ న్యాయస్థానాల్లో విచారణకు వచ్చిందన్నారు. అయితే అటవీ అధికారుల కృషి, ప్రభుత్వ మద్దతుతో చివరకు ఫారెస్టుశాఖ వాదనను సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. ఈ తీర్పుతో ఆ భూములపై ప్రభుత్వ హక్కులు మరింత బలపడ్డాయని ఆమె పేర్కొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు శుభాకాంక్షలు

**పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి విద్యా ప్రస్థానంలో కీలకమైన మైలు రాయి అని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలను భయం, ఆందోళనలకు లోనుకాకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో పరీక్షలకు సిద్ధమైతే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఆయన హితవు చెప్పారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఈ పరీక్షల్లో విజయం సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని మహేష్‌కుమార్‌గౌడ్ హృదయపూర్వకంగా అభిలషించారు.

## రాహుల్‌గాంధీకి రాసిన లేఖను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి

**హరీశ్‌రావుపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ధ్వజం**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీకి రాసిన లేఖను హరీష్‌రావు బేషరతుగా వెనక్కి తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు లేఖ రాయడం విడ్డూరమనీ, ఆయ నను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకొంటున్నారనీ దుయ్యబట్టారు. హరీశ్‌రావు కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేరు ఉచ్ఛరించే నైతిక అర్హత కూడా లేదని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అన్న పదాలు పలకడానికి కూడా ఆయనకు హక్కు లేదనీ విమర్శించారు. రాజ్‌భవన్ సాక్షి గా మీరు చేసిన దారు ణాలు, అసెంబ్లీ వేదికగా మీరు చేసిన విలీనాలను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని సత్యం వివరించారు. టిడిపిలో గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ను, కాంగ్రెస్‌లో గెలిచిన సబితాఇంద్రారెడ్డిని మంత్రిని చేసిన నీచచరిత్ర మీదనీ, ఇంకా మీరు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడటం అంటే దెయ్యాలు వేదాలు వల్లించడమేననీ ఆయన చెప్పారు. టిడిపి, కమ్యూనిస్టు, కాంగ్రెస్, బిఎస్‌పి పార్టీలకు చెందిన 60 మంది ఎమ్మెల్యులు, ఎమ్మెల్సీలను ఫిరాయింప చేసిన చరిత్ర కలిగిన మీరు ఫిరాయింపులపై మాట్లాడటం మానుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు హరీష్ రావు ప్రతి పక్ష ఎమ్మెల్యేల గుమ్మం ముందు గోతికాడి నక్కలా ఎదురుచూసి కండువా కప్పించిన చరిత్ర కలిగి ఉన్నారని ఆరోపించారు. నీ ప్రలోభాలు, బెదిరింపులు అందరికి తెలుసనీ మీరు చేసిన పాపాలకు ముందు క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. నీ నక్కజిత్తుల వ్యవహారాలను మీ ఇంటి ఆడబిడ్డ కవిత బయటపెడుతోందనీ ఆయన అన్నారు. మీ ఫిరాయింపులు, కుంభ కోణాలుపైన కవిత మాటలకు సమాధానం చెప్పు అని సత్యం సవాల్ విసిరారు. ఎమ్మెల్యేల అనర్హత అంశం ముగిసిన అధ్యాయం స్పీకర్ నిర్ణయం తీసుకు న్నారనీ, స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే అని చెప్పారు. స్పీకర్ నిర్ణయాన్ని ధిక్కరిస్తున్న నీపైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 322

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 322 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీ ణాభివృద్ధి శాఖకు సంబంధించి 123 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 28 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 108 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఎసిపి ఉమేందర్, ప్రవాసీ ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్




సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అక్షయ్, ఆర్‌పినాయుడు, రవికుమార్ తదితరులు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఆహార వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు**

**కొత్త అవకాశాలు-ఎఫ్‌టీఏ ప్రభావంపై సదస్సు**

**హైదరాబాద్ (నాంపల్లి), మార్చి 13, ప్రభాతవార్త :** కొన్నేళ్లుగా తెలంగాణ వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతిని సాధించిందని, దేశంలో వరి ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో రైతులకు మెరుగైన ఆదాయం అందేందుకు ఎగుమతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్‌టిసిసిఐ, డైరెక్ట రేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్, అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్ట్‌ఫుడ్ ప్రొడక్ట్స్ ఎగుమతి అభివృద్ధి అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎఫ్‌టిసిసిఐ ఫెడరేషన్ హౌస్‌లోని కెఎల్‌ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో తెలంగాణ నుండి ఆహార వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త అవకాశాలు- ఎఫ్‌టిఎల ప్రభావంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిజిఎఫ్‌టి, ఎపిఇడిఎ ఉన్నతాధికారులు, ఎగుమతిదారులు, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఎఫ్‌పిఓలు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు పోటీపడేందుకు గ్రేడింగ్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు బలోపేతం కావాలని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ మౌలిక వసతులు, అగ్రి ఆధారిత పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని చెప్పారు. తెలంగాణ ఉద్యానవన రంగానికి ముఖ్యంగా పండ్లు కూరగాయలు, పసుపు, మిర్చి వంటి పంటలకు ఎగుమతుల్లో మంచి అవకాశాలున్నాయని మంత్రి పేర్కొన్నారు.

సరఫరా శ్రేణులు, ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజ్, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ మెరుగుపడితే అంతర్జాతీయ మార్కెట్లలో ఈ ఉత్పత్తుల స్థానం మరింత బలపడుతుందని మంత్రి అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, టారిఫ్ విధానాల నేపథ్యంలో భారతీయ రైతుల ప్రయోజనాలు రక్షించబడాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగుమతిదారులు, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు, లాజిస్టిక్స్ సేవాదారులు, కన్సల్టెంట్లు, ఎఫ్‌పిఓలు పాల్గొని తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల గ్లోబల్ మార్కెట్ విస్తరణపై సవివరంగా చర్చించారు.

# జల్‌జీవన్ మిషన్ కోసం నిధులు కేటాయించండి

**కేంద్రానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క వినతి**

**రాష్ట్రాల మంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ విడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** జల్ జీవన్ మిషన్‌లో భాగంగా తెలంగాణ లోని ప్రతీ ఇంటికి సురక్షి తమైన తాగునీరు అందించేందుకు ఇప్పటికే ప్రతిపాద నలు పంపామని, అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కోరారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవస్థలను స్థిరీకరించడం, దీర్ఘకాలం కొన సాగించేలా నిర్వహించడం అత్యంత అవసరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ప్రతీ సంవత్సరం నిర్వహణ కోసం కూడా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు జల్‌జీవన్ మిషన్‌పై రాష్ట్రాల మంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సిఆర్ పాటిల్ శుక్రవారం విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాభవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు పంపిణీకి అయ్యే నిర్వహణ వ్యయాల్లో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలన్నారు. కలుషిత నీరు సరఫరా అయితే అనేక రకాల వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్‌ను మరో రెండు సంవత్సరాలు పొడిగించినందుకు కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రాలు అమలు చేస్తున్న తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ ఖర్చులను కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పాటవుతున్న ఆవాసాలకు తాగు నీరు అందించేందుకు కొత్త ప్రాజెక్టులను చేపట్టామని, సోర్స్ పాయింట్‌లో జలాలు డ్రై అయినప్పుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లోకల్ సోర్స్ పాయింట్లను నిర్మిస్తున్నామని తెలిపారు.

ఇందుకు సంబంధించి కూడా కేంద్రం తన వంతు సహాయం చేయాలని కోరారు. కాగా.. మంత్రి సీతక్క ప్రతిపాదన లకు కేంద్రం మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలను త్వరలో సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ముస్లింల సంక్షేమానికి కట్టుబడిన సర్కార్

**కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో హిందూ ముస్లిం లందరూ గంగా యమున తహజీబ్లా కలసి మెలిసి ఉండాలని రాష్ట్ర కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో ప్రభుత్వం అధికారికంగా శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లింల కోసం షాదిఖానా, ఖబరిస్తాన్‌ల ఏర్పాటుకు ఒక్కో ప్రాంతానికి రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ఎన్నికల్లో ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారు మీకు కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తుందన్నారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి పని చేస్తుందన్నారు. సిద్దిపేటలో ఖబరిస్తాన్ కోసం ము స్లింలు చాలాఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకు రాగా వెంటనే స్థలాన్ని సేకరించాలని ఆర్డీఓ ఆదేశించారు.

**లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గంలోని 5 మండలాల లబ్దిదారులకు రూ.3 కోట్ల 42 లక్షల 39 వేల విలువైన 342 కళ్యాణ లక్ష్మీ, షాది మూబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్య క్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఆర్డీఓ సదానందం, నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు వినోద్‌గౌడ్, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాకి అనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్

# అధికారం చేజారాక జ్ఞాపకశక్తి కోల్పోయిన హరీశ్‌రావు

**ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** అధికారం కోల్పోయాక హరీశ్‌రావు జ్ఞాపకశక్తి కోల్పోయిన గజనీ అయిండని ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ విమర్శించారు. పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు లేఖరాయడాన్ని తప్పు పడుతూ విప్ రామచందర్‌నాయక్ హరీష్‌కు మరొక లేఖ రాసినారు. సిఎల్‌పి కార్యాయలంలో శుక్రవారం లేఖను విడుదల చేస్తూ అందులోని అంశాలను వెల్లడించారు. బిఆర్‌ఎస్ శాసనసభా పక్షం ఉపనేత హరీశ్‌రావు పార్టీ ఫిరాయింపుల గురించి, రాజ్యాంగ విలువల గురించి చాలా చక్కగా మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేస్తూ లేఖలో రామచందర్‌నాయక్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ఫిరాయింపుపై హరీశ్‌రావు మాట్లాడుతుంటే తెలంగాణలో కొత్త రాజ్యాంగ రక్షకుడు వచ్చాడని ప్రజాసంఘాలు, మేధావులు సంతోష పడుతున్నారనీ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. అయితే పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు భారతదేశ రాజ్యాంగం తమరి కళ్లకు కనిపించలేదు, చెవులకు వినిపించలేదనీ ఆయన విమర్శించారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరిగి ప్రలోభాలు పెట్టి మీ మామ దగ్గరకి తీసుకెళ్లి గులాబీ కండువా కప్పినప్పుడు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని చుట్టచుట్టి మీ అల్మారాలో దాచి పెట్టారా..? అని నిలదీశారు. టిడిపి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రాజ్ భవన్ కు తీసుకెళ్లి టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణం చేయించి నప్పుడు ప్రజాస్వామ్య విలువలను మీరు మీ నార్సింగి ఫామ్‌హౌస్‌లో పాతిపెట్టారా? అని ప్రశ్నించారు. టిడిపి, కాంగ్రెస్, వైఎస్‌ఆర్ సిపి, బిఎస్‌పి, సిపిఐ పార్టీల శాసనసభాపక్షాలను అమాంతం మింగేసి మీ పార్టీలో జీర్ణం చేసుకునప్పుడు మీరు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసినట్లు గుర్తుకు వస్తోందనీ లేఖలో పేర్కొన్నారు.

హరీశ్‌రావు అధికారం పోయాక మీరు గజిని గా మారినట్లు మీ తీరు చూస్తుంటే అర్థమోతోందనీ అన్నారు. గురువింద గింజ కు తన కింద ఉన్న నలుపు తెలియదట, ముందు మీ చరిత్ర ను తిరగేయండనీ, తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఛీకొట్టారో తెలుసు కోండనీ హితవు చెప్పారు.

## ప్రతీ చెరువును జియో ట్యాగింగ్ చేయండి

**నీటిపారుదల శాఖకు రాష్ట్ర రైతు కమిషన్ నివేదిక**

**మంత్రి ఉత్తమ్‌తో కమిషన్ భేటీ**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రతీ చెరువును జియో ట్యాగింగ్ చేయాలని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రాష్ట్ర రైతు కమిషన్ నివేదించింది. ఈ మేరకు తెలంగాణలో చిన్న నీటిపారుదల పునర్వ్యవస్థీకరణ కోసం రైతు కమిషన్ ఆధ్వర్యంలో వేసిన కమిటీ శుక్రవారం 45 పేజీల నివేదికను మంత్రికి సమర్పించింది. చెరువుల ఆక్రమణలు తొలగించి, ఎఫ్టీఎల్ హద్దులను గుర్తించాలని, చెరువుల పూడికతీత చేపట్టి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపటాలని సూచించింది. చెరువు కట్టలు, తూముల రిపేర్లు, ఇతర మరమ్మత్తులను చేపటాలని, నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని నివేదికలో రైతు కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. కాగా కమిషన్ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలో జరగనున్న అసెంబ్లి సమావేశాల్లో కమిషన్ సూచించిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్రీడా, పశుసంవర్ధకశాఖమంత్రి వాకిటి శ్రీహరి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్‌రెడ్డి, చెవిటి వెంకన్న, భవానీరెడ్డి, భూమి సునీల్, కమిషన్ మెంబర్ సెక్రెటరి గోపాల్‌తోపాటు ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ, నీటిపారుదలరంగాల నిపుణులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా ఎదుగుతున్న భాగ్యనగరం

**రూ.7,300 కోట్లతో తాగునీటి వసతి మెరుగుదల**

**హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఎండి అశోక్‌రెడ్డి**




**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** మూసీ రివర్ ఫ్రంట్‌తో నదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్ది పర్యావరణహితంగా, పర్యాటకంగా భాగ్యనగరాన్ని జీవనో పాధులు కల్పించే గొప్ప ఆర్థిక కేంద్రంగా ఎల్లప్పుడు నిలిచేలా తీర్చి దిద్దబోతు న్నమనీ హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఎండి అశోక్‌రెడ్డి అన్నారు. హైటెక్ సిటీలోని సైబర్‌గార్డెన్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్, రియల్ ఎస్టేట్ కాన్‌క్లేవ్ హైడ్రేకాన్-2026 ప్రముఖ పారిశ్రామిక నిపు ణులు, పాలసీ రూపకర్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు భవిష్యత్‌లో హైదరాబాద్ అభివృద్ధిపై విధానపరమైన రూపకల్పన చేశారు. ఇందులో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించిందని దీనితో ఎకనామిక్ గ్రోత్ ఉంటుందని మెరుగైన మౌలిక సదుపాయలు నీటినిర్వహణ, నగర ప్రణాళిక హైదరాబాద్ దశ దిశన మార్చ బోతుందని అభిప్రాయపడ్డారు.

నగరం 170 చదరపు కిలోమీటర్ల నుంచి 2,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోటి 30లక్షల మంది జనాభాతో విస్తృతం అయిందని, దానికి తగినట్లు మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత దశాబ్దం క్రితం 8లక్షల కుళాయి కనెక్షన్లు ఉంటే ప్రస్తుతం వాటి సంఖ్య 14లక్షలు పెరిగిందని ఆయన వివరించారు. గోదావరి ఫేజ్ -2, గోదావరిఫేజ్ -3 పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చబోతుందని చెప్పారు. రూ.7,300 కోట్లతో తాగునీటి వసతి మెరుగపరిచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని దేశంలో ఎక్కడలేని విధంగా నీటికి ఏలాంటి ఇబ్బందులు లేని నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. మురుగునీటిని కూడా 100శాతం శుద్ధిచేసి నగర పర్యావరణం మెరుగు పరిచేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేసుకొంటున్నామని తెలిపారు. నారెడ్‌కో తెలంగాణ ప్రసిడెంట్ మేక విజయసాయి, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డిలు మాట్లాడుతూ యువమహిళలు రియల్ రంగంలో అడుగు పెట్టడంమే కాకుండా షీ బిల్డింగ్ అండ్ షీ లీడింగ్ హైలైటెడ్ వారి నాయకత్వంలో భవిష్యత్ రూపొందుతోందని ఆయన తెలిపారు.

హైడ్రాకాన్ -2026 భారత దేశంలో అత్యంత వేగంగా హైదరాబాద్ అభివృద్ధి పరచడానికి ఇండస్ట్రీ కొలబరేషన్, వ్యూహాత్మక చర్చలు వంటి అంశాలతో సదస్సులో హాజరైన వారు విజ్ఞానం అనుభవాలు పరస్పరం పంచుకొన్నారు.

హైదరాబాద్ రియలర్టర్ ప్రసిడెంట్ సుమంత్‌రెడ్డి ఆరని, హైబిజ్ వన్ ఎల్‌ఎల్ పి ఫౌండర్ జె.సంధ్యారాణి, బి.రాజ్ గోపాల్ మాట్లాడుతూ మెడికల్ టూరిజం తెలం గాణ అంతటా విస్తరణ జరుగుతోందని ఎకోసిస్టమ్ హైదరాబాద్ పరిసరాలలో బాగుంటందని అన్నారు. హైరదాబాద్ గత అభివద్ధి వారసత్వానికి ఎక్కడ కూడా లోపం జరగకుండా సమ అభివృద్ధితో ముందుకు పోతుందని తెలిపారు.

## మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో 5వేల కోట్లు కేటాయించాలి


**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** ఈ యేడాది(2026-27) బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5 వేల కోట్లు కేటాయించాలని మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నరసింహ, ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాను వెంటనే ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాససముదాయంలో మంత్రి వాకిటి శ్రీహరిని, మత్స్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆ శాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

# పోలీసు ఉద్యోగం సవాళ్లు, సమస్యలతో కూడుకున్నది

## ధైర్యం, చాకచక్యంతో అధిగమించాలి

## పోలీసు రిట్రీట్ ఐపిఎస్‌లకు గతంలో దిశానిర్దేశం చేసిన దొర

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఉమ్మడి ఏపి డిజిపిగా ఐదున్నరేళ్ల పాటు పనిచేసిన హెచ్.జె దొర శుక్రవారం మధ్యాహ్నం మరణించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన కన్ను మూశారు. పోలీసు శాఖను అమితంగా ప్రేమించే దొర అవకాశం వచ్చిన ప్రతిసారి పోలీసు విభాగాలు ఏర్పాటుచేసే సమావేశాలు, సదస్సులకు హాజరై తనదైన శైలిలో మాట్లాడి పోలీసు శాఖ గొప్పతనాన్ని చెప్పేవారు. 2003లో కేంద్ర సర్వీసుల్లో వున్న సమయంలో ఆయన పదవీ విరమణ చేశాక జాతీయ పోలీసు అకాడమితో పాటు రాష్ట్ర పోలీసు అకాడమి సహా దేశ వ్యాప్తంగా వున్న అనేక పోలీసు విభాగాలు నిర్వహించిన సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల ఎనిమిదవ తేదీన హిమాయత్‌సాగర్‌లోని పోలీసు అకాడమిలో మొదలైన పోలీసు రిట్రీట్ ప్రారంభ కార్యక్రమంలో చివరిసారిగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా రిట్రీట్‌లో పాల్గొన్న దొర ఇందులో పాల్గొన్న సీనియర్ ఐపిఎస్ అధికారులను, యువ ఐపిఎస్‌లను తన ప్రసంగంతో ఉత్తేజపరిచారు. పోలీసు శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లను, వాటిని ఎలా అధిగమించవచ్చో...? ఆయన తన ప్రసంగంలో వివరించారు. పోలీసు ఉద్యోగం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని, అనేక సవాళ్లతో కూడుకున్నదని, నిరంతరం ధైర్యంతో పాటు సహనంతో పనిచేయాల్సి వుంటుందని, చాకచక్యంతో వీటినిఅధిగమించాలని ఆ సమావేశంలో ఆయన ఐపిఎస్‌లకు హితవు చెప్పారు. ప్రజలు నిరంతరం పోలీసుల వైపు చూస్తున్న రోజులని, ఈ సమయంలో వారిని అన్ని వేళలా ఆదుకోవాల్సిన బాధ్యత మనపై వుందని దొర చెప్పారు. దొర తన చివరి ప్రసంగం ఇప్పుడు పోలీసులు మనస్సులను కదిలిస్తోంది. రిట్రీట్‌లో పాల్గొన్న ఐపిఎస్ అధికారులు కన్నీళ్లతో ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు.



పోలీసు అకాడమీలో 8న మొదలైన పోలీసు రిట్రీట్‌లో చివరిసారిగా పాల్గొని ప్రసంగిస్తున్న మాజీ డిజిపి హెచ్.జె దొర

# ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను చెల్లించండి

## లేనిపక్షంలో అసెంబ్లీ ముట్టడి

## తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జెఎసి

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు పెండింగ్ నిధులు విడుదలైనా మాజీ సర్పంచుల బకాయిల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని తెలంగాణ సర్పంచుల సంఘం జెఎసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ విమర్శించారు. ఈ విషయంలో మాజీ సర్పంచులకు నూతన సర్పంచులకు, పంచాయితీ సెక్రటరీలకు ప్రభుత్వం పైసల పంచాయితీ పెట్టిందని మండిపడ్డఆరు. ఈ విషయమై శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2019-24 వరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు అవుతున్నా బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నేతలు గుంటి మధుసూదన్‌రెడ్డి, రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా గోపాలమిత్ర సర్వీసు కేంద్రాలు

## రూ.7 లక్షల వ్యయంతో భవనాల నిర్మాణం

## మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం

## ఫలితంగా పశువులకు వైద్య సేవల్లో అంతరాయం

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** పశుసంవర్ధకశాఖ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో నిర్మించిన గోపాల మిత్ర సేవా కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. రాష్ట్రంలో 1530 మంది గోపాలమిత్రలు సేవలందిస్తున్నారు. వీరిలో ఒక్కో గోపాల మిత్రకు నాలుగు గ్రామాల్లో పశువులకు వైద్య పరీక్షలు, కృత్రిమ గర్భదారణ తదితర సేవలను పశుసంవర్ధకశాఖ కేటాయించింది. ప్రతి 1000 పాడి పశువులకు ఒక గోపాలమిత్ర సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే గోపాలమిత్రల సేవలు కీలకం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 700కు పైగా గోపాల మిత్ర సర్వీసు సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఒక్కో భవనాన్ని రూ.7లక్షల వ్యయంతో నిర్మించింది. అయితే చాలా వరకు భవనాల నిర్మాణం పూర్తయితే అయింది కానీ అందులో మౌలిక సదుపాయాలు కల్పించడంలో పశుసంవర్ధకశాఖ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. మౌలిక సదుపాయాలను కల్పించకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా నిర్మించిన సర్విస్ సెంటర్‌లు నిరుపయోగంగా మారాయని గోపాల మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇంటిదగ్గరకే వెళ్లి పాడిపశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందిస్తూ, అత్యవసర సమయాల్లో డాక్టర్ సలహా మేరకు ప్రథమ చికిత్స చేస్తు రైతులు ఆర్థికంగా నష్టపోకుండా గోపాల్‌మిత్రలు కీలక సేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వం గోపాల మిత్ర సర్విస్ సెంటర్‌లు ఏర్పాటు చేసి కావాల్సి న సామాగ్రి అందించకుండా వదిలి వేయడంతో చాలా వరకు భవనాలు శిథిలావస్థకు చేరాయని గోపాలమిత్రలు ఆరోపిస్తున్నారు. కొన్ని సర్విస్ సెంటర్ భవనాల నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారని మండిపడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పశుసంవర్ధకశాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం సబ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి కావాల్సి న సామాగ్రి, మందులు పంపిణీ చేయాలని కోరుతున్నారు. దాంతో మండల కేంద్రంలో ఉన్న ప్రయివేటు పశువైద్యశాలలకు వెళ్లాల్సి న పరిస్థితి పాడి రైతులకు ఉండదని గుర్తు చేస్తున్నారు. తెలంగాణలో పాడి పశువుల సంరక్షణ, వాటికి వైద్య సేవలు అందించడంతోపాటు కృత్రిమ గర్భదారణ సేవల విషయంలో గోపాలమిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గోపాలమిత్ర కేంద్రాల ద్వారా రైతుల ఇంటి వద్దకే పశువైద్య సేవలను అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది.

గోపాలమిత్రలు ప్రధానంగా గ్రామాలకు వెళ్లి పశువులకు ప్రాథమిక చికిత్సలు, టీకాలు, డీవార్మింగ్, కృత్రిమ గర్భధారణ వంటి సేవలు అందిస్తున్నారు. రైతుల వద్ద ఉన్న ఆవులు, గేదెల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అన్నదాతలకు అవసరమైన సూచనలు ఇస్తారు. తెలంగాణలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడంలో గోపాలమిత్రల సేవలు ఎంతో కీలకమని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గోపాలమిత్ర కేంద్రాలు పనిచేస్తూ పశువుల సంరక్షణ సేవలను గ్రామస్థాయిలో సేవలు అందిస్తున్నాయి.

# మూసీ పునరుజ్జీవానికి కాదు..

## లూటిఫికేషన్‌కే మేం వ్యతిరేకం

## సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు 8 సూటి ప్రశ్నలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 13:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు మూసి బ్యూటిఫికేషన్‌పై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి 8 సూటి ప్రశ్నలు సంధించారు. వీటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి మూసీ బ్యూటిఫికేషన్‌పై ప్రెజంటేషన్ ఇస్తున్న సందర్భంగా మొదట తన ప్రశ్న లకు సమాధానం ఇవ్వాలన్నారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, మూసీ పేరిట రేవంతు చేస్తున్న లూటిఫికేషన్ కు మాత్రమే వ్యతిరేకమని, సుందరీకరణ పేరిట వేలాది మందిని నిరాశ్రయులుగా చేస్తుండటానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో మొదట మూసీ బ్యూటీఫికేషన్ కు శ్రీకారం చుట్టామని, రూ.4వేల కోట్లతో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, గోదావరి నీళ్లను తెచ్చి మూసీలో పోసీ శుద్ధి చేయాలనీ ప్రణాళికలు వేశామని వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు చూస్తే తుగ్లన్ పాలన గుర్తుకు వస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తే.. రేవంతు తన తుగ్లక్ పాలనతో అధోగతి పాలు చేస్తున్నడని దుయ్యబట్టారు. ఒకసారి మూసీ సుందరీకరణ అంటడు, మరోసారి మూసీ ప్రక్షాళన అంటడు, ఇంకోసారి మూసీ పునరుజ్జీవం అంటడు. పూటకో పేరు మార్చుతూ, రోజుకో చోట ప్రజల ఇండ్లు కూల్చే హక్కు మీకు ఎవరు ఇచ్చారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇలా 8 సూటి ప్రశ్నలు సంధించారు.

1. అసెంబ్లీ వేదికగా జనవరిలో సీఎం ఇచ్చిన సమాధానం ప్రకారం, హిమాయత్ సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు అధ్యయనం చేసి డీపీఆర్ ఇవ్వడానికి 18నెలలు పడుతుంది అన్నరు. మరి డీపీఆరే రాకుండా పేదలకు ఎలా నోటీసులు ఇచ్చారని, ఎందుకు పేదల ఇండ్లు కూలగొడుతున్నావు? 10,017 ఇండ్లు కూల్చుతమని గజిట్ ఎట్లా ఇచ్చినవు?

2. అసలు మీరు చేస్తున్నది మూసీ నది ప్రక్షాళననా? మూసీ సుందరీకరణనా? మూసీ ప్రక్షాళననా? అసలు ఏం చేస్తున్నావు సమాధానం చెప్పు?

3. అసలు బఫర్ ఎం? ఒక ప్రభుత్వం 9మీటర్లు, మరొక ప్రభుత్వం 30 మీటర్లు? ఇప్పుడు రేవంత్ రెడ్డి 100 మీటర్లు అంటున్నాడు. అసలు బఫర్ ఎలా నిర్ణయించారు. ఉంటే స్టడీ బయట పెట్టండి? అసలు మూసీ నుంచి ఎలా కొలుస్తారు?

4. ఏదైనా ప్రాజెక్టు చేయాలంటే కనీసం వంద ఏళ్ల డేటా తీసుకొని చేస్తాం. హైడ్రాలజికల్ లేదా ఫ్లడ్ వాటర్ స్టడీ చేసారా? చేస్తే బయట పెట్టండి.

5. జనవరిలో జరిగిన శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి ఏడీబీ లోన్ 4,100 కోట్లు మూసీకి ఇవ్వడానికి ఒప్పుకున్నది, మంజూరు అయ్యింది అని చెప్పారు. ఏడీబీ ఇప్పటికి డీపీఆర్ ఇవ్వలేదని, లోన్ సాంక్షన్ చేయలేదని మూడుసార్లు చెప్పిందనేది వాస్తవం. మరి అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధం చెప్పిండు రేవంత్ రెడ్డి? ఇలా అబద్దాలు చెప్పే ముఖ్యమంత్రి మాటలు ప్రజలు ఎలా నమ్ముతారు? పవిత్రమైన శాసనసభనే తప్పు తోవ పట్టించిండు రేవంత్ రెడ్డి? లోన్ మంజూరు అయ్యిందా లేదా? అసెంబ్లీని తప్పుదోవ పట్టించినవా స్పష్టం చేయి? లేదంటే అసెంబ్లీలో ప్రవిలేజ్ మోషన్ ఇస్తాం. అబద్దాలు మాట్లాడే రేవంత్ రెడ్డి శాపగ్రస్తుడు.

6. ఇప్పటికే చాదర్ ఘాట్ లో మూసీలో 300 ఇళ్లు కూల్చారు. యూపీఏనే తెచ్చిన భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నడు. పరిహారం ఇవ్వకుండా కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లకు పంపినవు. భూసేకరణ చట్టం ప్రకారం ఎవరికి ఎంత ఇచ్చారో చెప్పండి? ఏడాది కింద కూలగొట్టిన 300 మందికే ఏం చేయలేదు. నువ్వు చేస్తవని ప్రజలు ఎట్ల నమ్ముతారు? మధు రిడ్జ్ అపార్ట్ మెంట్ వాసులు నిన్ను ఎట్ల నమ్ముతారు? మాట తప్పని నైజం కేసీఆర్‌ది.

7. మధు రిడ్జ్ అపార్ట్ మెంట్ వాసులకు 7 ఎకరాలకు 7 ఎకరాలు ఇస్తా అన్నవు. సంతోషం. మధు రిడ్జ్ ఒక్కటే కాదు కదా? మూసీ వెంట మొత్తం 46 కాలనీలు ఉన్నాయి. పది వేల ఇండ్లు కూలగొడుతా అంటున్నవు. వీళ్లకు కూడా అదే పద్దతిలో స్థలం కేటాయిస్తవా? బ్యాంకుల్లో నిధులు జమ చేస్తవా? పదివేల మందికి ఇదే తీరుగా ఇళ్లు కట్టిస్తవా? వారి ఉపాధికి ఎవరు బాధ్యులు? సమాధానం చెప్పాలి.

8. మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజల ఆవాసాలే కాదు, మెట్రో రైల్వే స్టేషన్, బస్టాండ్లు ఎస్టీపీలు, దేవాలయాలు, చర్చీలు, ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయి. ఇవన్నీ కూల్చుతావా? నీ స్టాండ్ ఏమిటో స్పష్టం చేయండి. అని ప్రశ్నించారు.




# ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

## మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. గ్లోబల్ బ్రిడ్జెస్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతా వరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలు మూలల నుంచి వచ్చే వారికి సొంత ఊరు అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటి ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటి, నెట్ జీరో సి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తుందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హుపే ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదిరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తితో పాటు పలువురు హాజరయ్యారు.




# మూసీ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు

## పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్నాం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** మూసి ప్రాజెక్ట్‌ను భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకించడం లేదని, కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం తాము వ్యతిరేకిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మూసిపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బిజెపికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మూసినది పునరుజ్జీవనం గానీ, మూసిప్రాజెక్టు గానీ బిజెపి ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని, అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని, ఆ నీరు రైతులకు సాగునీటిగా ఉపయోగపడాలని బిజెపి స్పష్టంగా కోరుకుంటుందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి అయినా, మంత్రి పొన్నం ప్రభాకర్ అయినా భారతీయ జనతా పార్టీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని, కానీ మూసి విషయంలో బిజెపి వైఖరి మాత్రం మొదటి నుంచీ ఒక్కటే స్పష్టంగా చెబుతున్నామని, మూసినది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని ఇప్పటికీ చెబుతున్నామన్నారు. కానీ గాంధీ సరోవర్ పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారు.

మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సి న అవసరం లేదని, ఆ ఇళ్లను కూల్చకుండా కూడా మూసిని శుద్ధి చేయ వచ్చన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా చెబుతూ మాట్లాడేవారు అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సబర్మతి కూడా మూసిలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేసి, ముందుగా నది శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని తెలిపారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.



# సాంఘిక సంక్షేమానికి రూ.374 కోట్లు

## స్కారల్‌షిప్‌ల నిమిత్తం ఆర్థిక శాఖ విడుదల

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమానికి సంబంధించి ఆర్థిక శాఖ పెండింగ్ నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలో పోస్ట్ మెట్రిక్ చదువుతున్న సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థుల కోసం ఆర్థిక శాఖ రూ.374 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధుల వల్ల రాష్ట్రంలోని మొత్తం 83,239 మంది విద్యార్థులు లబ్ధి పొందినట్లు అధికారులు వెల్లడించారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ఈ డబ్బు వారి ఖాతాల్లోకి నేరుగా జమ అయింది. ఈ మొత్తాన్ని స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజుల రూపంలో నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో అధికారులు జమ చేశారు. ఈ నిధులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించినవి అని అధికారులు తెలిపారు. ఈ మొత్తం రూ.374 కోట్లలో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.201 కోట్లు కాగా, తెలంగాణ ప్రభుత్వ వాటా రూ.173 కోట్లు ఉంది. ఈ రెండు ప్రభుత్వాలు కలిసి ఈ నిధులను విడుదల చేశాయి. ముఖ్యంగా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం కొంత భారంగా ఉన్న సమయంలో ఈ స్కాలర్షిప్ నిధులు విడుదల చేయడంతో వారికి ఒకింత ఉపశమనం కలిగినట్లయింది.

# మరోసారి భారీ జిఎస్టీ కుంభకోణం

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** తెలంగాణలో భారీ జీఎస్టీ కుంభకోణం వెలుగు చూసింది. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఈ కుంభకోణం గుట్టు రట్టు చేసింది. దాదాపు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ఇందులో ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు సందీప్‌కు సంబంధం ఉన్న ఇతర సంస్థల్లోనూ పలు భారీ అక్రమాలు జరిగినట్లు అధికారులు తేల్చారు. ఈ క్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. అయితే సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

# ఇప్పసారాపై అసెంబ్లీలో చర్చిస్తాం

## సారాపై ఇప్పుడు సమగ్రంగా మాట్లాడలేం:

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 13, ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఇప్ప పువ్వు సారాపై చేసిన వాఖ్యలు, అభిప్రాయాలపై లోతుగా అధ్యయనం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈ విషయంగా అసెంబ్లీ లో కూడా సమగ్రంగా చర్చిస్తామని వెల్లడించారు. ఇప్ప పువ్వు ఆరోగ్యానికి చాలా మంచిదని, ఇప్ప పువ్వు తో చేసే సారా తాగి గతంలో మన పూర్వీకులు వందేళ్లు బతికారని, బ్రిటిష్ పాలకులు వారి స్వార్థంతో నిషేధించిన ఇప్ప పువ్వు సారా ను మళ్లీ తీసుకురావాలని, దీనివల్ల అటు ప్రభుత్వానికి ఇటు గిరిజనులకు కూడా పెద్ద ఎత్తున ఆదాయం వస్తుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇటీవల చేసిన వాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనానికి దారి తీసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నూతన పురపాలక సంఘం భవన ప్రారంభానికి విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు ను మీడియా ప్రతినిధులు అనిరుధ్ రెడ్డి ఇప్ప పువ్వు సారా పై చేసిన వాఖ్యల గురించి ప్రశ్నించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనిరుధ్ రెడ్డి ఇప్ప పువ్వు సారా పై తాను చేసిన పరిశోధన కు సంబంధించిన పత్రాన్ని కూడా తనకు ఇచ్చారని దానిని నిపుణులకు ఇచ్చి విశ్లేషణ చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్ ఈ విషయం గా వెలిబుచ్చిన అభిప్రాయాల పై లోతుగా అధ్యయనం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సాంప్రదాయ మద్యం తయారీ పై ప్రపంచంలో ఏం జరుతోందో చెప్పారని, ఇప్ప పువ్వు సారా అధికారింగా విక్రయిస్తున్న రాష్ట్రాలు, ఇప్ప పువ్వు సారాను కంట్రీ లిక్కర్ గా కాకుండా ఇండియన్ మేడ్ లిక్కర్ గా అనుమతించిన గోవా రాష్ట్రం గురించి కూడా తెలిపారని మంత్రి వివరించారు. అసెంబ్లీ లో కూడా ఇప్ప పువ్వు సారాపై సమగ్రంగా చర్చిస్తామని, అందరి అభిప్రాయాలు పరిగణ లోకి తీసుకొని ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. అయితే ఈ దశ లో ఇప్ప పువ్వు సారా పై తాను ఇంత కంటే ఎక్కువ మాట్లాడడం భావ్యం కాదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# బలపడుతున్న ఇండో-యుఎస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

**న్యూఢిల్లీ, మార్చి 13:** భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడ నుంది. కీలక ఖనిజాల సరఫరాకు సంబంధించి ఇరు దేశాలు త్వరలో ఒక ముఖ్యమైన ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఈ ఒప్పందంపై చర్చలు చివరి దశలో ఉన్నాయని, ఇది ఇరు దేశాల మధ్య సహకారాన్ని, సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అంగీకారం కుదిరిన కొన్ని రోజులకే ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్, అమెరికా ఒకరిపై ఒకరు ఎక్కువ దృష్టి సారిస్తున్నాయి. ఇది కేవలం వాణిజ్య సంబంధాలకు మించిన లోతైన భాగస్వామ్యాన్ని సూచిస్తోందని గోర్ అన్నారు. ఈ బంధం మరింత బలపడుతూ వ్యూహాత్మక సహకారంలో కొత్త దశకు చేరుకుంటోందని వివరించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో ఇరు దేశాల సంబంధాలు ప్రపంచ స్థాయి శిఖరాలకు చేరే సామర్థం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భాగస్వామ్యం కేవలం సుంకాలు, మార్కెట్ యాక్సెస్‌కు మాత్రమే పరిమితం కాదని, భవిష్యత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే వనరులు, సరఫరా గొలుసులను సురక్షితం చేయడంపై దృష్టి సారించిందని గోర్ స్పష్టం చేశారు.

# ఎల్‌పిజి సిలిండర్ల పంపిణీలో ఇబ్బందులు రానీయొద్దు

## ఎల్‌పిజి, గ్యాస్ నిల్వలపై

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమీక్ష

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎల్‌పిజి నిల్వలు, గ్యాస్ వినియోగదారులకు పంపిణీ, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిస్థితులపై సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌పిజి గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజు వారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్ట్రిబ్యూటరీలు, ఎజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయిని, ప్రస్తుత డిమాండ్‌కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు డిమాండ్ మేరకు ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన చేందాల్సి న అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు సకాలంలో డెలివరీ జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు.



# భారతీయ సంస్కృతికి నిలువుటద్దం చేనేత

**- చేనేత వారసత్వ సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత - నేత వృత్తిలో**

**మరిన్ని ఆవిష్కరణలు తీసుకురావాలి : వ్యవసాయ, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** భారతదేశపు చేనేత వారసత్వాన్ని ప్రోత్సహించడంతోపాటు సంరక్షి ంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. భారతీయ చేనేత కళా వైభవాన్ని ప్రతిబింబించేలా అమీర్‌పేటలోని కమ్మ సంఘం భవనంలో నిర్వహిస్తున్న ప్రత్యేక చేనేత మార్కెటింగ్ ఈవెంట్ -2026ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కళాకారులు తమ సంప్రదాయ వృత్తిలో సరికొత్త ఆవిష్కరణలు, సుస్థిర పద్ధతులను అవలంబించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేతవర్గాలకు సాధికారత కల్పించడం, సంప్రదాయ కళాత్మకతను వేడుకగా జరుపుకోవడంలో ఈ తరహా ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు, హస్తకళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిందని మంత్రి తుమ్మల ప్రశంసించారు. భారతదేశ సుసంపన్నమైన నేత వారసత్వాన్ని ప్రతిబింబించే అనేక అద్భుతమైన చీరలు ఇక్కడ ప్రదర్శనకు రావడం గర్వకారణమన్నారు. కాగా.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన బనారసి చీరలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కలంకారి,

కాటన్ బుట్టా చీరలు, గుజరాత్ పటోలా చీరలు, మధ్యప్రదేశ్ చందేరి చీరలు, మహారాష్ట్ర పైథాని చీరలు, తెలంగాణ పోచంపల్లి ఇక్కత్, గొల్లభామ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 17 వరకు ప్రదర్శన కొనసాగనుంది.



సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# హైడ్రాకు ఎన్ఆర్ఎస్‌సి డేటా వజ్రాయుధం

**ఓఆర్ఆర్ పరిధిలో 1350 ఎకరాలు భూమిని కాపాడాం**

**చెరువులు, నాలాలు, భూవివరాలకు 'హైడ్రా రక్ష' పోర్టల్**

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** కనుమరగైపోయిన చెరువుల జాడ తెలుసుకోవడంతో పాటు.. ఉన్న వాటి ఎఫ్‌టీఎల్ లెక్కలు తేల్చడానికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా హైడ్రాకు వజ్రాయుధం" లామారిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలకు సంబంధించిన సమాచారం ఒక్కో విధంగా ఉందని ఇలాంటి సమయంలో ఎన్ఆర్ఎస్‌సీ డేటా దిక్సూచీలా మారిందన్నారు. వికసిత్ భారత్ 2047 సాధనలో భూమి పరిశీలన విధానాలు,ధోరణులు, సవాళ్లు అనే అంశంపై ఎన్ఆర్ఎస్‌సీ సెంటర్లో శుక్రవారం జరిగిన సదస్సులో రంగనాథ్ హాజరై ప్రసంగించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణలోనే కాదు.. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల లెక్క తేల్చడంలో కూడా ఈడేటా హైడ్రాకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వందలాది మంది వస్తుంటారని.. వారి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిశీలించడానికి కూడా ఈ డేటా వాడుతున్నామన్నారు. ఎప్పుడు ఎలా భూ వినియోగం మారిందో ఫిర్యాదుదారులకు కళ్లకు కట్టినట్టు చూపించి చాలావరకు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఓఆర్ ఆర్ వరకూ హైడ్రా పరిధి విస్తరించి ఉందని.. ఎన్ ఆర్ ఎస్ సీ లెక్కల ప్రకారం దాదాపు 61 శాతం చెరువులు మాయం అయ్యాయని ఇలాంటి తరుణంలో చెరువుల జాడ తెలుసుకుని వాటిని పరిరక్షి ంచే పనిని ముమ్మరం చేశామన్నారు. హైడ్రా చర్యలతో రియల్టర్లతో పాటు.. ఇతరులెవరూ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో లే ఔట్‌లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. 2006లో ఉన్న ఎన్ఆర్ఎస్‌సీ అందించిన డెమ్ (డిజిటల్ మోడల్ ఎలివేషన్) డేటాతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌లను నిర్ధారించడం జరుగుతోందని.. అవసరమైతే 1970, 1990ల నాటి డేటాను కూడా తాము వినియోగించుకుంటామని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలో సుమారు 1350 ఎకరాల ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమిని కాపాడామని దీని విలువ దాదాపు ..70,000 కోట్ల వరకూ ఉంటుందని చెప్పారు. నీటి వనరులను కాపాడడంలో హైడ్రా చొరవ అభినందనీయమని ఇస్రో ఛైర్మెన్ డా. వి. నారాయణన్ అన్నారు. సదస్సులో వర్చ్యువల్ ద్వారా కీలకోపన్యాసం చేశారు. ఇస్రో సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు చేరవేయడంలో హైడ్రా చొరవ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అంతరిక్ష ఆధారిత సాంకేతికతను వినియోగించి ప్రజా ఆస్తులతో పాటు సరస్సులను రక్షి ంచేందుకు హైడ్రా చేస్తున్న కృషిని ఇస్రో శాస్త్రవేత్తలు అభినందించారు. ఎన్ఆర్ఎస్ సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్, ఇస్రో మాజీ ఛైర్మెన్ ఏఎస్ కిరణ్ కుమార్‌తో పాటు పలువురు మాట్లాడారు. చెరువులు, పార్కులు కాపాడడంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

**'హైడ్రారక్ష' పోర్టల్‌ను ప్రారంభించిన సదస్సు..**

ఎన్ఆర్ఎస్‌సీ సెంటర్లో శుక్రవారం జరిగిన సదస్సులో పలువురు శాస్త్రవేత్తల సమక్షంలో "హైడ్రారక్ష" పౌర కేంద్రిత పోర్టల్ ప్రారంభమైంది. ఓఆర్ ఆర్ పరిధిలోని చెరువులు, నాలాల హద్దులతో పాటు.. భూముల వివరాలు తెలుసుకునేందుకు హైడ్రా రక్ష పోర్టల్ ఉపయోగపడుతుంది.

చెరువులు, ప్రభుత్వ భూములతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్రజలు కొని మోసపోకుండా సరైన సమాచారం ఈ పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానుంది. కొంటున్న ప్లాట్లు చెరువుల చెంత ఉన్నాయా.. నాలాల బఫర్‌లోనివా అనేది తెలుసుకోడానికి వీలు కుదురుతుంది. జిల్లా / మండలం / గ్రామం, సరస్సు పేరుతో పాటు భౌగోళిక సమన్వయాలు ఈ పోర్టల్‌లో ఎంటర్ చేస్తే సంబంధిత ప్రాంతం ఆటోమేటిక్‌గా జూమ్ అవుతుంది. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్) సరిహద్దులు, బఫర్ జోన్‌లు తెలుస్తాయి. "హైడ్రా రక్ష" పోర్టల్‌ను మొదట్లో కొన్ని వారాల వరకూ హైడ్రా అంతర్గత వినియోగానికి మాత్రమే వినియోగిస్తుంది.

పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చిన తర్వాత ఈ పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి

# దేశంలోని ముస్లింలపై దాడులు, హింసాత్మక సంఘటనలు పెరిగి పోతున్నాయి

**శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజా స్వామ్య హక్కు పౌరులకు ఉంది : అసదుద్దీన్**



మక్కామసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్దనలలో పాల్గొన్న ముస్లిం

**చార్మినార్,మార్చి 13 ప్రభాతవార్త :** దేశంలోని పలు ప్రాంతాలలో ముస్లింలపై హింసాత్మక సంఘటనలు,విద్వేషం, దాడులు రోజు,రోజుకు పెరిగి పోతున్నాయని ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రంజాన్ మాసంలోని నాలుగవ శుక్రవారం చారిత్రక మక్కామసీదులో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్దనలు అనంతరం ఎఐఎంఐఎం అధ్వర్యంలో జరిగిన యౌముల్ ఖురాన్ పఠనం కార్యక్రమంలో ఆయన పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ఇటువంటి పరిణామాలు భారత రాజ్యాంగం ఇచ్చిన సమానత్వం, న్యాయం,సౌభ్రాతృత్వ సూత్రాలను తీవ్రంగా కలచి వేస్తున్నాయని తెలిపారు. దేశంలో రోజు,రోజుకు ముస్లింలపై దాడులు పెరిగి పోతున్నాయని ఆయన తెలియజేశారు. దేశంలో ఇటీవల జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ మేఘాలయలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు ముస్లింలను బెంగాలీ మాట్లాడే ముస్లింలని ఆరోపిస్తూ హత్య చేశారని, బిజెపి నాయకులు ఉద్దేశ్య పూర్వకంగానే ముస్లింలపై ద్వేషం, అనుమానం పెంచుతున్నారని అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిత్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గంలోని దాల్ మండిలో ముస్లింల ఇండ్లు కూల్చివేశారని, చట్టం ప్రకారం దేశంలోని పౌరులను సమానంగా చూడాలని ఆయన తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంబాల్‌లో ఇరాన్ దేశంపై దాడికి వ్యతిరేకంగా నిరసనలు చేసిన ముస్లింలను ఒక పోలీస్ అధికారి హెచ్చరించారని, భారత దేశం అందరిదని, చట్టం పరిధిలో శాంతి యుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కు పౌరులకు ఉందని ఆయన తెలియజేశారు. ఒక దేశం మరోక దేశంపై దాడి చేయకూడదని, వివాదాలను చర్చలు,

దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టంగా చెప్పాలని ఆయన కోరారు. యూనిఫాం సివిల్ కోడ్‌పై అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా ముస్లింలపై హిందూ చట్టాన్ని విధించలేమని, బహుత్వ సమాజంలో మత స్వేచ్ఛ మరియు వ్యక్తి గత చట్టాలను తప్పని సరిగా గౌరవించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం శాసన సభ్యులు మీర్‌జుల్ఫికర్ అలీ,

అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ అఫెందీతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా మక్కామసీదులో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్దనలలో వేలాది మంది ముస్లిం సోదురుల పాల్గొన్నారు. చార్మినార్ జోన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మా చావుతోనైనా యూనివర్సిటీ రూపురేఖలు మారాలి

**సమస్యలు పరిష్కరించకపోతే .. ఆత్మహత్య చేసుకుంటాం..**

**- వర్సిటీ భవనంపైకి ఎక్కి విద్యార్థుల నిరసన**

**- అసెంబ్లీలో వర్సిటీ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కెటిఆర్**

**- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ - విసి హామీతో దీక్ష విరమణ**

**అత్తాపూర్ మార్చి13,ప్రభాతవార్త :** యూనివర్సిటీలో విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా బంది చేస్తున్నారని పోలీసులతో ఉద్యామాన్ని అణిచివేయాలని చూస్తున్నారని యూనివర్సిటీ స్కాలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, కార్యదర్శి మనోజ్ కుమార్ గౌడ్, లోకేష్ ముదిరాజ్‌లు మండిపడ్డారు. రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న రెండురోజు నిరాహార అమరణ దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. విద్యార్థుల హక్కులను కాల రాస్తున్నారని విద్యార్థులకు పెంచిన స్టైపెండును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ స్కాలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, కార్యదర్శి మనోజ్ కుమార్ గౌడ్, లోకేష్ ముదిరాజ్ లు కాలేజీ బిల్డింగ్ పైకి నిరసన చేపట్టారు. పోలీసులు,అధికారులు విద్యార్థులకు ఎంత నచ్చజెప్పిన భవనంపై నుండి కిందకు దిగిరాకపోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వ్యవసాయ శాఖ మంత్రి వచ్చి హామీ ఇచ్చేంతవరకు మా ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా భవనంపై నుండి ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ...యూనివర్సిటీలో విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా బంది చేస్తాన్నారని మా ముగ్గురి ఆత్మహత్యతోనైనా యూనివర్సిటీ రూపురేఖలు మరాలన్నారు. ప్రభుత్వం పెట్టిన సర్క్యులర్‌ను వెంటనే అమోదం తెలిపి అమలు చేయాలని వ్యవసాయ మంత్రి ఎందుకు ఇన్ని రోజులు సర్క్యులర్ అపివేశారో చెప్పాలని వెంటనే మంత్రులు, డిప్యూటీ సిఎం స్పందించి రావాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి రెండు సార్లు వచ్చారని సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని రాష్ట్రనికి ,వ్యవసాయానికి వెన్నముకగా యూనివర్సిటీ నిలుస్తుందని చాలా సమస్యలు ఉన్నాయని మా యొక్క చావుతోనైనా యూనివర్సిటీ రూపురేఖలు మారాలని అన్నారు. ముఖ్యమంత్రి ,మంత్రులు వచ్చి స్పష్టమైన ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థుల నిరసనకు మద్దతు పలికారు. విద్యార్థుల సమ్యలను కెటిఆర్‌కు ఫోన్‌లో వివరించాడంతో కెటిఆర్ విద్యార్థులతో ఫోన్ ద్వారా మాట్లాడారు...వ్యవసాయ వర్సిటీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఈనెల 16వ తేది నుండి ప్రారంభయే అసెంబ్లి సమావేశంలో వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై అసెంబ్లిలో ప్రభుత్వాన్ని నిలదిస్తామని ప్రభుత్వం యూనవర్సిటీ భూములను హైకోర్టు కోసం తీసుకున్నారని చాలా రకాలు రియల్ ఎస్టేట్ పనులకు కూడా యూనివర్సిటీ స్థలాలను వాడుకుంటున్నారని యూనవర్సిటీకి అన్యాయం చేయడం సరికాదని విద్యార్థుల పక్షాన పోరాటం చేసి వారికి అన్ని విధాలుగా న్యాయం



విద్యార్థులకు మద్దతు తెలుపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

జరిగాలే చూస్తామని హామీ ఇచ్చారు.

**తుమ్మల నాగేశ్వర్ రావు వెంటనే రాజీనామా చేయాలి : ప్రవీణ్ కుమార్**

విద్యార్థుల నిరసనలో బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీని తీసుకొచ్చి మాది రైతు ప్రభుత్వామని రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పారని రైతాంగాన్ని ఆదుకునే పిజిలు,పిహెచ్‌డి విద్యార్థులకు మాత్రం కనీస అవసరాలను పరిష్కరించడం లేదని విద్యార్థుల సమస్యల కోసం పోరాటం కొనసాగిస్తున్నా విద్యార్థులను పోలీసుతో అణివేయాలని చూస్తున్నారని 12వేల పిజి,పిహెచ్‌డి విద్యార్థులకు 15వేల చేస్తున్నట్లు సర్క్యులర్ ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మంత్రి వద్దు అంటున్నారని విద్యార్థులు చెప్పుతున్నారని మంత్రి ఎందుకు వద్దు అంటున్నారని చెప్పాలని మంత్రులు కోట్ల రూపాయలను తమ అవసరాలకు వాడుకుంటునప్పుడు పేద విద్యార్థులకు ఇవ్వడానికి రాదని ప్రశ్నించారు. 45 లక్షల రూపాయలు ఇస్తే సమస్య తీరుతుందని కాని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. విసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తుంటుంటే మంత్రి తుమ్మల అడ్డం పడుతున్నాడని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి రావాల్సిన స్టైపెండ్‌ను వెంటనే అమలు చేయాలని అదేవిధంగా తుమ్మల నాగేశ్వర్ రావు వెంటనే రాజినామా చేయాలని డిమాండ్ చేశారు. చివరగా స్పందించిన యూనివర్సిటీ వీసి విద్యార్థులకు ఈనెల16లోపు అకౌంట్‌లో అమౌంట్ జామ చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడం దీక్ష విరమించారు.

# వికలాంగుల పెన్షన్ ఆరు వేలకు పెంచాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తక్షణమే అమలుచేయాలి**

**వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణ రాష్ట్ర కమిటీ**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న చెరుపల్లి సీతారాములు

**ధర్నాచౌక్, మార్చి 13, ప్రభాతవార్త:** వికలాంగుల పెన్షన్ ఆరువేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీపీఎం నేత చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ ఆరువేలకు పెంచటంతో పాటు, చేయూత పెన్షన్‌లు 4వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేటి వరకు హామీలు అమలుచేయలేదని, తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం మార్చి 20న ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో పెన్షన్స్ పెంపుదలకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే.వెంకట్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో సుమారు 25లక్షల మంది చేయూత పెన్షన్‌లకు దరఖాస్తు చేసుకుని, ఎదురుచూస్తూ ఉంటే, ఇప్పటి వరకు ప్రభుత్వం విడుదల చేయకపోవటం దారుణమన్నారు. మార్చి 16 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాలలో పెన్షన్స్ పెంపుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం.అడివయ్య, నాయకులు ఆర్.వెంకటేష్, కే.రాజు, స్వామి, కాషప్ప, బాలీశ్వర్, చందు, రాజు, నర్సింహ, భాగ్యలక్ష్మి, జంగులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కిష్కింధలోనే హనుమంతుని భవ్యమందిర నిర్మాణం

**- నకిలీ పీఠాధిపతులు, బాబాలను నమ్మకండి**

**-విధుశేఖరభారతి మహాస్వామి పై సంచలన వ్యాఖ్యలు చేసిన గోవిందానందసరస్వతిస్వామి**

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** అయోధ్యలో రామమందిరం నిర్మించినట్లే కర్నాటక కిష్కింధలో హనుమంతుని భవ్యమందిరం నిర్మాణం చేపడతామని సుకశంకర పీఠాధపతి గోవిందానందసరస్వతిస్వామి వ్యాఖ్యానించారు. ఇందుకు అక్కడి ప్రభుత్వం వందకోట్ల రూపాయలు కూడా కేటాయించిందని ఆయన వెల్లడించారు. హనుమంతుని మందిరం నిర్మించి దేశవ్యాప్తంగా ప్రచారయాత్ర మొదలుపెడ తానన్నారు. ఇందుకు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి, బద్రినారాయణుడు ఆశీస్సులు కోరానన్నారు. దేశంలో నకిలీ పీఠాధిపతులు, నకిలీ బాబాలు, నకిలీ మఠాధిపతుల పేరుతో చలామణి అవుతున్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన కీలకంగా అన్నారు. శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖరభారతి నకిలీ పీఠాధిపతి అని ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. తిరుమలలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమంగా మారాయి. జమ్మూకాశ్మీర్‌లో పిఒకె వద్ద శారదాఅమ్మవారి విగ్రహం ప్రతిష్టకూడా జరగనుందన్నారు. హంపి విజయనగరానికి తిరుపతికి అవినాభావ సంబంధం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మాన్ని రక్షించే ప్రక్రియలో ఆయన శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిపై చేసిన విమర్శన వ్యాఖ్యలు స్వాముల్లో రగడకు కారణంగా మారాయి. శృంగేరి శారదాపీఠంకు విధుశేఖరభారతి స్వామి ఉత్తరాదికారికాదని గోవిందానందసరస్వతిస్వామి తిరుమల ఆలయం ముందు సంచలన వ్యాఖ్యలు చేయడం హిందుసంఘాల్లో కలకలంగా మారింది.

# పెద్ద దిక్కును కోల్పోయిన జర్జంగి

**దొర మరణంతో గ్రామంలో విషాదఛాయలు**



**కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా) మార్చి 13 ప్రభాతవార్త** శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూసిన హెచ్ జె దొర. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డి.జి.పిగా పని చేశారు. అనంతరం కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా, సి.ఐ.ఎస్.ఎఫ్ మాజీ డీ.జీగా పని చేశారు. ఈయన 1943లో శ్రీకాకుళం జిల్లా జడ్డంగి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య జర్జంగిలో, ఉన్నత విద్య ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖపట్నంలో జరిగింది. అనంతరం అఖిల భారత సర్వీస్ అయిన ఐ.పీ.ఎస్‌కు ఎంపికయ్యారు. ఈయన వివిధ హోదాలలో ఆంధ్రప్రదేశ్ లో పనిచేసి డి.జి.పి స్థాయిని చేరుకుని ఉద్యోగ విర మణ పొందారు. ఈయన తండ్రి సత్య నారాయణ దొర 1952 సంవత్సరం నరసన్నపేట శాసనసభ్యునిగా ఎన్నిక య్యారు. ఆయన హయాంలోనే కోట బొమ్మాళికి ఉన్నత పాఠశాల తీసుకువచ్చారు. హెచ్.జే.దొర అత్తవారు నందిగామ మండలం, వెంకన్నపేట గ్రామం కాగా, ఈయనకు భార్య మీనాక్షి, కుమారుడు సత్యనారాయణ (సాఫ్ట్వేర్ ఇంజనీర్), కుమార్తె సాయి లీల (లండన్‌లో వైద్య వృత్తి) ఉన్నారు. ఈయన సోదరుడు హెచ్.ఎల్.ఎన్. దొర విశాఖపట్నంలో కమర్షియల్ టాక్స్ ఎడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. దొర గ్రామంలో కొంత స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామ ప్రజలకు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు గాను కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. అలాగే ఒక శివాలయం, ఒక బాబా ఆలయం నిర్మాణం చేపట్టారు. తన స్వగృహాన్ని ఉచితంగా వృత్తి విద్య కోర్సులు నిర్వహణకు జి.ఎం.ఆర్ సంస్థకు అప్ప గించారు. గ్రామానికి ఉన్నత పాఠశాల తీసుకురావడంతో పాటు, ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉపాధ్యాయులకు దుస్తులు పంపిణీ చేపడుతూ వస్తున్నారు. దొర అంత్య క్రియలు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో తన స్వగృహము నందు నిర్వహించనున్నట్లు వారి బంధు వర్గాలు తెలిపాయి. దొర మృతి వార్త విన్న జర్జంగి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ గ్రామం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1965 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన అయన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా, సి.ఐ.ఎస్.ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా, ఎపిఎస్ ఆర్టీసీ ఎం.డిగా, ఇంటలిజెన్స్ అధికారిగా, హైదరాబాద్ పోలీస్ కమీషనర్‌గా ఇలా పలు హోదాలలో పనిచేసి మెరుగైన పనితీరు కనబరిచారు.

# నెయ్యికల్తీపై ఆధారాలుంటే సిబిఐకి ఇవ్వండి

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి గతంలో కల్తీనెయ్యి వాడారనే వివాదంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా పరిస్థితులు మారుతున్నాయని పిటిషనర్ తరపున న్యాయవాది సుప్రీంకోర్టు ధర్మాసనంకు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఈ అంశంపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయకుండా నిలువరించాలని కోరుతూ మానూరు శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు పెండింగ్ లో ఉన్నందున ,తాము జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు న్యాయస్థానం. లడ్డూ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సీబీఐకి తెలియజేయాలని సూచన లడ్డూల కల్తీనెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని పిటిషన్‌లో శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిపై తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.

# తిరుపతి మహానగరం మార్పు అవసరం!

**- చివరి కౌన్సిల్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష - పూర్తయిన ఐదేళ్ల పాలన**

**తిరుపతి,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం,ఆధ్యాత్మికనగరంగానేగాక స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న తిరుపతి మహానగరం(గ్రేటర్‌తిరుపతి)గా మార్పు చెందాల్సిన అవసరముందని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష ఉద్ఘాటించారు. గత ఐదుసంవత్సరాల కౌన్సిల్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, జరిగిన అభివృద్ధి తిరుపతి గ్రేటర్ నగరంగా మారడానికి అడుగులు పడుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2021-26మధ్యకాలంలో తిరుపతి నగరపాలకసంస్థగా రూపుదిద్దుకుందని, తొలి కార్పొరేషన్ ఎన్నికలతో మేయర్ ,కార్పొరేటర్లుగా పదవులు ఏర్పడ్డాయన్నారు. గత ఐదేళ్ళలో మాకౌన్సిల్‌లో తిరుపతి నగర రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టామని ప్రతిష్టాత్మకంగా తెలిపారు. ఎంతో విశిష్టత ఉన్న తిరుపతి నగరానికి తొలి మేయర్ కావడం తనకు లభించిన అరుదైన గౌరవమన్నారు. రాష్ట్రప్రభుత్వం నగరపాలకసంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ పదవీకాలం ముగిసింది. శుక్రవారం ఉదయం ఎస్వీయూ సెనేట్‌హాల్‌లో చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రారంభ ఉపన్యాసంలో తొలిమేయర్ ,చివరి మేయర్ డాక్టర్ ఆర్.శిరీష మాట్లాడుతూ తిరుపతి మున్సిపాల్టీ నుండి నగరపాలక సంస్థగా ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో మేయర్ చివరి ప్రసంగం చేశారు.



ఆధ్యాత్మిక కేంద్రం, శ్రీవేంకటేశ్వరస్వామిపాదాల చెంత నెలకొన్న తిరుపతి నగరానికి ప్రజాప్రతినిధులుగా పనిచేయడం మనందరి అదృష్టమన్నారు. దాదాపు ఐదు లక్షల మంది తిరుపతి నగర జనాభాలో ఇదీ అప్పటి పరిస్థితుల్లో మనకు లభించిన అరుదైన అవకాశమన్నారు. గత ఐదు సంవత్సరాల కౌన్సిల్ పాలనలో తీపి గుర్తులు, మరిచిపోలేనన్నారు.

# 19న ఉగాది ఆస్థానం

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 19వతేదీ గురువారం తెలుగు నూతన "పరాభవనామసంవత్సర" ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ సందర్భంగా 19వ తేదీవిఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. 18వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరించబడవు. శ్రీనివాసుడు కొలువైన ఆనందనిలయంలో బంగారు వాకిలిలో 19వతేదీ గురువారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు.

# మోడరన్ లుక్ తెచ్చే తెలుపు

ఫ్యాషన్ ఫ్యాషన్






తెలుపుకి మించిన క్లాసీ కలర్ లేదంటే కాదనీ చెప్పలేం. వేసవిలో చల్లదానన్ని ఇస్తుంది. తెలుపు డ్రెస్‌కి కాంట్రాస్ట్‌గా రంగుల చున్నీని జత ,చేస్తే అందంగా ఉంటుంది. తెలుపుకి ఏ రంగైనా నప్పేస్తుంది. ఒకే రంగు ముదురు చున్నీనైనా ఎంచుకోవచ్చు. హరివిల్లు వర్ణాలన్నీ చుట్టేసినట్లుగా భిన్న రంగుల వేళవింపుతో ఉన్నవైనా జత చేసుకోవచ్చు. పేస్టల్ రంగులవి ఎంచుకుంటే మోడరన్ లుక్‌నీ తెచ్చేసుకోవచ్చు.

# ప్లాస్టిక్‌ని రీసైకిల్ చేస్తూ మహిళలకు ఉపాధి..



మహిళల సంపాదన... తన కుటుంబం లోనే కాదు, సమాజం లోనూ సానుకూల మార్పులు తెస్తుంది. వాళ్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందం టారు రూప్ జ్యోతి సైకియా గోగోయి. దానికోసం ఆమె 'విలేజ్ వీవ్స్' సంస్థను ప్రారంభించి ప్లాస్టిక్ ని రీసైకిల్ చేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తు_న్నారు. పర్యావరణ కాలుష్యానికి ముఖ్య మనం వాడే ప్లాస్టిక్ ఈ కాలుష్యాన్ని తగ్గించడానికి ఎన్ని నిబంధనలు వచ్చినా దీని వినియోగం మాత్రం ఆగడం లేదు. పర్యటక ప్రాంతాలైతే చెప్పనక్కర్లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుని ఉంటుంది. ఇవి మూగజీవాల ప్రాణాలను తీస్తున్నాయంటారు రూప్ జ్యోతి. కాజీరంగా నేషనల్ పార్క్... ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది పార్క్ నిత్యం పర్యటకుల తాకిడి ఎక్కువ. దాంతో ఈ ప్రాంతం పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ సంచులు, సీసాలు, ఆహార పదార్థాల కవర్లతో నిండిపోయేది. ఈ కాలుష్యాన్ని కట్టడి చేయాలనుకున్నారు రూప్ జ్యోతి. అందుకోసం పార్క్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైకిల్ చేసి గృహోపకరణాలు తయారుచేస్తున్నారు. దీనికోసం 2004లో విలేజ్ వీవ్స్ ప్రారంభించి, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మొదట్లో ప్లాస్టిక్‌తోనే వస్తువులు చేయాలనుకున్నా. కానీ కుదరలేదు. దాంతో ప్లాస్టిక్ కాటన్ దారాలు కలిపి తయారుచేశా. పార్క్ సహా పలు ప్రాంతాలని వ్యర్థాల్ని సేకరించడం మొదలు పెట్టా. చుట్టుపక్కల ప్రాంతాలని మహిళలకూ దీన్ని నేర్పించా. ఇక్కడి మహిళలు చిన్నప్పటి నుంచీ చేతివృత్తులను నేర్చుకుంటారు. దాదాపు అందరి ఇళ్లల్లోనూ మగ్గం ఉంటుంది. వెదురుతో అలంకరణ వస్తువులు, చేనేత వస్త్రాలు తయారుచేస్తారు. దాంతో తొందరగానే ఈ పనిని నేర్చుకున్నారు. ప్రస్తుతం సుమారు 35గ్రామాల్లో 2వేల మందికి పైగా వీటిని తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో దారాన్ని ప్లాస్టిక్‌తో కలిపి అల్లుతాం. కాబట్టి ఎక్కువ రోజులు మన్నుతాయి. కానీ, మా వాళ్లకి విదేశీ పర్యటకులతో మాట్లాడటం వచ్చేది కాదు. దాంతో అమ్మకాలు తక్కువగా జరిగేవి. అందుకే కాజీరంగా హాట్ అనే ఆన్‌లైన్ యాప్ మొదలుపెట్టాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మా ఉత్పత్తులను అమ్ముతాం. పార్కి పర్యటకుల తాకిడి ఎక్కువ ఉన్నప్పుడు మేము నెలకు రూ.25వేలు వరకూ సంపాదిస్తాం. ప్రస్తుతం విదేశాల్లోనూ మా వస్తువులకి డిమాండ్ పెరిగింది. మా విలేజ్ వీవ్స్ సంస్థని మరింత విస్తరించి ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అదే నా లక్ష్యం అంటారు రూప్ జ్యోతి

## జ్ఞానుల హృదయం

ఆశ్రమంలో తన చుట్టూ ఉన్న భక్తులతో అనేక ఆధ్యాత్మిక విషయాలను పంచుకునేవారు రమణ మహర్షి. ఒక సందర్భంలో రమణులు.... సాధారణ వ్యక్తులకు హృదయం ఎడమ వైపున ఉంటుంది. కానీ జ్ఞానులకు కుడి వైపున ఉన్నట్లు గ్రహించాను. అష్టాంగ యోగం, శీతోపనిషత్తులు దీనికి ప్రామాణికం. జ్ఞానులకు కుడి వైపున ఉండే హృదయాన్ని చేతనా హృదయం అంటారు. చిన్నారులను మీరెవరని అడిగితే.. ఛాతీ కుడి వైపున చేతిని తాకించి తమ పేరు చెబుతారు. పిల్లలు దైవ సమానులు, వాళ్ల మనోహృదయం కుడివైపునే ఉంటుందన్నమాట. ఆధ్యాత్మిక విషయాలు అర్థం చేసుకోవాలంటే ప్రామాణిక గ్రంథాలను అధ్యయనం చేయాలి. ఆయా వస్తువుల అంతర్దృష్టితో పరిశీలించి, స్వానుభవంతో పరిశీలించాలి. పెద్దలతో చర్చించాలి. అప్పుడే మనం గ్రహించిన విషయాల్లో ఎంత నిజం ఉందో స్పష్టమవుతుంది. ఎందరో పెద్దలు 'నిన్ను నువ్వు తెలుసుకో' అన్నారు. నేను అనే భావం ఎక్కడ పుట్టిందో అదే హృదయం. నేను అనేది అహాన్ని సూచించే పదంగా పండితులు చెబుతున్నారు. కానీ అదే పదాన్ని 'నేను అనే అహమే బ్రహ్మ స్వరూపం' అని బృహదారణ్యక ఉపనిషత్తు గుర్తించింది. జగద్గురు ఆదిశంకరాచార్యులు 'అహం బ్రహ్మాస్మి' అన్నారు. ఈ సందర్భంలో హృదయాన్ని ఆత్మ స్వరూపం అనాలి. సూర్యుడు రాత్రి వేళ తన వెలుగును చంద్రుడికి ఇచ్చి ప్రకాశింపజేస్తున్న రీతిలో హృదయమనే సూర్యుడి కాంతి మనసనే చంద్రుణ్ణి ప్రకాశింపచేస్తోంది. మనసులో భేద భావాలు ఉంటే జనన మరణ చక్రం కొనసాగుతూనే ఉంటుంది. అలాంటి వ్యత్యాసాలు లేని జ్ఞానులను మోక్షం వరిస్తుంది. మనసుకు భేద బుద్ధి ఉంది కానీ హృదయానికి ఉండదు. అందుకే అది అన్ని శరీర భాగాలకూ సమ దృష్టితో రక్తాన్ని అందిస్తోంది. భేద బుద్ధి కలిగిన మనసును హృదయంలో లయం చేస్తే భగవత్ సాక్షాత్కారమవుతుంది అంటూ వివరించారు.

## రాగి పాన్‌కేక్



రాగిపిండి: ఒక కప్పు, మైదా: అర కప్పు, కరిగించిన వెన్న: పావు కప్పు, బేకింగ్ పౌడర్: ఒక టీస్పూన్, బేకింగ్ సోడా: చిటికెడు, గుడ్లు: రెండు, చక్కెర: అర కప్పు, పాలు: అర కప్పు, ఉప్పు: చిటికెడు, వెనిలా ఎసెన్స్: నాలుగు చుక్కలు, తేనె: రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం: ఒక గిన్నెలో రాగిపిండి, చక్కెర, మైదా, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, గుడ్లు, పాలు, ఉప్పు, ఎసెన్స్ వేసి బాగా కలపాలి. కరిగించిన వెన్న కూడా జోడించి మరోసారి కలిపి పది నిమిషాలు పక్కన పెట్టాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి కొద్దిగా వెన్నవేసి వేడయ్యాక పిండ మిశ్రమం వేసి సన్నని మంటపై రెండువైపులా కాల్చుకోవాలి. వాటి పైనుంచి తేనె వేసుకుంటే వేడివేడి రాగి పాన్ కేక్స్ సిద్ధం.

## ఆరోగ్య భాగ్యం: పికా రుచులు

ఇదొక ఆహార రుగ్మత. అబ్‌నార్మల్‌గా ఏదైనా తినకూడని వాటిని తినాలనిపించడాన్ని పికా అంటారు. ఇది ఒక మెంటల్ హెల్త్ కండీషన్‌గా 38.3% మందిలో అన్ని వయస్సుల వారిలో కన్పిస్తుంది. ఇది ఎక్కువగా 6 సంవత్సరాల లోపు పిల్లల్లో (22.6%), గర్భిణీలో (33%) కన్పిస్తుంది. ఇది తాత్కాలికంగా కొందరిలో ఉంటే, మరికొందరిలో పర్మనెంట్‌గా ఉంటుంది.

**కారణాలు :** దీనికి సరైనవ కారణం తెలియదు. ఐరన్ కాల్షియం, జింక్, విటమిన్ల లోపం, పోషకాహార లోపం, ఎదుగుదల లోపం ఉన్న జెనిటిక్ ప్రాబ్లమ్స్‌తో బాధపడేవారు, కడుపులో కొంకి పురుగులు, మలి పురుగులున్న సికల్‌సెల్ డిసీజ్, ఆటిజమ్, బుద్ధి మాంద్యత, అబ్సెసిల్ కంపలిసవ్ డిస్ ఆర్డర్ ఉన్న అధిక వత్తిడి, ఆందోళన, డిప్రెషన్ మానసికంగా దెబ్బతినడం కుటుంబ సమస్యలున్న తల్లిదండ్రుల నిర్లక్ష్యం, పిల్లల్ని తిట్టడం, పిల్లల పట్ల కేర్ లేకపోవడం కొందరు కుతూహలంతో, ఎంజాయ్ కోసం, కోపంతో తింటారు. ఆరోగ్యానికి హానికరమైన, ఎలాంటి పోషకవిలువలు లేని వాటిని తినేదాన్ని బట్టి వివిధ పేర్లతో పిలుస్తారు.

1. జియో పేజియా: నేలపై ఉన్న దుమ్ము, సుద్ద, ఇసుక, బురద తినడం.
2. పాగోపేజియా : ఐస్, ఐస్ గడ్డలు, ఐస్ వేసిన ఐటమ్స్ తినడం. ఇది ఐరన్ లోపనం ఉన్న రక్త హీనత ఉన్నవారిలో వస్తుంది.
3. అమైలోపేజియా : బియ్యం, పాస్తా. పిండి తినడం బలపాలు ఇది పెద్దవారిలో, వాసపు, ఇన్ఫెక్షన్స్‌ని బట్టి, ప్రోస్టేట్ గ్రంధి వాపుని బట్టి ఉంటుంది.
4. ట్రైకోపేజియా : వెంట్రుకలు, దారాలు, ఊలు, నూలుపోగులు తినాలనిపించడం
5. పాపిరోవేజియా : పేపర్స్, పుస్తకాలు చించి తినడం
6. మెటల్లో పేజియా : పెయింట్స్, మెటల్స్, మేకులు విరిగిన ఆటబొమ్మలు, స్క్రూలుతినడం.
7. లిథోపేజియా: బియ్యంలో మట్టి పెడ్డలు, రాళ్ళు తినడం.
8. హైలోపేజియా : గ్లాసు ముక్కలు, గాజు ముక్కలు తినడం.
9. ఎక్స్‌లోపేజియా: జంతువుల, మనుష్యుల మలాన్ని మలం ఉండల్ని తినడం.
11. యూరోపేజియా : జంతువుల, మనుష్యుల మూత్రాన్ని తాకి నోట్లో పెట్టుకొని చప్పరిచడం, త్రాగడం. వంటి అనేక అసహజమైన ప్రేరేపణల వల్ల తినడం జరుగుతుంది.

ఇవేగాక సోప్స్, టూత్‌పేస్టులు, పౌడర్స్, బటన్స్, గుండీలు గడ్డి, చెట్ల ఆకులు సిగరెట్ పీకలు బూడిద, బొగ్గు, కాపీ గింజలు, టీపొడి , తేయాకు, చాక్‌పీసులు, ముగ్గురాళ్ళు ఎగ్ పెంకులు, బట్ట పీలికలు, రబ్బరు ప్లాస్టిక్ ముక్కలు దారం ఉండల్ని నమలడం, పెన్సిల్స్, క్రేయాన్స్. పెన్నులు, ఇంక్, పెయింట్స్, బ్రష్‌లు తినడం వంటివి అనేకం చేస్తుంటారు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## 'పెద్ది' డాల్బీ సినిమాస్ ఫార్మెట్‌లో ఏప్రిల్ 30న రిలీజ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది పోస్ట్‌ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం మరో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఈ చిత్రం అత్యాధునిక డాల్బీ సినిమాస్ ఫార్మెట్‌లో కూడా విడుదల కానుంది. రామ్ చరణ్ మాస్ రగ్గడ్ అవతార్‌ను డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో చూడడం ప్రేక్షకులకు మరింత గ్రాండ్ ఎక్స్ పీరియన్స్ అందించనుంది. పెద్ది వంటి భారీ యాక్షన్, ఎమోషన్ కలిగిన సినిమాను డాల్బీ సినిమాస్ లో చూడడం ప్రేక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇవ్వనుంది.ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో రామ్ చరణ్ రగ్డ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చేతిలో బ్యాట్ పట్టుకుని, ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్న ఆయన క్యారెక్టర్ సినిమాలో పవర్‌ఫుల్ యాక్షన్‌ను సూచిస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పెద్ది ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం క్రియేట్ చేస్తోంది. పెద్ది ఫస్ట్ షాట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఎఆర్ రెహమాన్ అందించిన సౌండ్‌ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' 'కాలరే ఎత్తరా' పాట విడుదల



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం 'కాలరే ఎత్తరా'ను విడుదల చేసింది. గురువారం సాయంత్రం అభిమానుల కోలాహలం నడుమ హైదరాబాద్ లోని మైత్రి విమల్ థియేటర్ లో ఈ గీతావిష్కరణ వేడుక వైభవంగా జరిగింది. కాలరే ఎత్తరా' పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం, రామ్ మిర్యాల ఉత్సాహ భరితమైన గానం, కాసర్ల శ్యామ్ శక్తివంతమైన సాహిత్యం కలిసి.. సినిమా యొక్క మాస్ అప్పీల్‌ను ప్రతిబింబించేలా గొప్పగా ఉంది ఈ గీతం.'కాలరే ఎత్తరా' గీతావిష్కరణ కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "పవన్ కళ్యాణ్ తో సినిమా అనగానే కథ కూడా వినకుండా సినిమా చేయడానికి అంగీకరించిన రాశి ఖన్నాకు ముందుగా కృతజ్ఞతలు. ఈ పాటలో కూడా కళ్యాణ్ గారితో కలిసి అద్భుతంగా డ్యాన్స్ చేశారు రాశి. 1500-2000 మందితో భారీస్థాయిలో ఈ పాటను తెరకెక్కించాం.నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ.. "ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా చాలా బాగా వచ్చింది. ఖిగబ్బర్ సింగ్ఖి స్థాయికి తగ్గకూడదనే కసితో దర్శకుడు హరీష్ శంకర్ ఈ సినిమాని తెరకెక్కించారు. కథానాయిక రాశి ఖన్నా మాట్లాడుతూ.. "మీ అందరి ఉత్సాహం చూస్తుంటే పాట ఎంతగానో నచ్చిందని అర్థమవుతోంది. నేను కూడా ఈ పాటను ఎంతో ఎంజాయ్ చేశాను.

## ఆకట్టుకుంటున్న 'కార్మేని సెల్వం' టీజర్



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందు తున్న ద్విభాషా చిత్రం కార్మేని సెల్వం. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించను న్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా.. గురువారం తెలుగు టీజర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. "డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి" అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టు కుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మను షులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించ బోతు న్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయా నికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమోళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠతను పెంచుతోంది.

## 'డెకాయిట్' ఫ్యామిలీతో చూడదగ్గ సినిమా. -అడివి శేష్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తు న్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. షూట్ ర్యాప్ ప్రెస్ మీట్‌లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ.. డెకాయిట్ ఒక కొత్త జోనర్ లో చేసిన సినిమా. ఈ మధ్యకాలంలో మనం లవ్ స్టోరీస్ చెప్పడం మానేశాను. ఈరోజుల్లో అందరూ ఒక మంచి లవ్ స్టోరీ కోరుకుంటున్నారు. ప్రొడ్యూసర్ సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ.. ఈ సినిమా ఒక లాంగ్ జర్నీ. ఈరోజు షూటింగ్ ఫినిష్ అయ్యింది. నెక్స్ట్ డే ఏం చేయాలి అని ఆలోచనలు పడ్డాం(నవ్వుతూ) సినిమా రిలీజ్ చేయాలి. మా జర్నీలో ఏం చేసినా దాన్ని బయటకు తీసుకెళ్లేదే మీడియా. ఈ ఎక్సయిట్మెంట్ మీతో పంచుకోవాలని ఈ సెట్‌లో ఈవెంట్ ని నిర్వహించడం జరుగుతుంది. డైరెక్టర్ కి ఇది ఫస్ట్ ఫిలిం, అనురాగ్ ఫస్ట్ తెలుగులో నటిస్తున్న సినిమా, శేష్ గారు చేస్తున్న ఫస్ట్ లవ్ స్టోరీ ఇది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

# తెర

## 'వృషకర్మ' స్టన్స్ కోసర్త BTS స్టిల్స్ రిలీజ్




యువ సామ్రాట్ నాగ చైతన్య తన అప్ కమింగ్ నెవర్ బిఫోర్ మిథికల్ స్పెక్టకిల్ 'వృషకర్మ' స్టన్స్ కోసర్త BTS స్టిల్స్ రిలీజ్యువ సామ్రాట్ నాగ చైతన్య తన అప్ కమింగ్ నెవర్ బిఫోర్ మిథికల్ స్పెక్టకిల్ ఖివృషకర్మఖి కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. 'విరూపాక్'తో బ్లాక్ బస్టర్ సాధించిన కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని SVCC, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ వెంచర్‌ను సమర్పిస్తున్నారు. తీజుశీవి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృషకర్మ' గ్లింప్స్ అన్ని ప్లాట్‌ఫామ్‌లు, ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను పొందింది. వెంటనే వైరల్ అయ్యి భారీ సంచలనాన్ని సృష్టిస్తోంది. ఇంటెన్స్ విజువల్స్, పవర్ ఫుల్ వరల్డ్ బిల్డింగ్ అందరినీ ఆశ్చర్యపరిచాయి, సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. మేకర్స్ ఈరోజు యువ సామ్రాట్ నాగ చైతన్యను ఫియర్సెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ లో ప్రజెంట్ చేసే సరికొత్త BTS స్టిల్స్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫోటోలు పాత్ర కోసం ఆయన చేసిన కఠినమైన ట్రాన్స్‌ఫర్మేషన్, అలాగే అర్జున్ పాత్రను సహజంగా తెరపై చూపించేందుకు పెట్టిన అంకితభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఒక BTS స్టిల్‌లో చైతన్య ఇంటెన్స్‌గా వర్కౌట్ చేస్తూ కనిపిస్తున్నారు. ఆ ఫోటోలో ఆయన ప్రత్యేకంగా ఈ పాత్ర కోసం తీర్చిదిద్దుకున్న లీన్, చిసెల్డ్ ఫిజిక్ స్పష్టంగా కనిపిస్తోంది. మరో స్టిల్‌లో చైతన్య గాయాలతో, యుద్ధానికి సిద్ధమైన యోధుడిలా కనిపిస్తున్నారు. ఈ రఫ్ అండ్ రగ్డ్ లుక్ సినిమాలో ఉండబోయే హైఆక్టేన్ యాక్షన్‌తో పాటు ఎమోషన ని సూచిస్తోంది. ఇది చైతన్య కెరీర్‌లో ఇప్పటివరకు ఎన్నడూ కనిపించని ఇంటెన్స్ ఆన్‌స్క్రీన్ అవతార్‌లలో ఒకటిగా నిలవనుంది. వృషకర్మ కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. 'విరూపాక్'తో బ్లాక్ బస్టర్ సాధించిన కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని SVCC, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి,

## 'యూత్' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహిం చారు. త్వరలోనే "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను హీరో కిరణ్ అబ్బవరం లాంఛ్ చేశారు. "యూత్"మూవీని తెలుగులోకి తీసుకొస్తున్న వినీత్, సందీప్ కిరణ్ అబ్బవరంతో చాలాకాలంగా ట్రావెల్ చేస్తున్నారు. కిరణ్ వారికి సపోర్ట్ గా నిలుస్తూ ఈ మూవీని ప్రమోట్ చేస్తున్నారు. "యూత్" ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లా అనిపిస్తోంది. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది.

# క్రీడా ప్రేమికుడు హెచ్‌జె దొర



**హైదరాబాద్, మార్చి13(వార్త క్రీడా ప్రతి నిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిజిపి, గతంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరించిన హనుమంతు జగన్నాయక్ దొర(హెచ్‌జె దొర) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. 83 ఏళ్ల హెచ్‌జె దొర మృతి క్రీడా లోకానికి తీరని లోటని తెలంగాణ ఒలింపిక్ సంఘం ఘనంగా నివాళి అర్పించింది. వివిధ క్రీడా సంఘాలు, క్రీడాకారులు, మాజీలు... హెచ్‌జె దొర మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గొప్ప క్రీడా పరిపాలకుడని కితాబిచ్చారు. అతని హయాంలో క్రీడలు పురోగతిని గుర్తుచేసుకున్నారు.

హెచ్‌జె దొర పోలీస్ ఉన్నతాధికారిగానే కాకుండా క్రీడా పరిపాలకుడిగా గుర్తింపు పొందారు. కేవలం పట్ల ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. క్రీడా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించి క్రీడల పురోగతికి పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘంగా పని చేసిన హెచ్‌జె దొర... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేశారు. అతని హయాంలోనే ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ భవన్ నిర్మాణం జరిగింది. దేశంలోనే ఇది తొలి ఒలింపిక్ భవన్ ఇది. ఈ పదవిలో ఉండగా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. క్రీడా మౌలిక వసతులతో పాటు యువ క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇప్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రోత్సహించారు.

హైదరాబాద్‌లో జరిగిన 2002 జాతీయ క్రీడల నిర్వహణలో హెచ్‌జే దొర కీలక పాత్ర పోషించారు. ఈక్రీడా పోటీలు విజయవంతంగాజరగడానికి ఆయన చేసిన నిర్వహణ, ప్రణాళిక దోహదపడింది. ఈ పోటీల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలపై ఆసక్తి పెరగడమే గాక, మంచి గుర్తింపు వచ్చింది. అనేక మంది యువకులు క్రీడల వైపు ఆకర్షితులయ్యారు. కొద్దికాలం హైదరాబాద్ హాకీ సంఘం అధ్యక్షుడిగానూ హెచ్‌జె దొర వ్యవహరించారు. ఈ కాలంలో బేగంపేటలో అధునాతన ఆస్ట్రోటర్ఫ్ హాకీ కాంప్లెక్స్ నిర్మించారు. రాష్ట్రంలోనే ఇది తొలి హాకీ ఆస్ట్రోటర్ఫ్. ఇక్కడ పలు జాతీయ హాకీ పోటీలు నిర్వహించడంలో ప్రధాన భూమిక వహించారు. ట్రిపుల్ ఒలింపియన్ ముకేష్‌తో పాటు పలువురు హాకీ క్రీడాకారులు దొర హయాంలోనే తయారయ్యారు.

**2006 కామన్‌వెల్త్ క్రీడలకు చెఫ్ డి మిషన్‌గా హెచ్‌జే దొర**

హెచ్‌జె దొర కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా క్రీడా పరిపాలనలో సేవలు అందించారు. ఆయన భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఈ పదవిలో ఉండగా భారత వెయిట్‌లిఫ్టర్లకు మంచిశిక్షణ అవకాశాలు కల్పించారు. అంతర్జాతీయ పోటీల్లో భారత వెయిట్ లిఫ్టర్లు మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి అవసరమైన మద్దతు అందించారు. 2006 కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్న భారత బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించారు. ఈ బాధ్యతలో ఆయన భారత క్రీడాకారుల సమన్వయం, నిర్వహణ వంటి పనులను సమర్థంగా నిర్వహించారు. హెచ్‌జే దొర కృషి వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు మంచి ప్రోత్సాహం లభించింది. మొత్తానికి మంచి క్రీడా పరిపాలకుడిగా మాత్రమే కాకుండా క్రీడల అభివృద్ధికి కట్టుబడి పనిచేసిన వ్యక్తి. క్రీడా రంగంలో దొర చేసిన కృషి భవిష్యత్తుతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.



దేశంలోనే తొలి ఒలింపిక్ భవన్

# భారత్‌కు ప్రపంచకప్ టికెట్

## సెమీస్‌లో ఇటలీకి షాక్ — ఫైనల్లో అమ్మాయిలు



**హైదరాబాద్, మార్చి13(వార్త క్రీడా ప్రతినిధి):** గచ్చిబౌలీ హాకీ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మహిళలప్రపంచకప్ క్వాలిఫైయింగ్ టోర్నీలో భారత అమ్మాయిలు అజేయంగా కొనసాగుతున్నారు. సెమీఫైనల్లో ఇటలీని 1-0తో ఓడించి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది.వరుసగా మూడోసారి ప్రపంచకప్ బెర్త్ అందుకుంది. ఈ ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచకప్‌లో పాల్గొననుంది. 2018 లండన్ ప్రపంచకప్‌లో 8వ స్థానం, 2022 వాలెన్సియా ప్రపంచకప్ లో 9వ స్థానం పొందింది.

లీగ్ మ్యాచ్‌ల్లో ఉరుగ్వే, వేల్స్‌ను ఓడించి స్కాట్లాండ్‌తో డ్రా చేసుకుని సెమీస్ చేరిన సలీమాటెటే నేతృత్వంలోని భారత అమ్మాయిలు... ఇటలీతో మ్యాచ్‌లోనూ జోరు చూపారు.తొలి రెండుక్వార్టర్‌లో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి.18వ నిమిషంలో భారత్‌కు తొలి పెనాల్టీ కార్నర్ లభించింది. నవనీత్ కొట్టిన షాట్‌ను ఇటలీ గోల్‌కీపర్ లూసియా చక్కగా అడ్డుకుంది.చివరకు మూడో క్వార్టర్‌లో భారత్‌కు గోల్ లభించింది. 39వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను మనీషా చౌహాన్ గోల్‌గా మలిచింది. చివరి క్వార్టర్‌లో భారత్ కు మరో రెండు పెనాల్టీకార్నర్‌లు లభించినా గోల్స్‌గా మలచలేకపోయింది.59వ నిమిషంలో ఇటలీకి కీలకమైన పెనాల్టీ కార్నర్ లభించింది. అయినప్పటికీ, భారత్ తమ ప్రత్యర్థిని గోల్ సమం చేయకుండా అడ్డుకుని విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

## స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విక్టరీ

అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్లో ఇంగ్లాడ్ 2-0 గోల్స్ తేడాతో స్కాట్లాండ్‌పై గెలుపొందింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో క్వార్టర్ 24వ నిమిషంలో బింగ్హామ్ లోల్టి ఇంగ్లాండ్‌కు తొలి గోల్ అందించింది. ఆ వెంటనే మరో నాలుగు నిమిషాలకు ఇంగ్లాండ్ ఖాతాలో రెండో గోల్ చేరింది. ఈసారి బోర్న్ డారే.. స్కాట్లాండ్ డిఫెన్స్‌లోకి దూసుకెళ్లి అద్భుతంగా గోల్‌గా మలిచింది. రెండో క్వార్టర్‌లో ఇంగ్లాండ్‌కు రెండు గోల్స్ లభించాయి. గోల్స్ సమం చేసేందుకు స్కాట్లాండ్ ప్రయత్నించినా..ఇంగ్లాండ్ రక్షణ పంక్తిని చేధించలేక చతికిలపడ్డారు. భారత్‌తో పాటు ఇంగ్లాండ్ ఫైనల్‌కు దూసుకెళ్లడం ద్వారా ప్రపంచకప్ బెర్త్ దక్కించుకున్నాయి. ఆదివారం ఇరు జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. అదే రోజు మూడోస్థానం కోసం స్కాట్లాండ్, ఇటలీ తలపడతాయి.ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది.



24వ నిమిషంలో ఇంగ్లాండ్‌కు తొలి గోల్ అందించిన బింగ్హామ్ లోల్టి

# స్విస్ ఓపెన్‌లో తరుణ్ సంచలనం

**పురుషుల సింగిల్స్‌లో ఒకే ఒక్కడు - క్వార్టర్స్‌లో జింటాంగ్‌తో పోరు**



భారత్ ఆశాకిరణం తరుణ్ మన్నెపల్లి

**బాసెల్:** స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన తరుణ్ మన్నెపల్లి సంచలన విజయాలతో దూసుకుపోతున్నాడు. భారీ అంచనా లున్న భారత షట్లర్లు పరాజయాలతో ఇంటిదారి పట్టగా పురుషుల సింగిల్స్‌లో భారత్‌సవాల్‌గా తరుణ్ ఒకే ఒక్కడుగా నిలిచాడు.ప్రి కార్వర్‌ఫైనల్లో మలేషియా ఆటగాడు జస్టిస్ హోపై 21-14, 22-20తో గెలుపొంది ముందంజ వేశాడు. ప్రపంచ 43వ ర్యాంకు లో ఉన్న తరుణ్ తొలి సెట్‌లో మలేషియా షట్లర్‌ను పదునైన ఏస్‌లు, తెలివైన ప్లేసింగ్‌లతో కంగుతినిపించాడు. రెండో సెట్‌లో పుంజుకున్న మలేషియా షట్లర్... తరుణ్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. టై బ్రేకర్‌లో ఒత్తిడికి లోనుకాకుండా తరుణ్ 22-20తో ముగించాడు. తొలిసారి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించిన కిరణ్ మన్నెపల్లి... జింటాంగ్‌తో తలపడనున్నాడు.

పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత షట్లర్ కిరణ్ జార్జ్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో కిరణ్ జార్జ్ 18-21, 21-16, 16-21 తేడాతో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గుణవన్ చేతిలో పరా జయం చెందారు.70నిమిషాల పాటు సాగిన పోరులో కిరణ్ అద్భుతంగా పోరాడిన ప్పటికీ, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పట్టు కోల్పోయి మూల్యం చెల్లించుకున్నారు.

మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి మాళవిక బన్సోద్‌కు నిరాశే ఎదురైంది.థాయ్‌లాండ్ స్టార్ ప్లేయర్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ పోర్న్‌పావీ చోచువాంగ్‌తో జరిగిన ఏకపక్ష పోరులో మాళవిక 11-21, 15-21 తేడాతో ఓటమి చూశారు.థాయ్ క్రీడాకారిణి చేతిలో మాళవికకు ఇది వరుసగా నాలుగో ఓటమి.

# డుప్లాంటిస్ 15వ ప్రపంచ రికార్డు

**స్వీడన్:** స్వీడిష్ పోల్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ 15వ సారి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. తన రికార్డులను తనే అధిగమిస్తూ చరిత్ర సృష్టిస్తున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ లో భాగంగా జరిగిన మోండో క్లాసిక్‌లో డుప్లాంటిస్ స్వదేశీ ప్రేక్షకుల ముందు ఈ మైలురాయిని సాధించాడు.6.31 మీటర్ల మార్కును సాధించడం ద్వారా ఈ ఒలింపిక్ ఛాంపియన్.. మునుపటి రికార్డును అధిగమించాడు. మొదట 5.65 మీటర్లు, ఆ తర్వాత 5.90 మీటర్లు, 6.08 మీటర్ల మార్కులను అధిగమించాడు. ఆపై 6.31 మీటర్ల రికార్డు ప్రయత్నం చేశాడు. ఈ మార్కును క్లియర్ చేయడం ద్వారా, డుప్లాంటిస్ సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తన ప్రపంచ రికార్డును మెరుగుపరుచుకున్నాడు. ఫిబ్రవరి 2020లో 6.17 మీటర్ల జంప్‌తో మొదటిసారి ప్రపంచ రికార్డు సృష్టించిన డిప్లాంటిస్... ఈ ఆరేళ్లలో మొత్తం 15సార్లు ప్రపంచ రికార్డులను సవరించాడు.తనతో పోటీ పడటానికి స్వీడన్‌కు వస్తే, నన్ను ఓడించడం మరింత కష్టం అవుతుందని ఈ సందర్భంగా డుప్లాంటిస్ అన్నారు. సొంత గడ్డపై ప్రపంచ రికార్డు నెలకొల్పడం నిజంగా అద్భుతమైందని పోలోవాల్ట్‌లో ఎదురులేని అర్మాండ్ డుప్లాంటిస సంతోషం వ్యక్తం చేశాడు.



# అమ్మకాల్లో 30 లక్షలు బ్రేక్‌చేసిన సెడాన్ డిజైర్

**న్యూఢిల్లీ, మార్చి 13:** ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా తమ పాప్యులర్ సెడాన్ డిజైర్ అమ్మకాలలో రికార్డుసాధించింది. దేశీయ మార్కెట్లో ఈ కారు అమ్మకాలు 30 లక్షల యూనిట్లను దాటాయని తెలిపింది. భారత మార్కెట్లో అత్యంత ఆదరణ పొందిన కార్లలో డిజైర్ ఒకటిగా నిలుస్తోంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా డిజైర్ నిలిచిందని, సెడాన్ విభాగంలో ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని మారుతి సుజుకి పేర్కొంది. 2008లో తొలిసారిగా మార్కెట్లోకి వచ్చిన ఈ కారు, ఇప్పటివరకు నాలుగు జనరేషన్ల అప్‌గ్రేడ్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. మారుతి సుజుకి ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకోవడంపై 30 లక్షల మంది డిజైర్ కస్టమర్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.



నాలుగో తరం డిజైర్ తన అధునాతన లుక్స్‌తో సెడాన్ సెగ్మెంట్‌కు కొత్త ఊపునిచ్చింది. కొనుగోలుదారుల్లో దాదాపు 50 శాతం మంది యువత, తొలిసారి కారు కొనేవారే ఉండటం దీనికి ఉన్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అనేక ఫీచర్లతో పాటు 5స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా డిజైర్ విజయానికి కారణమని బెనర్జీ తెలిపారు. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్, గ్లోబల్ ఎన్‌క్యాప్ రెండింటిలోనూ ఈ మోడల్ 5స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం.

ఆటోమేటెడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్, ఎల్‌ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ వంటి అధునాతన ఫీచర్లను అందిస్తూ ఈ కారు మార్కెట్లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో మారుతి సుజుకి అమ్మకాల్లో 12 శాతం వృద్ధిని నమోదు చేసింది.

# వాణిజ్యం



## దిగివచ్చిన పసిడి, వెండి ధరలు!

### ఫ్యూచర్స్‌లో వెనకబడిన విలువైన ఖనిజాలు

**ముంబయి, మార్చి 13:** బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయి నుంచి శుక్రవారం స్వల్పంగా దిగివచ్చాయి. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అమెరికా డాలర్ బలపడటంతో పసిడిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బంగారం పతనం పరిమితంగానే ఉంది. శుక్రవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.14 శాతం క్షీణించి 10 గ్రాములకు రూ. 1,59,400 వద్ద ట్రేడ్ అయింది. అలాగే మే సిల్వర్ ఫ్యూచర్స్ 0.19 శాతం నష్టపోయి కిలోకు రూ. 2,67,448కి చేరింది. అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, అధిక ముడిచమురు ధరల కారణంగా సురక్షిత పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ బలంగానే ఉంది. ఈ అంశాలు పసిడి ధరలు భారీగా పడిపోకుండా అడ్డుకుంటున్నాయి. ప్రస్తుతం బంగారం ధరలు ప్రధానంగా అమెరికాఇరాన్ యుద్ధ వార్తలు, డాలర్ మారకం విలువ, చమురు ధరల కదలికలపై ఆధారపడి ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీ అనలిస్ట్ మానవ్ మోదీ మాట్లాడుతూ అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, బలపడుతున్న డాలర్, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, ఫెడరల్ రిజర్వ్ విధానాలపై అనిశ్చితి వంటి కారణాలతో బంగారం రాణించలేకపోతోందన్నారు. ఎన్రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ ప్రకారం బంగారం ధరలు రికార్డు స్థాయిలను తాకిన తర్వాత స్వల్పకాలిక కరెక్షన్‌లోకి ప్రవేశించాయి. దీర్ఘకాలికంగా బంగారంపై సానుకూల ధోరణి చెక్కుచెదరలేదని, ప్రస్తుత తగ్గుదల తాత్కాలికమేననిఅన్నారు. మరోవైపు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కూడా పసిడిపై ప్రభావం చూపింది. మార్కెట్ల అస్థిరత కారణంగా నష్టాలను పూడ్చుకోవడానికి కొందరు ఇన్వెస్టర్లు బంగారాన్ని అమ్మి నగదుకు మార్చుకుంటున్నారు. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 0.47 శాతం తగ్గి 99.99 డాలర్ల వద్ద ఉండగా, బ్రెంట్ క్రూడ్ 0.67 శాతం తగ్గి 95.09 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఎంసీఎక్స్ గోల్డ్‌కు రూ. 1,56,000 రూ. 1,57,000 శ్రేణిలో మద్దతు ఉండగా, రూ. 1,75,000 రూ. 1,80,000 వద్ద నిరోధం ఎదురుకావచ్చని అంచనా వేస్తున్నారు. వెండికి రూ. 2,58,000 వద్ద మద్దతు, రూ. 2,78,000 వద్ద నిరోధక స్థాయి ఉంటుందని అంచనావేసారు. ఇక స్పాట్ మార్కెట్‌లో 24కేరట్ల తులం బంగారం రూ.1,60,690గా హైదరాబాద్‌లోనడిచింది. 22కేరట్లు రూ.1,47,300గాను 18 కేరట్ల బంగారం రూ.1,20,520గాను నడిచింది. స్పాట్ మారెనకట్‌లో కిలో వెంబడి రూ.2.90 లక్షలుగా కొనసాగింది. దేశవ్యాప్తంగా అత్యధికశాతం మార్కెట్లలో ఇవే ధరలు కొనసాగినట్లు సమాచారం.

## ప్రత్యేక వడ్డీరేట్లతో డిపాజిట్లకు బ్యాంకుల ఎర!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాల యుద్ధప్రభావంతో ఇపుడు పెట్టుబడులు సురక్షిత మార్గాలవైపు వెళుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ప్రత్యేక కాలపరిమితి డిపాజిట్ స్కీమ్స్‌తో ఎక్కువ వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. ఐడీబీఐ అందిస్తున్న ఐడీబీఐ ఉత్సవ్ స్పెషల్ ఎఫ్‌డీ త్వరలోనే ముగియనుంది. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు 666 రోజుల మెచ్యూరిటీ టెన్యూర్‌తో ప్రత్యేక డిపాజిట్ స్కీమ్‌కు సీనియర్ సిటిజన్లకు 7.25 శాతం, జనరల్ కస్టమర్లకు 6.75 శాతం వడ్డీ ఇస్తోంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 400 రోజుల టెన్యూర్ డిపాజిట్



స్కీమ్‌పై సీనియర్లకు 7.15 శాతం, జనరల్ కస్టమర్లకు 6.65 శాతం వడ్డీ ఇస్తోంది. బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 450 రోజుల టెన్యూర్ గల స్టార్ స్వర్నిమ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా సీనియర్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తున్నది. ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 444 రోజుల స్పెషల్ టెన్యూర్ డిపాజిట్ స్కీమ్స్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.60 శాతం వడ్డీ ఇస్తున్నాయి. ఇక సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తున్నాయి. కెనరా బ్యాంకులో 555 రోజుల స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 7 శాతం వడ్డీ ఇస్తోంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2222 రోజులు, 3333 రోజుల డిపాజిట్ స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.50 శాతం, 7 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 444 రోజుల బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా సీనియర్లకు 6.95 శాతం వడ్డీ ఇస్తోంది.

## భారత్ వృద్ధిరేటు 6.5% - గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా

**న్యూఢిల్లీ, మార్చి 13:** అంతర్జాతీయ రేటింగ్స్ంస్థ గోల్డ్‌మాన్‌శాక్స్ భారత్ జిడిపి వృద్ధిరేటు ఈ ఆర్థికసంవత్సరంలో ఏడుశాతం కాకుండా 6.5శాతం మాత్రమే ఉంటుందని వెల్లడించింది. అదేవిదంగా ఫిట్చ్ రేటింగ్స్‌కూడా జిడిపి వ1ద్ధిస్థిరంగా ఉంటుందని 2026లో 7.5శాతంగా ఉంటుందని వెల్లడించింది. అయితే రానురాను 2027లో 6.7శాతానికి చేరవచ్చని వివరించింది. భారత్ ద్రవ్యోల్బణం 3.9శాతంనుంచి 4.2శాతానికి పెరుగుతోందని, డిసెంబరునాటికి 4.5శాతంగా ఉండవచ్చని కూడా రేటింగ్ సంస్థలు అంచనావేసాయి. ప్రత్యేకించి ఇరాన్ యుద్ధం కారణంగా ముడిచమురుధరలు ఆకాశానికి పెరిగాయి. బ్యారెల్‌ధరలు 100 డాలర్లు పైబడ్డాయి. ప్రస్తుత ఆర్తికసంవత్సరంలో ఫిట్చ్ దేశీయంగా డిమాండ్ ఆర్థికవ్యవస్థ వృద్ధికి ఊతం ఇస్తుందని, 2027లో వృద్ధిమాత్రం క్రమేపీ తగ్గుతూ 6.7శాతానికి చేరుతుందని 2028లో 6.5శాతంగా ఉందని చెపుతున్నారు. క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగిస్తుందని కూడా వెల్లడించాయి. అక్టోబరు డిసెంబరుత్రైమాసికంలో 7.8శాతంగా ఉన్న సంగతి తెలిసిందే.

## పదవినుంచి దిగిపోతున్న అడోబ్ సిఇఒ..

**వాషింగ్టన్, మార్చి 13:** ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం అడోబ్ సిఇఒ శంతను నారాయణ్ తన పదవి నుంచి తప్పుకుంటున్నారు. దాదాపు 18 ఏళ్ల పాటు కంపెనీని విజయవంతంగా నడిపించిన ఆయన, తన నిర్ణయాన్ని ప్రకటించారు. కొత్త సీఈవో బాధ్యతలు చేపట్టే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత కూడా బోర్డు ఛైర్మన్‌గా కంపెనీకి తన మద్దతు అందిస్తారు. కొత్తసిఇఒను ఎంపిక చేసేందుకు అడోబ్ బోర్డు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కంపెనీలో అంతర్గతంగా ఉన్నవారితో పాటు బయటి నిపుణులను కూడా ఈ పదవి కోసం పరిశీలించనున్నారు. శంతను నారాయణ్ నాయకత్వంలో అడోబ్ సాధించిన పరివర్తన అద్భుతమని, ఏఐ యుగంలో కంపెనీ విజయానికి ఆయన బలమైన పునాది వేశారని అడోబ్ లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఫ్రాంక్ కాల్డెరోనీ ప్రశంసించారు. శంతను నారాయణ్ ఉద్యోగులను ఉద్దేశించి ఒక సందేశం పంపారు. 18 ఏళ్ల తర్వాత సీఈవో బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. నా హయాంలో కంపెనీ 3,000 మంది ఉద్యోగుల నుంచి 30,000 మందికి పెరిగింది. ఆదాయం బిలియన్ డాలర్ల నుంచి 25 బిలియన్ డాలర్లకు చేరింది. మనం కలిసి సాధించిన ఈ ఘనత పట్ల చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు. శంతను నారాయణ్ నిర్ణయంపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. అడోబ్‌లో మీది ఒక గొప్ప ప్రస్థానం. ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఒకటిగా అడోబ్‌ను నిలబెట్టారంటూ సోషల్ మీడియాలో అభినందనలు తెలిపారు. శంతను నారాయణ్ దాదాపు మూడు దశాబ్దాల క్రితం అడోబ్‌లో చేరారు. 2007లో సీఈవోగా బాధ్యతలు స్వీకరించి, కంపెనీ వ్యాపార నమూనాను ప్యాకేజ్డ్ సాఫ్ట్‌వేర్ నుంచి క్లౌడ్ ఆధారిత సబ్‌స్క్రిప్షన్ సేవలకు మార్చడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలోనే ఫొటోషాప్, క్రియేటివ్ క్లౌడ్ వంటి ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

## వారాంతంలో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**సెన్సెక్స్‌నిఫ్టీల్లో మెటల్; పిఎస్‌యు బ్యాంకింగ్ ఆటోస్టాక్స్‌లో భారీ నష్టాలు**

**ముడిచమురు, ఎఫ్‌పిఐల అమ్మకాలే కీలకం - రూ.10 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి**

**ముంబయి, మార్చి 13:** విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిళ్లు, ముడిచమురుదరలు పెరగడం, మరోపక్క యుద్ధభయాలతో స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లోముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్‌లో నమోదిత కంపెనీల విలువలురూ.10 లక్షలకోట్లు తగ్గింది. ముడిచమురుదరలు రానురాను బ్యారెల్‌కు 100 డాలర్లుగా పెరిగే అవకాశాలుండటంతో మార్కెట్లపై ఇన్వెస్టర్లకు ధీమా క్షీణించింది. దీనితో మెటల్, పిఎస్‌యు బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో భారీ అమ్మకాలు కొనసాగాయి. సెన్సెక్స్ 1470.50 పాయింట్లు క్షీణించి 74,563.92 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 588.05 పాయింట్లు క్షీణించి 23,151.10 పాయింట్లవద్ద ముగిసింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషనష్లలో సెన్సెక్స్ 4.65శాతం, నిఫ్టీ 4.57శాతం క్షీణించాయి. ఎల్అండ్‌టి 7.38శాతం, ఎస్‌బిఐ 3.61శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.93శాతం క్షీణించాయి. మారెనకట్లలో కీలక సూచీలన్నీ కూడా ఒత్తిళ్లమద్యనే కొనసాగాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 2.61వాతం క్షీణిస్తే బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్‌సూచీ 2.67శాతం దిగజారింది. బిఎస్ఇలో మొత్తం 3348 షేర్లు పతనం చెందాయి.941 షేర్లుమాత్రమే ఎగువకు కొనసాగాయి. 145 షేర్లు స్థిరంగా కనిపించాయి. బిఎస్ఇలో 150 మిడ్‌క్యాప్‌సూచీ కూడా 52వారాల గరిష్టంనుంచి 11.06శాతం స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 18.68శాతం క్షీణించింది. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి మరింత క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 92.43గా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2వ తేదీనాటి సెటిల్‌మెంట్ దరలు తగ్గాయి . రూ.1,59,400గా కొనసాగింది. కమోడిటీస్ మార్కెట్‌లోబ్రెంట్‌ముడిచమురు నాలుగు సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 100.50 డాలర్లుగా కొనసాగింది. ఇక షేర్లపరంగా ఐఎఫ్‌సిఐ 5.83శాతంపెరిగింది. లారస్ ల్యాబ్స్ 4.19శాతం దిగజారింది. శైలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ 0.92శాతం పెరిగింది. ఎసిఎంఇ సోలార్ హోల్డింగ్స్ 6.43శాతం దిగజారింది. యునైటెడ్‌బ్రూవరీస్ 1.64శాతం పెరిగింది. బాలాజీ అమైన్స్ 3.01శాతం పతనం అయింది. రామ్‌కీ ఇన్‌ఫ్రా 4.85శాతంపెరిగింది. పిఎన్‌జిఎస్ రేవా డైమండ్ జ్యూయెలరీ 2.49శాతం క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.